శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

ప్రబుద్ధాంధ్ర

సంపుటము ౯] రాజమహేంద్రవరము ౧౦ ఏప్రిల్ ౧౯౩౯ 1939 [౧ వ సంచిక

వ్యాఖ్యానములు

వ్యాసములు

ఆధునికాంధ్ర వాఙ్మయం

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు

తయారైవున్నవి

1.	గూడుమారిన కొత్తరికం	0—2—0
2.	కలంపోటు	0—2—6
3.	తల్లిప్రాణం	0—2—6

అచ్చులోవున్నవి

1.	ఇల్లుపట్టిన వెధవాడబడుచు	0—4—0
2.	అన్నంత పనీ జరిగింది	0—4—0

శాస్త్రిగారి గ్రంథాలు మరికొన్ని

1 రక్షాబంధనం 1-0-0. 2 శ్మశానవాటిక 0-8-0. 3 వారకాంత 0-4-0. 4 విజయనగరరాజుల కథలు 0-2-0. 5 చిత్తూరు రాజుల కథలు 0-3-0.


ఇతరుల గ్రంథాలు

1. మునిమాణిక్యం నరసింహారావుగారివి 1 కాంతం కథలు 1-0-0, 2 నేనూ మాకాంతం 0-4-0, 3 ఉపాధ్యాయుడు 0-8-0, 4 వక్రరేఖ 1-0-0.
2. మొక్కపాటి నరసింహశాస్త్రిగారివి బారిస్టరు పార్వతీశం 1వ భాగం 1-0-0, 2 ప్రతిబింబములు 0-12-0, 3 ఏకాదరులు 0-8-0.
3. రాయప్రోలు సుబ్బారావుగారివి, 1 కవితాంజలి 1-0-0, [illegible] కుచ్చులు 1-0-0.
4. కపిలేశ్వరపురం రాజాగారి పబ్లికేషను చింతలపూడి ఎల్లనార్యుని రాధామాధవము 1-8-0.
5. భమిడిపాటి కామేశ్వరరావుగారివి, 1 అప్పుడు 0-8-0, 2 అప్పుడు 0-8-0, 3 ఇప్పుడు 0-8-0, 4 నిజం 0-8-0, 5 కాలక్షేపం 0-8-0.
6. కవితాసమితివారివి, 1 వైశాఖి 1-0-0, 2 ఉత్కళ[illegible] 0-12-0, 3 ప్రభవ 0-8-0, 4 పూలమాల 0-4-0.
7. చేకమళ్ల కామేశ్వరరావుగారివి, 1 కోపదారి మొగుడు 0-8-0 2 జానకిప్రేమ మొదలైన చిన్నకథలు 0-8-0, 3 వాడుక భాష: రచనకి కొన్నినియమాలు 0-8-0.
8. దేవరాజు వెంకటకృష్ణారావుగారివి, 1 సంజయరాయబారం 1-0-0, 2 శ్రీకృష్ణరాయబారం 1-0-0, 3 కర్ణచరిత్ర 0-10-0 4 శ్రీకృష్ణుడు 0-8-0, కారవాకి 1-0-0.
9. నాళం కృష్ణారావుగారివి, 1 తేనెచినుకులు 0-8-0, 2 పాలతరగలు 0-8-0, 3 గోరుముద్దలు 0-4-0, 4 మిాగడతరకలు 0-5-0, 5 వెన్నబుడగలు 0-6-0, 6 గోగీతము 0-2-0, 7 పైడిలేడి 0-2-0, 8 ముద్దు 0-4-0, 9 దీపావళి 0-8-0, 10 విశదండ 0-8-0.
10. విశ్వనాథ సత్యనారాయణగారివి, 1 వేనరాజు 1-0-0, 2 అనార్కలీ 1-0-0, 3 కిన్నెరసానిపాటలు 1-0-0, 4 ఆంధ్రప్రశస్తి 1-0-0, 5 శృంగారవీధి 1-0-0.

మరికొన్ని

వేయిస్తంభాలగుడిశాసనం 2-0-0, మల్లికార్జునరావు 0-10-0, రత్నాపణం 0-8-0, రసాంజలి 0-2-0, వసంతము 0-4-0, కవిగారినునగడ 0-8-0, విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయ చరిత్ర 1-8-0, మునిమాపు 0-12-0, వకుళమాల 0-12-0, మహామేధావులు 1-0-0, మధ్వాచార్యులవారి చరిత్ర 1-0-0, గీతమాలిక 0-12-0, సోమనాథవిజయం 0-12-0, భాగవతావతరణం 0-8-0. సుందరి 1-0-0, హృదయవిహంగము 0-4-0, నాకాథంగము 0-12-0, ఆంధ్రమహాసామ్రాజ్యము 1-4-0, నవకుసుమాంజలి 1-4-0, ఆంధ్రకావ్యాలంకారసూత్రవృత్తి 1-4-0, ప్రాచీనాంధ్రనాకాజీవనచారిత్రం 1-0-0, చంద్రగుప్త 1-4-0, పునర్వివాహం 1-0-0, సాహిత్యమీమాంస 1-8-0, నాటకవిమర్శ 2-0-0, గోల్కొండకవుల చరిత్ర 2-0-0, రెడ్డికులనిర్ణయచంద్రిక 1-4-0, సంఘోద్ధరణం 0-8-0, తొలకరి 0-8-0.

కలాభివర్ధనీ పరిషత్తు—రాజమండ్రి



సంపుటము ౯]　　రాజమహేంద్రవరము ౧౦ ఏప్రిల్ ౧౯౩౯　　[౧ వ సంచిక

మనం అసహాయశూరుల మయితేనే రాష్ట్రసిద్ధి

"ఎట్లాగైనా ఆంధ్రరాష్ట్రం రావలె నంటే ఫెడరేషను సమస్య యిటో ఆటో తేలవలె నేమో అనిపించుచున్నది. కాంగ్రెస్సువారు, బ్రిటిషువారు కూడా దీన్ని (ఫెడరేషన్ను) ముఖ్యంగా యెంచుచున్నారు"

౪-౩-౩౯ దైనికాంధ్రపత్రిక

రాజకీయసంస్కరణసూచనలు వొక్కొక్క మెట్టే యెక్కి యెప్పుడైతే బ్రిటిషుపార్లమెంటు భవనం ప్రవేశించాయో అప్పుడే యిది సిరపడిపోయింది.

కాని. కాంగ్రెస్సాంధ్రులలో కొందరయినా యిది గ్రహించడానికి మాత్రమే యింతకాలం పట్టింది.

అంతే.

బ్రిటిషువారి ధోరణి యేమిటో, కాంగ్రెస్సు నియంతల యెత్తులెందుకోసమో, ముఖ్యంగా రాజనీతిప్రవృత్తి యేమిటో తెలుసుకోగలిగినవారికీ నిశ్చయజ్ఞానం యెప్పుడో కలిగిపోయి వుండినది.

ఏమంటే ?

బ్రిటిషువారికి భరతఖండంలో ప్రాంతీయదృష్టి అణుమాత్రమూ లేదు.

తాహతుమాలిన పను గయినా, కాంగ్రెస్సువారు, సంపూర్ణస్వరాజ్యమే తమకి సాధ్యంగా పెట్టుకున్నారు.

కాగా, చివరి కే మయినా, బ్రిటిషువారికీ, కాంగ్రెస్సువారికీ కూడా యిప్పుడు తేల్చుకోవలసిన విషయం ఫెడరేషనే అయింది.

౧౯౩౫ ఇండియా శాసనంలో వున్న దున్నట్టు ఫెడరేషను అమలు జరిగిందా, కాంగ్రెస్సు ఫైసలా అయిపోయిం దన్నమాట.

లేక, ఫెడరేషను రద్దయిపోయిందా—అంటే కాన్‌స్టిట్యూయంటు అసెంబ్లీద్వారా. మన భారతీయులు నిర్ణయించుకున్న రాజ్యాంగవిధానం అసలు జరుగుతుందా, భరతఖండంలో బ్రిటిషు ప్రభుత్వం లే దన్నమాట.

ఫెడరేష నంటే యింత ముఖ్యమైన విషయం.

వ్యవహారం అంతా ఇలాగ నివ్వరిముల్లుమీద వున్నది.

ఇలాంటి సితిలో ఆంధ్రరాష్ట్రప్రస్తావనకి అవకాశం యేదీ ?

ఆదిలోనే, మనం, మాంచెస్టరుబట్టలను కంటే యెక్కువగా గాంధిగారి కాంగ్రెస్సుని బహిష్కరించి వుండవలసింది.

అలా చేసివుంటే, మాంటుఫర్డుశాసనంతోపాటే మనకి ఆంధ్రరాష్ట్రసిద్ధి అయి వుండేది.

తరవాత అయినా మన దురదృష్టం విరగడ కాలేదు.

సైమన్‌కమిషన్ సందర్భంలో సిరి రాగా మనం మళ్లీ మోకాలొడ్డినాము.

దాంతో ఆంధ్రరాష్ట్రం వెనక్కి పోవడమే కాదు, వోఢ్రులు కొంత తెనుగుగడ్డ విరుచుకుపోయారు.

అంతటితో అయినా తీరిందా ?

మన లోకువ కనిపెట్టి, వోఢ్రులు పెట్టిన వరవడి దిద్దుకుని, మరోగడ్డ విరుచుకుపోవడానికి కన్నడులు కూడా గడ్డపార దిగవేశారు. అరవలున్నూ చిత్తూరుజిల్లాలో బలమైన వుచ్చులు పన్నుకొంచున్నారు.

ఇంత జరిగినా—ఇప్పు డయినా కాంగ్రెస్సుని బహిష్కరించకుండా మనం ఆంధ్రరాష్ట్రం కోసం అర్రులు చాపితే యేమి లాభమూ ?

ఏతావతా :

బ్రిటిషువారు ఫెడరేషను తప్పకుండా అమలుచేస్తారు.

నిరభ్యంతరంగా అమలు చేస్తారు.

అయితే, తమ సహజప్రవృత్తి ననుసరించి నయాన వ్యవహరించే ఉద్దేశంతోటే వారు కాలహరణాని కంగీకరిస్తున్నారు.

కాంగ్రెస్సువారున్నూ యిప్పు డున్న రూపంతోటే ఫెడరేషను నిస్సందేహంగా స్వీకరిస్తారు.

దయతో స్వీకరిస్తారు.

అయితే, హిమాలయపర్వతంతో కూడా, భరతఖండం యావత్తూ అరేబియాసముద్రంలో మునిగిపోకుండా వుండడానికే తాము ఫెడరేషను స్వీకరిస్తున్నట్టు ప్రజలచేత భావింపించు కోడానికి మాత్రమే వారు మార్గాలు వెతుక్కుంటున్నారు.

ఆ ఫెడరేష నేనా పన్నెండు మాసాల ప్రయాణం కంటే యెక్కువ దూరంలో లేదు.

కనక, ఫెడరేషనుకు ముందే మనకి ఆంధ్రరాష్ట్రం రాదే అని మనం బెంగపెట్టుకోవలసిన అగత్యమున్నూ లేదు.

మరి తరవాతి మాటా ?

ఈస్థితిలో మనం ఆలోచించతగ్గ దిదే.

అప్పుడు, తమకి తామై బ్రిటిషువారు ఆంధ్రరాష్ట్రనిర్మాణానికి పూనుకుంటారా ?

ఇది యెన్నడూ జరగదు.

కాని, తెనుగుజిల్లాలకు సంబంధించిన వివరా లన్నీ వారికి తెలుసు.

మనకంటే బాగా తెలుసు.

తెనుగుజిల్లాలను వొక ప్రత్యేకరాష్ట్రంగా విడతియ్యవలసిన అగత్యం వున్న దనిన్నీ వారికి తెలుసు.

ఆంధ్రరాష్ట్రం నెలతక్కువబిడ్డ కాదనీ, సొంతంగా — రాజాంగంగా బతగ్గల దనీ, విడితీస్తేనే తెనుగుజిల్లాలు సర్వసంపన్నవృద్ధా లవుతా యనీ, అప్పుడే మన ఆంధ్రజాతి సర్వవిధాలా బాగుపడుతుం దనిన్నీ వారికి తెలుసు.

మన కీ కోరిక వున్న దనిన్నీ వా రెరుగుదురు.

పైగా ఆంధ్రరాష్ట్రం విషయమై వారికి ప్రాతికూల్యమున్నూ లేదు.

ఉండడానికి హేతువూ లేదు.

కావలసినంత అనుకూల్యమే వున్న ది.

మాంటుఫర్డుశాసనం—సైమన్‌కమిషన్‌రిపోర్టు వంటి రికార్డులలో వారీ విషయం వుల్లేఖించే వుంచారు.

ఇక వున్న దల్లా యేమి టంటే ?

ఆంధ్రరాష్ట్రనిర్మాణానికి తమకి తామై పూనుకోవలసిన అగత్యం వారి కేమీ లేదు.

పూనుకోకపోతే వారి కేమి చెడిపోతుందీ ?

ఇక్కడ మద్రాసుగవర్న మెంటు ఆగిపోతుందా ?

ఇండియాగవర్న మెంటు వొడిదుడుకుల్లో పడిపోతుందా ?

బ్రిటిషుపార్లమెంటుకి వూపిరి సలపని పరిస్థితు లేర్పడతాయా ?

సర్వమూ చక్కగా నడిచిపోతూ వుండగా, తీగ లాగి యెవరేనా డొంకంతా కదుపుకుంటారా ?

వారి చేతిలో మన మద్రాసురాష్ట్రం వొక్కటే కాదు, కలగలుపు రాష్ట్రాలు బొంబాయివంటి వింకా వున్నాయి.

అన్నీ ముద్దుముద్దుగానే జరిగిపోతున్నాయి.

భరతఖండానికి భరతఖండమే తమ అధీనంలో వుంచుకుని వున్న బ్రిటిషువారికి, కలగలుపు రాష్ట్రాలు పాలించడం వొక లెక్కలోది కాదు

కనక ?

రాష్ట్రావశ్యకం మనది.

బ్రిటిషువారిది కాదు.

అది సిద్ధించేదాకా నిద్రాహారాలు మానుకుని పనిచెయ్యవలసిన వాళ్లం మనం.

తక్కిన కార్యక్రమం అంతా నిలుపుచేసుకుని, ముందు, ఆంధ్రరాష్ట్రం నిర్మించవలసిన తొందర బ్రిటిషువారికి లేదు.

ఎంత మాత్రమూ లేదు.

పోనీ,

ఫెడరేషను ఏర్పడ్డతరవాత అయినా, ఆంధ్రరాష్ట్రం కోసం కాంగ్రెస్సువారు ప్రయత్నిస్తారా ?

అసంభవం.

అది కలలో మాటా, నీటిమీది రాతానూ.

అది వారికి జ్ఞాపకమే వుండదు.

కాంగ్రెస్సాంధ్రులు సవినయంగా జ్ఞాపకం చేసినా వారు లక్ష్యపెట్టరు.

ఏమంటే ?

వారు ఆంధ్రరాష్ట్రానికి విముఖులు.

వారికి మాటనిలకడా లేదు.

వారు క్రిమినల్ లా అమెండుమెంటు ఆక్టును పడతిట్టారు. ఎవరూ తిట్టలేనంత యెక్కువగా తిట్టిపోశారు.

కాని, అధికారం చేతికి వచ్చినా వారు దాన్ని రద్దుచెయ్యలేదు.

పైపెచ్చు నిర్దోషులమీద పెట్టి రుద్దుతున్నారు.

న్యాయకార్యనిర్వాకశాఖలు విడతియ్యా లనిన్నీ వారు చెబుతూ వుండినారు.

యాభైరెండు సంవత్సరాలనుంచి చాలా కచ్చితంగా చెబుతూ వుండినారు.

అలా చెయ్యనందుకు దొరతనంవారిని దూషిస్తూనూ వుండినారు.

కాని అధికారం చేతికి వచ్చినా విడతియ్యలేదు.

విడతియ్యనక్కర్లే దంటున్నారు.

విడతియ్యకపోవడమే మంచి దని కూడా అంటున్నారు.

మరిన్నీ, దేశంలో, పన్నులు జాస్తీగా వున్నా యనీ, భారం

గానూ వున్నా యనీ వారు మొన్నటి దాకా సర్కారువారిని నిరసిస్తూ వుండినారు.

తమకి వోటుచేసి, ప్రజలు, అధికారం సంక్రమింప చేస్తే రకమూ, రాశీ కూడా తగ్గించివేస్తా మన్నారు.

కాని తగ్గించలేదు, సరికదా, హెచ్చిస్తున్నారు.

"హెచ్చించకపోతే ప్రభుత్వం నడవడం యెలాగా" అని యెదు రడుగుతున్నారు.

ముద్దినుసుపన్నులూ కల్పిస్తున్నారు.

"మీ రేం చేసినా సరే మేము హెచ్చించక మానం" అని సవాల్ చేస్తున్నారు.

"అప్పుడే—ఇంతటితో ముగిసిందా?" అన్నట్టు కూడా ముదలకిస్తున్నారు.

తమ యెన్నికల ప్రకటనలో సాయించిన ధర్మాలే యింత బడివాటుగా వుల్లంఘిస్తున్న కాంగ్రెస్సువారా ఆంధ్రరాష్ట్రం కోసం ప్రయత్నిస్తారు?

ఇదిన్నీ యెన్నడూ జరగదు.

పైపెచ్చు, వారు, మన ప్రయత్నాలను ప్రతిఘటిస్తారు.

ప్రతిఘటించడానికే వారికి దృఢవ్రతా లున్నవి.

కాంగ్రెస్సాంధ్రులను కూడా దిగతీసెయ్యడానికే వారికి సంకల్పా లున్నవి.

సలహాలున్నూ కావలసినన్ని వున్నవి.

దిగతియ్యకపోతే వారికి చిక్కులున్నూ వున్నవి.

కనక, ఆంధ్రరాష్ట్రనిర్మాణం తప్పకుండా జరగా లంటే మనకీ బ్రిటిషు పార్లమెంటువారికీ మధ్య యీ కాంగ్రెస్సు దుబాసీ అగత్యం యెంతమాత్రమూ లేదు.

ఒకరి సంపర్కం లేకుండా—వొకరి సాయం లేకుండా—వొకరి సలహా కూడా లేకుండా సొంతంగా ప్రయత్నించగలిగినప్పుడే మనకి రాష్ట్రసిద్ధి.

ఎప్పటి కయినా అసహాయశూరుల మయితేనే మనం రాష్ట్రం సంపాదించుకోగలుగుతాం.

కాంగ్రెస్సుని విడిచిపెడితేనే—బహిష్కరిస్తేనే—ఎదురుకుంటేనే మనం రాష్ట్రం తెచ్చుకోగలుగుతాం.

బెజవాడలో, ఆంధ్రపార్లమెంటువారి పతాకోత్సవంలో శ్రీతంగిరాల రాధాకృష్ణయ్యగారు దృఢంగా బలపరిచిం దిదే.

యథార్థమున్నూ యిదే.

అయితే, యీవిషయమై కార్యక్రమం యేర్పరుచుకోవడంలోనూ, దాన్ననుసరించి ప్రచారం చెయ్యడంలోనూ, మన దృష్టి అంతా దీనిమీద కేంద్రీకరింపచేసుకోవడంలోనూ మాత్రమే మన విజయానికి బలమైన హేతువులూ తగిన సన్నివేశాలూ యేర్పడతాయి.

పెద్దలలో మాత్రమే ఆంధ్రరాష్ట్రవాంఛ వుంటే చాలదు.

అది జనసామాన్యంలో పుట్టాలి. జనసామాన్యంలో అల్లుపోవాలి. జనసామాన్యాన్ని వూపెయ్యాలి. జనసామాన్యంలో నుంచే బహిర్గతం కావాలి.

ఇది సమకూడా లంటే పరిస్థితు లన్నీ వారికి వివరించి చెప్పాలి.

మన మద్రాసురాష్ట్రం సాలీనా ఆదాయం యెంతో, ఖర్చెంతో—అందులోనూ ఏజిల్లానుంచి యెంత వసూ లవుతున్నదో, యేజిల్లాలో యెంత ఖర్చు అవుతున్నదో, సమస్తవిషయాలలోనూ తెనుగుజిల్లాలలోనూ అరవజిల్లాలలోనూ యెలాంటి, యెంతటి వ్యత్యాసం కనపడుతున్నదో, ఆవిషయమై కాంగ్రెస్సు మంత్రాంగం వైఖరి యెలా వున్నదో, తెనుగు మంత్రులూ, తెనుగు పార్లమెంటరీ శక్రటరీలూ, తెనుగు శాసనసభ్యులూ యేస్థితిలో వున్నారో నీహార లేశాలు కూడా లేకుండా ప్రకటించాలి.

విద్యాధికులై వున్న ఆంధ్రయువకులలో నిరుద్యోగులై—దిగ్భ్రాంతులై—జీవచ్ఛవాలై పడివున్నవారి నంబర్లు తయారుచేసి యీ ప్రచారం సాగించాలి.

గాంధిగారి కద్దరుద్యమంలో వుండే నిగూఢరహస్యం యేమిటో, దానివల్ల మనకి సంభవిస్తున్న సర్వనాశం యెంత యెక్కువగా వున్నదో, లాంకషైరు మాంచెష్టరు మిల్లులకంటేకూడా బొంబాయి అహమ్మదాబాదు మిల్లులు మన కెంత నష్టం కలిగిస్తున్నవో, ఎంత రక్తం పీల్చేస్తున్నవో, గాంధిగారు, కద్దరు చాటున ఆమిల్లుల నెంత బలపరుస్తున్నారో అతివివరంగా ప్రచారం చెయ్యాలి.

ఈపరిజ్ఞానం ముఖ్యంగా వర్తకులకు కలిగించాలి.

ఇలాగ తీవ్రప్రచారం చేసి ఫెడరేషను యేర్పడా టప్పటికి ఆంధ్రరాష్ట్రనిర్మాణం బ్రిటిషువారికి తప్పనిసరి అని తోచేటట్టు చెయ్యాలి.

బ్రిటిషువారితో ముందు శాసనాతిక్రమణం చెయ్యకుండానే వ్యవహరించాలి.

శాసనాతిక్రమణాని కిప్పటివరకూ కారణా లేర్పడలేదు.

లోటంతా మనదగ్గిరే వున్నది.

మనం చెయ్యవలసిందీ, చెయ్యగలిగిందీ యింతవరకూ ప్రారంభించనే లేదు.

ఇలా చేస్తే ఫెడరేషను ఏర్పడగానే ఆంధ్రరాష్ట్రం యేర్పడుతుంది. ఈలోపున ఏంచేసినా లాభం లేదు.

వచ్చిన అవకాశా లన్నీ మనం జారవిడుచుకున్నాం.

ప్రకృతం అవకాశం లేదు.

ప్రచారం మానేస్తే యెప్పటికీ అవకాశం రాదు.

"ఆత్మోదయః పరగ్లానిః—ద్వయం నీతిః"

అరవసోదర్లను మేము మనస్ఫూర్తిగా ప్రశంసిస్తున్నాము.

ఎంచేత నంటే?

వారు, సుభాసుబోసుగారికి, కాంగ్రెస్సు అధ్యక్షతకు సంబంధించిన యెన్నికల్లో అనుకూల్యమూ చూపించారు. మళ్లీ, త్రిపురిలో, ఆ అధ్యక్షతకే సంబంధించిన నిర్వహణంలో ప్రాతికూల్యమూ చూపించారు.

ఆచూపించడం కూడా యిలాగా అలాగా కాదు, ఇక్కడా అక్కడా—ఇదీ అదీ కూడా కచ్చితంగానే—సమగ్రంగానే చూపించారు.

అరవసోదర్ల యీ ప్రవృత్తే బోసుగారి ఆవిజయానికీ, యీఅపజయానికీ సన్నికృష్టహేతు వైనది.

ఈపని చెయ్యడంలో వారు కాస్తైనా శ్రమపడలేదు; కాని మహత్తరఫలితాలు మాత్రం సాధించుకున్నారు.

అవి రెండు.

ఒకటి, ఆంధ్రుడు కాంగ్రెస్సు అధ్యక్షుడు కాకుండా పోవడం.

రెండు, కాంగ్రెస్సులో గాంధిగారి నాయకత్వం నిలవడం—అంటే మద్రాసులో తమ మంత్రాంగానికి భంగం కలక్కపోవడం.

మన పట్టాభిగారే అధ్యక్షు లయి వుంటే, కొద్ది రోజుల పాటే అయినా, గాంధిగారికి మర్మస్పృక్కయిన మనస్తాపం కలిగి వుండకపోయివుండే దంటే నిజమే.

ఫెడరేషనుముగ్గులు, త్రిపురిలో, కూటయుద్ధం చెయ్యవలసిన అగత్యం కలక్కపోయి వుండేదంటే కూడా సత్యమే.

కాని ఆంధ్రు డెందు కధ్యక్షుడు కావాలీ!

నిజానికి మన పట్టాభిగారే అధ్యక్షు లయితే మద్రాసు తమకు తక్కకుండా పోతుం దని అరవలకు భయం లేదు.

మన పట్టాభిగారే అధ్యక్షు లయితే, మద్రాసుప్రెసిడెన్సీని బద్దలుకొట్టించి ఆంధ్రమండలాలను ప్రత్యేకించుకుపోతా రని కూడా వారి కనుమానం లేదు.

అసలు, మన పట్టాభిగారు ఆంధ్రరాష్ట్రం కావా లనే ఆవేదన కలవారు కానేకా రని వారికి లెస్సగా తెలవనే తెలుసు.

గాంధిగారిచేత—అధవా పటేలుగారిచేత—చివరికి బూలాభాయిగారిచేత వొక్కకలంపోటు పొడిపించి పట్టాభిగారిని నిమిషంలో నీరవులను చేసెయ్యవచ్చు ననిన్నీ వారికి తెలుసు.

కాని వున్న దల్లా వొక్కటి.

ఆంధ్రు డెందు కధ్యక్షుడు కావాలీ?

గాంధిగారు రాకపూర్వమూ ఆంధ్రుడు కాంగ్రెస్సుచేత గుర్తింపించుకోలేకపోయాడు. వారు వచ్చాకా గుర్తింపించుకోలేకపోయాడు.

ఆంధ్రుడు నిర్వహించిన ఘనకార్యం యేమీ లేదు. ఆంధ్రుడికి ప్రత్యేకంగా వొక కార్యక్షేత్రమే లేదు.

తనకి ప్రత్యేకత వున్న దని ఆంధ్రుడే యెరగడు. మద్రాసు పేరు చెబితే అరవకే గాని ఆంధ్రుడికి ప్రతిపత్తి (Recognition) లేదు.

అలాంటి ఆంధ్రు డెందు కధ్యక్షుడు కావాలీ?

ఆంధ్రుడు కాంగ్రెస్సు కేమీ ఆదేశం యివ్వలేదు. కాని కాంగ్రెస్సు ఆదేశం కోసం మాత్రం ఆంధ్రుడు యెదురుతెన్నులు చూస్తాడు.

ఆంధ్రు డంటే కాంగ్రెస్సుకి లెక్కా జమా లేదు; కాంగ్రెస్సంటే మాత్రం ఆంధ్రుడికి గడగడ.

ఆంధ్రుడు భీష్మించుకూర్చుంటే కాంగ్రెస్సు కేమీ తరిగి పోదు. అయితే, కాంగ్రెస్సుకి వెళ్లకపోతే మాత్రం ఆంధ్రుడు పిచ్చివా డయిపోతాడు.

అలాంటి ఆంధ్రు డెందు కధ్యక్షుడు కావాలీ!

భోజనం మానుకుని అయినా యెలాగో వొకలాగ ఆంధ్రుడు కాంగ్రెస్సులో కూచుంటాడు; కాని అక్కడ ఆంధ్రు డొక్కడూ ఆంధ్రుణ్ణి గుర్తించుకోలేడు.

భరతఖండంలో—

పూర్వచరిత్రను బట్టి చూస్తే ఆంధ్రుడు సమ్రాట్టు.

ప్రకృతం భాషలను బటి చూస్తే ఆంధ్రజాతి మూడోది.

అయితే?

ఏమిటి అయితే?

కాంగ్రెస్సు యాభై రెండు సంవత్సరాలు గడిపింది.

అంటే, కాంగ్రెసు సింహాసనం యాభై రెండుమాట్లు కాళీ పడింది.

ఎవరెవరో దాన్ని ఆక్రమించుకుంటూ వచ్చారు.

ఒక్కొక్కరు రెండేసిమాట్లు—మూడేసిమాట్లు కూడా అనాయాసంగా ఆక్రమించుకున్నారు.

కాని ఆ ఆక్రమించుకున్నవారిలో ఆంధ్రు డొక్కడూ లేడు.

కాంగ్రెస్సు అధ్యక్షత ఆంధ్రుడికి నిర్దిష్టమైనది కానే కాదు.

ఆంధ్రుడు కాంగ్రెస్సులో భృత్యపదవి కంటే యెప్పుడూ వున్నత మైనది ఆక్రమించుకోలేదు.

అలాంటి ఆంధ్రు డెందు కధ్యక్షుడు కావాలీ?

పట్టాభిగారి అధ్యక్షతను ప్రతిఘటించడానికి అరవలకు గల కారణా లివేనా అంటే కానూ వచ్చు, కాకపోనూ వచ్చు.

ఇక చెప్పవచ్చిం దేమి టంటే?

అరవలమీద అధికారం చెలాయించా లనుకున్నా, అరవలతో సమానపదవి పొందా లనుకున్నా, అరవలను యెదిరించినా—చివరికి అరవలను అనుసరించి వెళ్లకపోయినా ఆంధ్రుడు కాంగ్రెస్సు అధ్యక్షుడు కాలేడు.

ఏమీ కాలేడు.

ముమ్మాటికీ కాలేడు.

గాంధిగారు పూనుకువచ్చినా కాలేడు.

కాలేకేపోయాడు.

అయితే, బోసుగారిని నెగ్గించడంవల్ల గాంధిగారికి దెబ్బ తగల్లేదూ అంటే తగిలే వుండవచ్చు.

అది తప్పనిసరి.

ఆటలో అరటిపండు.

అందుకు జడిసి మరోలాగ చెయ్యడానికి వీల్లేదు.

ఏమంటే ?

"స్వయం తీర్ణః పరాం స్తారయతి"

కొన్ని కారణాలవల్ల పట్టాభిగారూ, మరికొన్ని కారణాలవల్ల బోసుగారూ కూడా అరవలకు సమానులే.

కనక, యిద్దరూ పడిపోవలసిందే.

అయితే, అది యేక కాలంలో సాధ్యం కాదు.

ఒకరు ముందూ, మరొకరు తరవాతానూ.

ఒకరొక విధంగానూ, మరొకరు మరొక విధంగానూనూ.

మొత్తానికి రెండూ తప్పనివే.

చివరికి తప్పనే లేదు కూడానూ.

పర్యవసానం ?

"ఎక్కడయితే యేం, మా తా మా కున్న" దన్నట్లు యెలా అయితే యేం, గాంధిగారి పదవి గాంధిగారికి తక్కింది.

నోటీసు లేకుండా మబ్బులు కమ్మాయి. సుడిగాలి విసిరింది. దుమారం రేగింది. ఉరుములు, మెరుపులు, వడగళ్లు—అల్లకల్లోలం అయిపోయింది.

కాని అంతా సద్దణిగిపోయింది.

ఎక్కడి దక్కడే వుంది.

ఎలా వుండవలసిం దలాగే వుండింది.

ఊతం లేనివి మాత్రం ఉఫ్—న యెగిరిపోయాయి.

అంతే!

ఎంత చక్కని రాజనీతిపరిజ్ఞానం!

ఎంత జటిల మైన కల్పన!

ఎంత అసాధారణ మైన విజయం!

ఎలాంటి క్లిష్టపరిస్థితులు ముంచుకువచ్చినా చెక్కుచెదరని ధైర్య సాహసాలూ, నిశిత మైన సమయపరిజ్ఞానమూ, అప్రతిహత మైన సద్యస్ఫూర్తీ—ఇవాళ, దక్షిణదేశానికంతకీ వొక్క అరవల సొత్తుగా కనపడుతున్నది.

అంచేతనే వారికి, అంతటా — యెప్పుడూ—సర్వవిధాలా విజయం.

తేజోమండలంలో అంధకార తాండవమా ?

ఆంధ్రరాష్ట్రీయకాంగ్రెస్సుసంఘంవారు, వైస్‌ఛాన్సలరు పదవికి, కట్టమంచి రామలింగారెడ్డిగారిమీద కోటి రెడ్డిగారిని పోటీపెట్టడం చాలా అసహ్యంగా వున్నది.

ఈసందర్భంలో వారు చేసిన ప్రచారం కూడా గర్హ్యంగానే వున్నది.

ఆంధ్రు డైనవాడు మెచ్చుకోతగ్గ దిందులో అణుమాత్రమూ లేదు.

ఇటీవల, ఆంధ్రయునివర్సిటీవారు చిన్న చిన్న గ్రాంట్లివ్వ కాంగ్రెస్సుగవర్న మెంటు నిస్సంకోచంగా తిరస్కరించేసి ఆంధ్ర మెడికల్ కాలేజీపట్ల గూడా అది సవతితల్లి ప్రేమే స్తున్నది.

దీనికీ, యిలాటివాటికీ వైస్‌ఛాన్సలరు కాంగ్రెస్సుసభ్యుడు పోవడమే కారణ మని ఆంధ్రరాష్ట్రీయకాంగ్రెస్సు రుజువుచే తలచుకున్నదా ?

కాంగ్రెస్సేతరుడే యిప్పుడు కూడా వైస్‌ఛాన్సలరు కావ వల్ల—కాంగ్రెస్సు అభ్యర్థి వోడిపోవడంవల్ల కూడా, కాంగ్రె గవర్నమెంటు, ఆంధ్రయునివర్సిటీ కికముందున్నూ దబ్బేమీ యి దని మనం అనుకోవలసి వున్నదా !

ఆదికాలంలో, ఆంధ్రయునివర్సిటీకి, రామలింగారెడ్డిగారివ సంభవించి వుండిన అపకారాలు మేమిప్పటికీ మరిచిపోలేదు.

పోనీ అంటే వారు రాజకీయాలలో కూడా కలగచేసుకుంటూ వుంటారు.

అయినా సరే అంటే, వారి ఆరాజకీయజీవితానికి వొక దారీ తెన్నూ కనపడదు.

"అసలు, ఏదో వొక సంస్థను—ఒక ఉద్యమాన్ని అంటిపెట్టు కుని వుండి పరమావధిని చేర్చే లక్షణాలు వారిలో కనపడవు"

దీనికి నిదర్శనంగా :

కిందటిమాటు, ఈపదవికే పోటీచేసి నెగ్గినప్పుడు, వారు, కాంగ్రె స్సుసభ్యులు.

అప్పుడు, ప్రభుత్వం, జస్టిస్సుపక్షంవారి అధీనంలో వున్నది.

ఈమాటు మళ్లీ పోటీ వచ్చేటప్పటికి, వారు, కాంగ్రెస్సు వున్న కుళ్లంతా తిరగతోడి, కుట్ర అంతా బయటపెట్టి, అప్రశ అంతా రుజువుచేసి కాంగ్రెస్సు సంబంధం పూర్తిగా తెంచేసు వున్నారు.

ఇప్పుడు, ప్రభుత్వం, కాంగ్రెస్సువారి అధీనంలో వున్నది.

ఇదంతా మంచిదా, బాగున్నదా అంటే యిదంతా కాం స్సువా రిదివరకే అనుభవించి వుండనిదా ?

౧౯౩౮ లో, అసెంబ్లీయెన్నికలకోసం వారు చేసుకున్న సర మంతా భగ్నం చేసి, చిత్తూరుజిల్లాబోర్డు అధ్యక్షతకు కూడా తిల దకాలిప్పించి, కాంగ్రెస్సువారే ప్రోత్సహించీ, బుజ్జగించీ, మాలీ, ప్రాధేయపడీ వారిని వైస్‌ఛాన్సలరుపదవిలో ప్రవేశపె నప్పటికీ యిప్పటికీ వారి యోగ్యతలలో హెచ్చుతగ్గు వించి వుండలేదే ?

విద్వత్తకూ, విద్యాశాఖాపరిపాలకతకూ వుండవలసిన యో తలనే పరిగణించినా, రామలింగారెడ్డిగారితో పోల్చతగ్గవ కాంగ్రెస్సాంధ్రు లందరిలోనూ వొక్కరయినా కనప

ఆశించడానికి వీలు లేనట్టి—అనుకోడానికయినా అనువు తిరువాన్కూరు హైదరాబాదు సంస్థానాల పెద్ద పెద్ద వి సంపాదించడంలో రామలింగారెడ్డిగారు చూపించిన చా

శుష్క-హృదయాల నైనా కృతజ్ఞతార్హాలు చెయ్యవలసి

ంటి స్థితిలోనా కాంగ్రెస్సాంధ్రులు వారిని పడగొట్టాలని
ంచడం?

వల్ల, కాంగ్రెస్సుకి, పరస్త్రీయస్సహానం లేదని వెల్లడి
ం తప్ప మరో ప్రయోజనం లేదు.

లగనూ లేదు.

ఇంతకీ:

కాంగ్రెస్సాంధ్రులు ఆంధ్రరాష్ట్రం సంపాదించగల సమర్థులు
రూ కనపడరు.

జస్టిస్సాంధ్రులు ప్రసాదించిన ఆంధ్రయునివర్సిటీని, దాని మానాన
న్ని బతకనిచ్చేటట్టూ లేరు.

వైజ్ఞానికంగా ప్రత్యేకయోగ్యతలు లేనివారిని వైస్‌ఛాన్సలరు
దవిలో ప్రవేశపెట్టడం అంటే ఉన్నతవిద్య అభ్యసించే అసం
్యాక యువయువతులకు శిరచ్ఛేదం చెయ్యడం కాక మరేమిటీ?

వెనక వొకప్పుడు మద్రాసు పచ్చయ్యప్ప కాలేజీలో వొక వుప
్యాసకుని పదవి ఖాళీ అయినది.

అప్పటికి సర్. త్యాగరాయ శెట్టిగారు బతికివున్నారు.

శెట్టిగారే అప్పుడు పచ్చయ్యప్పధర్మసంస్థకు అధ్యక్షు లయి
ండినారు.

జస్టిస్సుపక్షం అప్పుడు వసంతపూర్ణచంద్రబింబం వతుగా తేజ
స్తున్నది.

ఆవుపన్యాసకుని పదవిని బ్రాహ్మణులూ బ్రాహ్మణేతరులూ
డా యెందరో ఆశించినారు.

ఆ సందర్భంలో నగరం అంతా చాలా ఆదుర్దాపడిపోయింది.

అసలు, ఆసంస్థను ప్రారంభించినవారు బ్రాహ్మణేతరులు
ం—సరిగా ఆసమయంలో ఆసంస్థ అధ్యక్షుడు కూడా
ాహ్మణేతరుడే కాక, బ్రాహ్మణేతరాభిమానే కాక—బ్రాహ్మ
రోద్యమప్రారంభకుడే కావడం—అభ్యర్థులలో కూడా బ్రాహ్మ
ణులనేకు లుండడం—ఇదంతా చూసి బ్రాహ్మ లందరూ
కు ఆశలు వదులుకున్నారు.

కాని శెట్టిగారు ఆపదవి వొక ఆంధ్రబ్రాహ్మడి కిచ్చారు.

అది చూసి బ్రాహ్మణు: బ్రాహ్మణేతరులూ కూడా చకితు లయి
యారు.

దీనిమీద, కుపితు లైన బ్రాహ్మణేతరప్రముఖులకు అప్పుడు శెట్టి
రు చెప్పిన జవాబిదీ.

'నియమించవలసిన వుపన్యాసకు డొక్కడు; కాని ఆవుపన్యా
నివల్ల విజ్ఞానవంతులు కావలసివున్న బ్రాహ్మణేతరవిద్యార్థులు
. బ్రాహ్మణేతరోపన్యాసకులు సర్వసమర్థులు లేకపోలేదు;
యిప్పుడు పోటీపడుతున్నవారిలో ఆబ్రాహ్మడొక్కడే సమ
ఈపోటీలోనే వున్న బ్రాహ్మలలో కూడా ఆయన వొక్కడే
సమర్థుడు. ఒక్క బ్రాహ్మణేతరపండితుని సుస్థితికోసం వందలకొద్దీ
బ్రాహ్మణేతరయువకుల భవిష్యత్తు పాడుచేయడం మంచిదా?"

ఏదీ, కాంగ్రెస్సాంధ్రులలో యిలాంటి దూరదృష్టి యేదీ?

ఇంతటి ఔదార్యం యేదీ?

ఈపాటి సౌజన్యమున్నా యెక్కడా?

ఎవరో చెబితే డుడుంగు మని గేలం వెయ్యడం తప్ప యిందులో
"మన ఆంధ్రనాయకులు అపారప్రతిభావంతు" లని పొంగిపోడా
నికీ, గర్వించడానికీ అవకాశం యేదీ?

దీన్నిబట్టి గాంధిగారి కాంగ్రెస్సు ఆంధ్రులలో ఆంధ్రుల కలాగ
భేదాలు కల్పిస్తున్నదో దేశీయులు గుర్తించవలసి వున్నది.

రాష్ట్రీయకాంగ్రెస్సుకి గుణపాఠం చెప్పిన సెనేటర్లను మేము
చాలాచాలా ప్రశంసిస్తున్నాము.

అయితే, వారిలో కొందరు పాక్షివిషలిప్తులు కనపడుతున్నారు.

విజ్ఞానకేంద్రంలో సంకుచితచిత్తుల వునికి మంచిది కాదు.

సమయంవచ్చినప్పుడు, దేశీయులు, వారికికూడా గుణపాఠం నేర్ప
వలసి వున్నది.

"పూర్వరంగః ప్రసంగాయ నాటకీయస్య వస్తునః"

"భారతప్రభుత్వమువారు యీశాసనసభ తీర్మానమును, యీప్రభు
త్వముయొక్క సలహాను భారతమంత్రికి తెలియజేసినట్లు ౧౯౩౭
మెయి ౧౧వ తేదీని తెలిసినది. భారతమంత్రి ప్రతికూలంగా
జవాబు నిచ్చిరి. నేను మరల గట్టిగా వ్రాసితిని. దానికి గూడా
ప్రతికూలంగానే జవాబు వచ్చినది. ఈవిషయం ఉత్తరప్రత్యుత్తరము
లలో నుండుటచేత అందుకు సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరములను
ప్రకటించుట సమంజసము కాదు"

మద్రాసు (౨౪-౩-౩౮) అసెంబ్లీలో గ్రంధి వెంకటరెడ్డిగారి
ప్రశ్నకి ప్రధానమంత్రి జవాబిది.

అనుకున్నదే.

కొత్త యేమున్నదీ?

ఒక రాష్ట్రం యేలుతున్న ప్రధానమంత్రి రాస్తేనే కాదు,
అఖిలభారతమూ యేలుతున్న వైస్రాయి రాసినా యిప్పట్లో యిదే
జవాబూ.

రాత ధోరణిని బట్టి జవాబు వాలకం కూడా భిన్నంగా వుండ
వచ్చునే; కాని యెన్ని మాట్లు రాసినా—యెంత గట్టిగా—
రాసినా ఫలితం యింతే.

ఏతావతా:

'అసలు, మద్రాసు అసెంబ్లీలో నెగ్గిన తీర్మానమే నిష్ప్రయోజ
నంగా వున్నది.

దానికి సాయం మద్రాసు ప్రధాని సిఫార్సులా వున్నదో?

"తిరపతి దాకా—తిరపతి కూడా మాదే" అంటున్న అరవ
లెలాంటి వ్యూహాలు పన్నుతున్నారో?

చీటికీ మాటికీ సీమకి వెళుతూ వచ్చిన బూలాభాయి, సప్రూగార్లు, అక్కడ, యెవరితో నేనా యీసంగతి మాట్లాడి కూడా వున్నారేమో ?

ఈడ్పుగంటి రాఘవేంద్రరావుగారు భారతమంత్రికి సలహాదారుగా వెళుతున్నా రంటే మనకి కొంత బలం కలగవచ్చునని మనవాళ్లు కొందరనుకుంటున్నారే, ఆరవలకు కూడా అలాంటి సన్నివేశాలుండినా యేమో ;

తెనుగు రాయబారులను నిలువునా హేళనచేసి విడిచిపెట్టిన కాంగ్రెస్సువర్కింగుకమిటీవారి జవాబే భారతమంత్రి నిలాంటి నిశ్చయానికి తెచ్చి వుంచిం దేమో ?

అన్నిటికంటే ముందు, చాలా రక్తికట్టేసిన సాంబమూర్తిగారి లండన్ ప్రయాణమే యెంత ఔదార్యవంతులైన ఆంధ్రేతరుల కయినా ఆంధ్రోద్యమం అంటే తృణీకారభావం పుట్టించేస్తుం దేమో ?

ఆంధ్ర, భారతశాసనసభ్యు లేదో ప్రకటన చేసినట్టున్నారు.

పరిస్థితులు వారి కేమయినా బోధపడ్డాయా ?

మద్రాసు తీర్మానాన్ని అందిపుచ్చుకుని భారతశాసనసభలో తాము చేసిం దేమీ లే దని వారు గుర్తించుకున్నారా ?

"ఇండియామంత్రిపై యేమాత్రం ఒత్తిడి కలిగించినా అది స్థానికమంత్రులపై తప్పక ప్రతిబింబిస్తుంది. మనం కాంగ్రెస్సువాళ్లము. కాంగ్రెస్సుకి విధేయులము. కాబట్టి మంత్రులకు ఇబ్బంది కలిగించలే" మంటున్నారు పట్టాభిగారు.

పటేలు ప్రభృతుల సౌజన్యం వెల్లడి అయిన తరవాత కూడా—గాంధిగారి యెత్తులు స్పష్టపడిపోయాక కూడా—అరవల రాజనీతి, చీకట్లు తొలగించిన తరవాత కూడా యింకా యీ మాటేనా ?

"ప్రధానమంత్రి చెప్పనదానిని నమ్మొద" మంటున్నది (౨౪—౩—౩౯) ఆంధ్రపత్రిక.

ఇంకానా ?

కారణం ?

అసెంబ్లీ తీర్మానం భారతమంత్రిచేత తిరస్కరించపడిన సంగతి ౧౧ మాసాలు గుప్తపరిచి వుంచినందుకా ?

బడ్జెట్టు చర్చలలో, కాంగ్రెస్సాంధ్రులు సవినయంగానే ప్రార్థించినా "ఆంధ్రరాష్ట్రం" అనే మాట అయినా నోటికి రాకుండా గంభీరోపన్యాసాలు చేసినందుకా ?

కాంగ్రెస్సాంధ్రుల విషయపరిజ్ఞానమూ, పరిశీలనాశక్తీ యెంత నిశితంగా వున్నవీ ?

వారి కార్యవాదమున్నూ యెంత మహోన్నతపథాలలో వున్నదీ ?

ఆంధ్రజాతి యిప్పుడయినా కళ్లు తెరవకపోతే యితరు లింకా లోకువ చేస్తారు.

భారతమంత్రితో, మన ప్రధానమంత్రి, యింకా ఉత్తరప్రత్యుత్తరాలు జరపడంవల్ల కాలహరణం తప్ప మరో ప్రయోజనం వుండదు.

భారతమంత్రితో జరిగిన ఉత్తరప్రత్యుత్తరా లింకా కుండా వుండడంవల్ల ఆంధ్రోద్యమంమీద చన్నీళ్లు దిమ్మటవుతుంది కాని మరొకటి కాదు.

గ్రహించుకో గలిగితే, ప్రధానమంత్రి యీజవాబు ముందు ప్రదర్శించబడే మహానాటకానికి పూర్వరంగం.

వీరూ వారూ అని విచక్షణ అవసరం లేదు, మనం, కాంగ్రెస్సువారినే నమ్మడానికి వీలులేదు.

ఒక్కటే మాట.

ఆంధ్రదేశంలో కాంగ్రెస్సు బతికి వున్నంతకాలమూ ఆ రాష్ట్రం యేర్పడదు.

ఆంధ్రజాతి బాగుపడదు.

వద్దంటే పోదు. వద్దనడం ఆత్మహత్య

ఏలూరు నగరీయసంఘంలో, తద్భవనంమీద, ఆంధ్రజాతీయపతాక ఎగరవెయ్యవలసిం దని దామరరాజు వెంకటరావుగారి ప్రతిపాదన.

ఆభవనంమీద అదివరకే వున్న రాష్ట్రపుజెండా తీసెయ్యాలని తాము చెప్ప మనీ, అది వుండనే వచ్చు ననీ, ఆంధ్రజాతీయపతాక కూడా వుండాలని మాత్రమే తమ ప్రతిపాదన అనీ వారు చక్కగా వివరించి చెప్పారు.

కాని వి. వెంకటనారాయణగారి కిది కిట్టలేదు.

ఆంధ్రజాతీయపతాక అనేటప్పటికి, వారికి, సహనశక్తి, లోపించిపోయింది.

దాంతో "ప్రత్యేకజాతీయత పనికిరా" దనీ, "రాష్ట్రపుజెండా వుండగా ఆంధ్రజాతీయపతాక అవసరం లే" దనీ వారు ఈ ప్రతిపాదనను ఎదిరించారు.

వెంకటనారాయణగారి కాంగ్రెస్సుపిచ్చి కనపడుతూనే అది యెంతవరకూ వెళ్లిందంటే ?

తమ ఆంధ్రత్వాన్నే వారు అసహ్యించుకుంటున్నారు.

తమలో ఆంధ్రజాతీయత వుంటేనే తమకి భారతజాతీయత సమిస్తుం దనీ, లేకపోతే తమకు ఏజాతీయతా వుండ దనీ తెలుసుకోలేకపోతున్నారు.

జాతీయతను గుర్తించుకోలేకపోవడం అజ్ఞానం మాత్రమే. తుంది; కాని జాతీయతను తిరస్కరించడం—అక్కడే మన మానవత్వానికే భంగకరాలు.

ఆంధ్రపార్లమెంటువారి ఆంధ్రపతాకలో లోపా లున్నాటూరా, అది మగతనం అవుతుంది.

ఆవిషయం ఆలోచించవచ్చు. పరిశోధనలూ, చర్చలూ సావచ్చు. లోపాలు సవరించుకోవచ్చు. మార్పులకూ కూర్పులకూ గీకరించవచ్చు. పదిమందీ ఆలోచించి నిర్ణయించినవిధంగానే దిద్దితీర్చుకోవచ్చు.

కాని ఫోక్కు గాంధిగారు నిర్ణయించిన—అర్థమూ కూడా లేని రాష్ట్రపు జెండాను పూసుకు వచ్చే వెంకటనా

క్క ఆంధ్రపార్లమెంటువారే తయారు చేసినా, ఆఆంధ్ర విమర్శించడంలో సారస్యం లేదు.

గారి కుళ్లుకాంగ్రెస్సులో దిగబడిపోయి వున్న వెంకట ణగారికి, ఆంధ్రపార్లమెంటును ఆక్షేపించడానికి అర్హత

ధ్రుడి ఆంధ్రజాతీయత వద్దంటే పోదు.

కి ఆంధ్రజాతీయత అక్కర్లే దనీ, అది గౌరవించతగ్గది కా మే ఆంధ్రు డంటాడో ఆ ఆంధ్రుడి అస్తిత్వానికే భంగం డుతుంది.

అది ఆత్మహత్యలో చేరిపోతుంది.

ానిఫెస్టో వేరూ బడ్జెటు వేరూనూ

ాసు కాంగ్రెస్సు మంత్రులు కొత్తపన్నులు తగిలిస్తున్నారు.

ఎవ రెంత వద్దన్నా, యెంత బతిమాలినా, యెంత ప్రతిఘటిం చినా తాము ఆపని మాన మనీ, కాదూ కూడదంటే అందుకోసం ద్యోగా లయినా వదులుకుంటా మనీ వారు నిక్కచ్చిగా చెప్పే తారు.

దేశంలో అసమ్మతిప్రదర్శనాలు జరిగాయి. జరుగుతున్నవి.

వర్తకులు కొట్లు కట్టేశారు. కట్టేస్తున్నారు.

ప్రముఖులు రాయబారాలు వెళ్లారు. వెడుతున్నారు.

కాని, అంతా అరణ్యరోదనం. బూడిదలో పోసిన పన్నీరూ. శంఖారావమున్నూ.

పైగా, కాంగ్రెస్సువారు కుటిలోపాయాలు ప్రారంభించారు. ష్ట్రీయమంత్రులను తమ చెప్పుచేతల్లో వుంచుకోడానికి , వారు చేసిన ప్రతీ పనీ, సమర్థించే టంత దుస్థితిలో పడి రు వారు.

వరకి మంత్రులే—ముఖ్యంగా ప్రధానమంత్రే జవాబు చెప్పే

ప్పుడు రాష్ట్రీయ, మండలీయ, "తాలూకీయ" గ్రామీయ గెస్సు అధ్యక్షులున్నూ అందుకు పూనుకున్నారు.

ంగ్రెస్సంతా తమ భుజాస్కంధాలమీదే వున్న దనుకునే ాముకులు కూడా యెగిరెగిరి పడుతున్నారు.

ఎన్నటివరకూ కొంచెంకొంచెం నిరసన కనపరిచి, మొత్తానికి ర్మపక్షం అవలంబించే టట్టున్నా" రనిపించుకున్న కాం స్స పత్రికలవారున్ను, తాఖీదు లందుకున్నారో యేమిటో, కొత్తపన్నులు సమర్థిస్తున్నారు.

పొగాకుపన్ను జస్టిస్సువారే తలపెట్టారు" ట.

వీరెందు కిప్పుడు శాసనం చెయ్యవలసివచ్చిందీ?

అమ్మకం పన్ను ప్రపంచంలో పద్ధానుగు దేశాల్లో వుంది" ట.

తే, ఆదేశాలవారు, వెనకా ముందూ చూడకుండా, ప్రక్క ధంగా మద్యనిషేధశాసనా లమలుజరిపి నికర మైన రాబడి పోదులుకున్నారా?

"ప్రజలు పన్నులు చెల్లిస్తే గాని దొరతనం సాగదు" ట.

పన్నులు తగ్గించేస్తా మన్నప్పు డీజ్ఞానం యేమయిపోయిందీ?

"వర్తకులు ఇండియాగవర్నమెంటుకే గాని రాష్ట్రీయప్రభుత్వాల కేమీ పన్ను లివ్వడం లేదు" ట.

అయితే, రైతులు, ఇండియాగవర్నమెంటు కేమీ పన్ను లివ్వడం లేదు కనక యీ కాంగ్రెస్సు నియంతలు, యిండియాగవర్నమెంటులో మంత్రిపదవులు దొరక పుచ్చుకున్నాక రైతులమీద కూడా పన్నులు బిగిస్తా రన్న మాటేనా?

"మద్యనిషేధానికి ప్రజ లంగీకరించారు" ట. కనక "దాని వల్ల వచ్చిన లోటు పూడా లంటే కొత్త పన్నులు చెల్లించవలసిన పూచీ ప్రజలమీద పడుతున్నది" ట.

మద్యనిషేధం ప్రజ లంగీకరించా రనడం వంచన.

కొత్త పన్నులు బిగిస్తా మని చెప్పి వుంటే మద్యనిషేధం వద్దని కూడా ప్రజ లిలాగే నిరసించి వుందురు.

అయినా, దానివల్ల యేజిల్లాలో లోటు వచ్చిందో యీకొత్త పన్నులు ఆజిల్లాలోనే అమలుపరచవలసిన నీతి యేర్పడుతున్నది కాదూ?

"మద్యాదాయం కంటే పాపద్రవ్యం లేదు" ట.

పొగాకుపన్ను పుణ్యద్రవ్యమా?

"వినోదాల కోసం రెండణాలు ఖర్చుపెట్టిన బీదవాడు ఇంకో కానీ యివ్వలేకపోడు" ట.

బట్టలు స్వయంగా వుతుక్కునే ప్రజాసేవకులు ఆఫీసుకు నడిచి వెళ్లలేరూ?

"అమ్మకంపన్ను, వర్తకులు కొనేవాళ్లమీదే రుద్దుతారు" ట.

కొనేవాళ్లు కొత్తపన్నుల కంగీకరించారా?

ఎటు చూసినా యీకొత్తపన్నులు ప్రారంభించడం ధర్మానికీ, నీతికీ, సత్యానికీ, అహింసకీ కూడా కేవలం ప్రతికూలం.

ఎన్నికల దాకానూ, ఎన్నికలప్పుడూ చేసిన వాగ్దానాలూ, చెప్పిన నీతులూ పట్టి చూస్తే కాంగ్రెస్సువారి యీ కొత్తపన్నుల విధానం అమానుషం అని చెప్పక తప్పదు.

ఏమంటే?

మద్యనిషేధంవల్ల వచ్చినలోటు ఇప్పటిమట్టుకి ౭౫ లక్షలు మాత్రమే.

అమాంబాపతులూ కలిపి ఆదాయవ్యయాలు లెక్కచూసుకుంటే యీసంవత్సరం బడ్జెట్టులో వచ్చిన లోటు ౧౩ లక్షలు మాత్రమే.

ఇది పూడ్చుకోడాని కింత రాక్షసపన్నులా?

కాని సత్యం యిది కాదు.

ఒకచేత్తో యిచ్చి రెండో చేత్తో పుచ్చుకోడం బ్రిటిషువారి దగ్గిర కాంగ్రెసువారు నేర్చుకున్న నీతి.

దాన్ని అనుసరించే వారీ పన్నులు వేస్తున్నారు.

మన కాశేశ్వరరావుగా రీవిషయం నిర్మొగమాటంగా చెప్పేశారు.

విక్టోరియాహాలు సభలో వారు చెప్పిందిది.

"మన రాష్ట్రంలో యిప్పటికి ౪ జిల్లాలలో మద్యనిషేధం అమలు జరపటంచేత ౬౫ లక్షల ఆదాయం పోయింది. ప్రభుత్వంవారు రైతుల కిచ్చిన రెమిషనులవల్ల మరికొంత ద్రవ్యం ఖర్చయింది...... వ్యాజ్యాలు ఆడడానికి ప్రజలవద్ద డబ్బు లేనందున స్టాంపుపన్ను కూడ తగ్గిపోయింది. రిజిస్ట్రేషను పన్ను తగ్గిపోయింది. అడవుల్లో పశువులు మేత మేపుకొను పన్ను తగ్గించాము. ఈవిధంగా మనకు వచ్చే ఆదాయావత్తు నష్ట మగుతున్నది. దానిని భర్తీ చేయటానికి ప్రయత్నం చేస్తున్నాం"

ఇదీ సంగతి.

ఇంత లౌక్యం చేస్తూ వుండినీ్న కాశేశ్వరరావుగారు "ఇది మన సంసారం. మన యిల్లు. మన వాకిలి. మన ప్రభుత్వం కాబట్టి మనం దీనిని ఎలాగైనా చక్కబెట్టుకోవాలి" అంటున్నారు.

జస్టిస్సువారికి మాత్రం యీమాటలు చెల్లవూ?

ఇందులో కాంగ్రెస్సువారి విశిష్టత యేమున్నదీ?

లేదని కాంగ్రెస్సువారికీ తెలుసు.

కాని అడిగేవారు లేరు.

ప్రజ లింకా దొడ్డిదారినే వున్నారు.

కనక, కాంగ్రెస్సువారివి విడిచిపెట్టరు. తప్పకుండా పనూలు చేస్తారు.

వారి దిలాసాకి కారణాలు లక్షలు.

అన్నిటికి ప్రధాన మైనవి అయిదు.

ఒకటి, కాంగ్రెస్సు నియంతలకు హృదయం లేకపోవడం.

రెండు, కాంగ్రెస్సు శాసనసభ్యులు ప్రజలకు బాధ్యత వహించవలసిన అగత్యం లేకపోవడం.

మూడు, బల మైన ప్రతికూలపక్షం లేకపోవడం.

నాలుగు, పత్రికాసంపాదకులకు, తమ పదవి, యెంతెంత న్యాయమూర్తి పదవికంటేనూ కూడా గొప్ప దనే జ్ఞానం లేకపోవడం.

అయిదు. దేశీయులలో చదువుకున్నవారికి కూడా రాజకీయపరిజ్ఞానం లేకపోవడం.

బ్రహ్మాండ మైన మెజారిటీకల కాంగ్రెస్సు మంత్రుల నిక యెవ రేం చెయ్యగలరూ?

"ఇష్టం లేకపోతే మమ్మల్ని పడగొట్టండి" అని మంత్రులు చెప్పేమాటలు "మీవల్ల యేమవుతుందోయ్!" అని వోటర్లను సవాల్ చేయడం తప్ప మరేమీ కాదు

ఎన్నికల ప్రణాళికను చూసి పొంగిపోయిన వోటర్లు అనుభవించడం తప్ప యిప్పు డేం చెయ్యగలరూ?

కాని వారి కిది గుణపాఠం.

"కాంగ్రెస్సువారి మానిఫెస్టో వేరూ బడ్జెటు వేరూనూ" అనే సంగతి రెండేళ్లలోనే పూర్తిగా తెల్లడికావడం చాలా మందే.

త్రిపురీకాంగ్రెస్సు

కాంగ్రెస్సు చరిత్రలో త్రిపురీసమావేశం వొక గొప్పఘట్టం.

ఏమంటే?

పరాజితు లయి, కుపితులున్నూ అయి, గాంధిగారు రావడమే మానుకున్నారు.

మొగతనం చూపించి సింహాసనం స్వాధీనపరుచుకున్న సుభాసుబోసుగారు సభలో కూచోనే లేకపోయారు.

"నాకు వద్దు మొర్రో" అని తప్పించుకున్న అజద్‌గారే కార్యక్రమం నడిపించారు.

జవహర్‌లాల్‌గారు స్వార్థపరులై తమ నాయకత్వానికి బల మైన పునాది వేసుకున్నారు.

సోషలిష్టులు ఆత్మహత్య చేసుకున్నారు.

కాంగ్రెస్సు మంత్రులు, పెద్ద పెద్ద పదవుల్లో పలుకుబడి కెంతెంత అవకాశా లుంటాయో యెక్స్పెరిమెంటు చేసి చూపించారు.

గోవిందవల్లభపంతుగారు గాంధిగారి కాంగ్రెస్సు భవిష్యత్తులో చిక్కని విషం కలిపారు.

పటేలుగారు, వున్న లౌక్యం అంతా చూపించేశారు.

బంగాళీలు తమ ఐకమత్యం చక్కగా చూపించారు.

అరవలు తమ రాజ్యతంత్రపరిజ్ఞానం పూర్తిగా ఆచరణలో పెట్టారు.

గాంధిగారి కాంగ్రెస్సులో ఆంధ్రు డైనవాడికి చోటు లేదని రుజువయిపోయింది.

ఐకమత్యసందేశం తీసుకువచ్చిన ఈజిప్టుప్రతినిధులు, కాంగ్రెస్సులో వున్న భరతశాస్త్రప్రావీణ్యం అంతా చిత్తగించారు.

బ్రిటిషువారికి కాంగ్రెస్సు సత్తా అవగత మయిపోయింది.

త్రిపురీకాంగ్రెస్సు అంతర్యం యిదీ.

చాలా మంచి సన్నివేశం యిది.

సరిగా ఏడు రాష్ట్రాలలో ప్రభుత్వం చేస్తున్న కాంగ్రెస్సుకి ఇది అర్థంగానే వున్నది.

ఇన్నాళ్లకయినా, కాంగ్రెస్సు, గాంధిగారి నాన్‌కోఆపరేషను సూత్రాలను బాగా జీర్ణం చేసుకున్నందుకు ఆనందించవలసిందే.

ఆంధ్రరాష్ట్రనిర్మాణసంఘం

కొండపల్లి సమావేశానికి వెళ్లలేకపోయినందుకు మేము విచారిస్తున్నాము.

మంచి సమయంలో అది జరిగింది.

జేగీయమానంగా జరిగింది.

"ఆంధ్రరాష్ట్రనిర్మాణసంఘం" నెలకొల్పబడినది.

ఇందుకు చాలా సంతోషం.

ఆంధ్రమహాసభ కాంగ్రెస్సువారిచేతిలో పడి ధ్వంస మయిపోయింది.

దాన్ని నమ్ముకుంటే లాభం లేదు.

ఇంతలో అది బాగుపడుతుం దనీ చెప్పలేము.

కనక ప్రత్యేకసంఘం మరొకటి యేర్పడడం చాలా అగత్యమైనది.

ఆంధ్రజాతీయవికాసమూ, ఆంధ్రరాష్ట్రనిర్మాణమూ కోరుతూ అక్కడక్కడ పనిచేస్తున్న భిన్నసంఘాలన్నీ ఈ ఆంధ్రరాష్ట్రనిర్మాణసంఘంలో కలపబడ్డట్టు విని చాలా ఆనందిస్తున్నాము.

ఆంధ్రమహాసభను మాత్రం దూరంగా వుంచవలసి వున్నది.

సంఘనిర్మాత లీవిషయం గమనించ కోరుతున్నాము.

కొండపల్లిలో కొన్ని తీర్మానాలున్నూ జరిగాయి.

వాటిని బట్టి ఈసంఘంవారికి కాంగ్రెస్సు ఆధారంగా వున్నట్టు కనపడుతుంది.

ఇది అనుచితమైన పని.

కాంగ్రెస్సు ఆంధ్రులను అణిచివేసేది గాని తేల్చేది కాదు.

ఇంకా దాన్ని నమ్మడం చాలా పొరపాటు.

బులుసు సాంబమూర్తిగారిని ప్రశంసించడంలో కూడా మాకేమంత విశేషం కనపడ్డం లేదు.

ఆంధ్రరాష్ట్రనిర్మాణప్రయత్నాలకు వారి ద్వారా జరిగినంత పరాభవం మరెవరివల్లా జరగలేదు.

ఇంగ్లాండు రాయబారం, వందేమాతరం పాట, ఆంధ్రోద్యమాన్ని గురించి గ్రంథం రచించడం—ఇలాంటివన్నీ గుర్తించకుండా యిలాంటి తీర్మానాలు చెయ్యడంవల్ల ప్రయోజనం లేదు.

రాధాకృష్ణయ్యగారి యాజమాన్యంలో జరిగిన ఆంధ్రమహాసభలో ప్రత్యక్ష మయిన నిరంకుశత్వం చూసికూడా యిలాగ ప్రశంసించడం సరసంగా లేదు.

శాసనసభలో భిన్నభాషల విషయంలో వారు సరియైన కట్టుబాట్లు చెయ్యలేకపోయారు.

ఆంధ్రజాతీయత విషయంలో అయినా వారు స్వాతంత్ర్యం నిలువుకోలేరు.

గాంధిగారు ఆదేశిస్తే, వారు, ఆంధ్రరాష్ట్రప్రయత్నాలను నడిసముద్రంలో విడిచిపెట్టడానికి సందేహించరు.

ఏమయినా, యిలాంటి మొగమాటాలకు పోతే యీ కొత్త సంఘం కూడా పని చెయ్యలేదు.

కాంగ్రెస్సు వర్కింగు కమిటీ అన్నమాటే ఇండియాశత్రుటరీగారున్నూ అన్నారు.

అలాంటిస్థితిలో ఇండియామంత్రియెడల ఆగ్రహం తెలపడమూ—కాంగ్రెస్సు వర్కింగుకమిటీవారిని ప్రార్థించడమూ—ఈవ్యత్యాసానికి కారణం?

ఎప్పటి కయినా ఇండియాశత్రుటరీగారే ఆంధ్రరాష్ట్రం నిర్మిస్తారు.

ఎప్పుడూ కాంగ్రెస్సు ఆంధ్రరాష్ట్రం యేర్పడకుండా వుండేటట్టే పని చేస్తుంది.

ఇది వరకి చేసిన ప్రతికూలప్రయత్నాలను అది విరమిస్తుం దనడాని కేమీ ఆధారాలు లేవు.

ఈతీర్మానాల ధోరణి చూస్తే మన ఆంధ్రుల కింకా సరియైన బొప్పి కట్టలే దనీ, ఆంధ్రరాష్ట్రం అంటే మాటల్లో వుం దని నమ్మకం వున్న దనీ తోస్తుంది.

బాగా లేదు.

వీటిమాట స్వరాజ్యం వచ్చాక

"హిందూస్థానీభాష ఉత్తర హిందూస్థానములో ఒకవిధముగా సామాన్యభాష కావచ్చును. దక్షిణదేశములో దానికి స్థానము లేదు. ఇంగ్లీషు ఎంత విదేశీయమో హిందూస్థానీ కూడా దాక్షిణాత్యులకంత విదేశీయమే. అయినను రాజకీయభాషాస్థానము హిందూస్థానీకి వచ్చిన నాడే దాక్షిణాత్యులలో నిది యింగ్లీషు స్థానము నాక్రమించుకొనగలదు"

"హిందూస్థానీ" వాదు లందరును, దాక్షిణాత్యులతో "మా భాషను నేర్చుకొనుడు. మాలిపిని నేర్చుకొనుడు. మీ భాషలో మంచి దేమైన నుండిన మాభాషలోకి మార్చుతాములే" అను ధోరణిలో మాట్లాడుదురు. అది వారికి సహజమే. తన సంస్కృతిని ఇతరులపై మోపుటకు ప్రతివాడును ఇష్టపడును. కాని మోసుకొను వాడే తొందరగా దొరకడు. కావున నిజముగా తొందరగా భాషాసమస్య పరిష్కారము కావలె ననిన మొదట [illegible] పరిష్కారము కావలెను. ఆలిపిపరిష్కారము కావలె ననిన దాక్షిణాత్యలిపులలో నొకదానిని సంస్కరించి పరిష్కరించి యావద్భారతమునకు సమర్పింపవలెను. తెనుగు కన్నడభాషలకు సమానమైన లిపి కలదు. ఈలిపిని సంస్కరించి యావద్భారతదేశలిపిగా చేయుట భావ్యముగా నుండును"

విభూతి చైత్రసంచికలో, మా మిత్రులు శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు, సామాన్యభాషాసమస్యనూ, ఏకలిపిసమస్యనూ ఇలా పరిష్కరించారు.

వారు చేసిన హేతువిన్యాసం చాలా చక్కగా వున్నది.

అయితే, ఇప్పుడీ ప్రయత్నాలెందుకూ?

సామాన్యభాష యేదో నిశ్చయం కాకపోతే మన వ్యవహారాలు దిగడిపోతాయా?

ఏకలిపి లేకపోతే మన భాషలూ, మన వాఙ్మయాలూ వికసించవా?

పెద్దపెద్ద కభుర్లన్నీ గాలి కెగిరిపోగా, చేసేది లేక గాంధిగారిప్పుడు సామాన్యభాషను ప్రధానం చేసుకున్నారు.

హిందీనిపట్టుకుని వారు వేళ్లాడుతున్నారు.

కాని అది యెవరికాకావాలీ?

దాన్ని ప్రతిఘటించి అరవలు దినదినమూ అనేకులు జెయిలుకి వెడుతున్నారు.

ఇప్పటికి "హిందీ" శిక్షితులసంఖ్య రెండువేలకు సమీపించింది.

ఇంత పట్టుదల కలవారు గాంధిగారు ఏం చేస్తే మాత్రం హిందీని అంగీకరిస్తారూ?

కనక హిందీవాదుల ఆశలు అడియాసలు కాక తప్పదు.

అసలు సామాన్యభాష మాటే యిప్పు డవసరం లేదు.

అధికారం చేతికి వచ్చేదాకా భారతీయులు ఆవిషయం ఆలోచిస్తే లాభం లేదు.

లిపి విషయం కూడా యింతే.

కెమాల్ పాషా గారు సర్వాధికారాలు చేతికి వచ్చేదాకా యీ ఆంతరంగిక సంస్కరణానికి పూనుకోలేదు.

అంతటి విజ్ఞానవంతులు కనకనే వారు విజయం పొందారు.

మన కాంగ్రెస్సువారికే కాదు, గాంధిగారికి కూడా ముందు వెనక లేమీ తెలియవు.

వారి ప్రయత్నాలు వ్యర్థం అయిపోతవి.

ఏమీ సందేహం లేదు.

మన కిప్పుడు ప్రధానం భాషాలిపులు కావు.

ఇప్పుడు భాషాలిపుల మాట యెత్తుకోవడం అంతఃకలహాలకు స్వాగతం చెప్పడమే.

సమయం వచ్చేదాకా మనం యింగ్లీషుతోనే వ్యవహరించుకోవచ్చు.

అదే మనకు స్వరాజ్యం తెస్తుంది.

భాషాలిపుల మాట స్వరాజ్యం వచ్చాకే.

రాఘవేంద్రరావుగారు చెప్పిం దిదీ!

అసలే పదహారణాల ఆంధ్రుడు. అంతటితో, పోకుండా తిలకు గారి అనుచరుడు.

ఆపైని గొప్ప (బారిష్టరు) లాయరు. ఒకప్పుడు సీ. పీ. రాష్ట్రీయ కాంగ్రెస్సు కమిటీ అధ్యక్షుడు. స్వరాజ్యపార్టీ లీడరు. రెండు మాట్లు సీ. పీ. మినిష్టరు. హోం మెంబరు, గవర్నరు. ఇప్పుడు సీ. పీ. ఎం. ఎల్. ఏ. ఇంటరిం ఛీఫ్ మినిష్టరు. కొంతకాలం గాంధిగారికి విశ్వాసి. ఇప్పటికీ కద్దరుధారి.

ఏం తక్కువా?

అనన్యసాధారణమైన ప్రతిభ లేదా?

రాజ్యతంత్ర ప్రావీణ్యం తక్కువా?

ఇంగితజ్ఞానం లోటా?

గార్యగతులు తెలియవా?

గవర్నమెంటు పోలసీ అందనిదా?

కాంగ్రెస్సు నియంతల కౌటిల్యం యెరగనిదా?

పైగా,

భయ మేమీ?

మొగమాటం మాత్రం యెందుకూ?

ముక్కుమీద గుద్ది చెప్పేశారు డాక్టరు. రాఘవేంద్రరావుగారు

"ఫెడరేషను స్థాపింపబడు వరకును క్రొత్త రాష్ట్రముల నిర్మాణమునకు భారతప్రభుత్వచట్టమునం దవకాశము, లేదు; కాని కొత్తము యెనిమిది రాష్ట్రములలో కాంగ్రెస్సు ప్రభుత్వము పరిపాలన చేయుచు అనేకమైన స్వల్పా, నల్ప రాజ్యాంగసమస్యలను జయప్రదముగ పరిష్కరింపజాలుచున్నప్పుడు ఆంధ్రరాష్ట్రసిద్ధి అసాధ్యమగుటకు హేతువు లేదు. మీ రాష్ట్రములోని కాంగ్రెస్సు ప్రభుత్వము మీరు వాంఛించుచున్న స్వల్పకాలములో రాష్ట్రమును మీకొసంగజాల దేని మీ మంత్రివర్గము అవలంబించుచున్న విధానమునందు యేదియో లోప ముండి తీరవలెను."

అవును.

నిజమే.

ఉన్నదే అదీ.

వచ్చిన చిక్కే అదీ.

వ్యవహారం అంతా తల్లకిందులుగా ప్రారంభం అయింది.

"టెంకాయ పిచ్చికొండ" అయిపోయింది.

కారణం?

రాజగోపాలాచారిగారికి ఆంధ్రరాష్ట్రనిర్మాణం అంటే సుతరామూ యిష్టం లేదు.

తక్కిన అరవమంత్రులకున్నూ అంతే.

దీనికి సాయం ఆంధ్రమంత్రులకు స్వాతంత్ర్యమే లేదో, ఆంధ్రరాష్ట్రం అంటే యిష్టమే లేదో?

ఇక ఆంధ్ర ఎం. ఎల్. యేలా?

"జో హుకుమ్"లు.

లేకపోతే యిది యిలా యెందుకు హాస్యాస్పదం అయిపోతుందీ?

"తెలుగు మండలాలను విడతీసి ప్రత్యేకరాష్ట్రంగా యేర్పరచా" లని ఆంధ్రుల నోటీసా?

అది తుడిచివేసి "మద్రాసు ప్రెసిడెన్సీని విడదీసి ఆంధ్ర, అరవ, కన్నడ, మళయాళ రాష్ట్రాలుగా నిర్మించా" లని బనాయింపా?

"ప్రభుత్వ" తీర్మానంగా కాక "పాలక" తీర్మానంగా ప్రతిపాదనా?

అది ఆంధ్రుడికే అంటకట్టబడడమూ?

దానిమీద, "అవకాశాలెక్కువగా వున్నాయి కనక ప్రస్తుతం ఆంధ్రరాష్ట్రం మాత్రమే నిర్మించా" లని సిఫార్సా?

దీనిమీద కన్నడుల ప్రాతికూల్యప్రచారాలా?

ఇందులో క్రమభిన్నం కాని దేమైనా వున్నదా?

ఒక్క కాంగ్రెస్సాంధ్రులు తప్ప యెవరేనా దీన్ని మాసి పొంగిపోగలరా?

ఒక్క కాంగ్రెస్సాంధ్రులు తప్ప యెవరేనా దీన్ని సమర్థించగలరా?

ఒక్క కాంగ్రెస్సాంధ్రులు తప్ప యెవరేనా ఈప్రాతిపదిమీద "అదిగో రాష్ట్రం వచ్చేస్తున్నది" అని మురిసిపోగలరా?

ఒక్క కాంగ్రెస్సాంధ్రులుతప్ప, యీ అశాస్త్రీయవిధానా కి రోసి యిప్పుడు కాదన్న యిండియాశక్రటరీమీద మరెవ కేనా ఆగ్రహపడగలరా?

ఒక్క కాంగ్రెస్సాంధ్రులు తప్ప "రాఘవేంద్రరావుగారి వాక్యాలు మద్రాసు ప్రధానిని యీసడించుచున్న వని అర్థం చేసుకుని, అరస్తాలో ప్రచారం చేసేవా రంతా ఆంధ్రోద్యమానికే తీరని హాని కలగజేసేవా రవుతా" రని మ రెవ రేనా శ్రీరంగనీతులు సాయించగలరా?

"మీ యాశయ మీడేరవలె ననిన మీరాష్ట్రీయశాసనసభ పైనే మీ రాధారపడవలెను. మీ ప్రజా ప్రతినిధులపై నాధారపడవలెను. శాస్త్రీయపద్ధతుల ద్వారా కార్యములు సాధించుటలో ధురంధరు డని, అసమానశక్తిసంపన్ను డని, బ్రిటిషు సామ్రాజ్య మంతటను కీర్తి వహించిన మీ ప్రధానామాత్యునిపై నాధారపడవలెను." అన్నారు రాఘవేంద్రరావుగారు.

ఇలా అన్న తరవాతే "మీమంత్రివర్గము అవలంబించుచున్న విధానమునందు యేదియో లోపముండియే తీరవలె" నని వారు ఝుమాయించి చెప్పారు.

ఇది తప్పుదారి తొక్కా రనడం కాదూ?

పొగడ్తా?

మేము సవాల్ చేసి అడుగుతున్నాము.

ప్రధానమంత్రి తయారుచేసిన తీర్మానం ఆంధ్రరాష్ట్రనిర్మాణాని కనుకూలంగానే వున్న దనీ, ప్రజాప్రతినిధులు అంగీకరించిన తీర్మానంలో కొంత భాగమే నెరవేర్చవలసిం దని ప్రధానమంత్రి సిఫార్సు చెయ్యడం శాస్త్రీయంగానే వున్న దనీ కాంగ్రెస్సాంధ్రు లిప్పుడయినా సమర్థించగలరా?

ఏతావతా:

రాఘవేంద్రరావుగారు ఇండియాసెక్రటరీగారికి సలహాదారు మాత్రమే.

సెక్రటరీగారు అడిగితేనే దేని కయినా రావుగారు సమాధానం చెప్పవలసి వుంటుంది.

వా రడిగితేనే రావుగారు సలహా చెప్పవలసిన్ని వుంటుంది.

అలా జరక్కపోయినా,—

సహజంగా ఆంధ్రరాష్ట్రనిర్మాణం ఆంధ్రులను బాగు చేసేదేకాని యితరులను నష్టపరచేది కాదు కనకానూ, ఆంధ్రరాష్ట్రం నిర్మించమని కోరడం యితర్లకు అపకారం చెయ్య మని చెప్పడం కాదు కాబట్టిన్నీ, తాము గొప్ప పదవిలో వుండడంవల్లనున్నూ, ఈ విషయమై సహాయం చెయ్య మని మనం తమర్ని కోరడం అశాస్త్రీయయమూ, నేరంగల ప్రోత్సాహమూ కాదు కాబట్టిన్నీ, తామున్నూ ఆంధ్రులే కావడంవల్ల ఆంధ్రజాతీయవికాసం కోసం పాటుపడవలసిన బాధ్యత తమకిన్నీ వుండుకోవడంవల్లనున్నూ, తమర్ని సెక్రటరీగారు అడక్కపోయినా రాఘవేంద్రరావుగారు వారితో స్వయంగానే ప్రస్తావిస్తా రనే అనుకుందాం.

అయితే, శాసనా న్ననుసరించి, వొక్కొక్క మెట్టే యెక్కివన రాష్ట్రవాంఛ తమ యెరుకకు రాకపోతే సెక్రటరీగారు రాఘవేంద్రరావుగారి మాటలు మన్నిస్తారా?

సర్వమూ తెలిసిన—సిద్ధాంతరూపంగానూ, ఆచరణరూపంగానూ రాజకీయాలను వోడి వడపోసిన రాఘవేంద్రరావుగారు, తంతు అంతా యథాక్రమంగా జరగనిదే అసలు సెక్రటరీగారిదగ్గిర యీ విషయం యెత్తుతారా?

కనక?

ఆంధ్రరాష్ట్రం నిర్మించబడా లంటే యథాక్రమంగా తంతంతా జరగాలి.

ఇదివరకి, జరగవలసినదంతా జరగనూ లేదు. జరిగినంతవర కయినా శాస్త్రీయంగానూ జరగలేదు.

అంచేత మనం మళ్లీ మొదటికి రావాలి.

ఒక్క ఆంధ్రరాష్ట్రనిర్మాణం విషయ మయ్యే మద్రాసు, శాసనసభలలో తీర్మానం కావాలి.

ఇది యిలా చేసేటట్టు వోటర్లు శాసనసభ్యులను వొత్తిడిచెయ్యాలి.

తరవాత ప్రధానమంత్రి సరిగా సిఫార్సు చేస్తూ ఇండియాసెక్రటరీకి విన్నపం పంపాలి.

అది అలా జరిపే టట్టు శాసనసభ్యులు ప్రధానమంత్రిని వొత్తిడి చెయ్యాలి.

ఇది యిలా జరుగుతుండగా, భారతశాసనసభలో కూడ ఆంధ్రసభ్యులు సర్వప్రయత్నాలూ చెయ్యాలి.

ప్రజలలో ప్రబోధం జరగాలి. ఆందోళన రేగాలి.

ఇది వొకనాటిలో జరిగేది కాదు.

ఈలోపున ఫెడరేషను లక్షణంగా ప్రారంభం అవుతుంది.

దీంతో కొత్తశాసనంలో వున్న సాంకేతికాభ్యంతరాలు తొలిగిపోతాయి.

సెక్రటరీగారికి, అంగీకరించడాని కయినా తిరస్కరించడాని కయినా యీవిధంగా సరియైన అవకాశం అప్పుడు కలుగుతుంది.

కొంచెం ఆలోచించి మరీ సమాధానం చెప్పవలసిన అగత్యం ఆయనకు అప్పుడే కలుగుతుంది.

అప్పటికి, మనం, మన ఆంధ్రుల కందరికీ యీవిషయం బోధపరుచుకోగలుగుతామా, వారిలో యీ ఆశ రేకెత్తించుకోగలుగుతామా, వారి ఆవేగం ఇండియాసెక్రటరీగారికి చురుకుపుట్టించేతంత చేసుకోగలుగుతామా, అప్పుడూ ఆంధ్రరాష్ట్రం.

కాని దీని కంతకీ కాంగ్రెస్సు బద్ధశత్రువు.

ఉన్న దంతా యిదీ.

రాఘవేంద్రరావుగారు చెప్పిన దాని అంతర్యం యిదీ.

అంటే?

ఆంధ్రరాష్ట్రనిర్మాణానికి వ్యతిరేకులు కాంగ్రెస్సుమంత్రులు కాని ఇండియామంత్రి కాడు.

కానేకాడు.

వర్తమానాంధ్రభాషానుశాసనం

మా మిత్రులు మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు వ్యావహారిక భాష అంగీకరిస్తారు. కొంతవరకూ అది వాడనూ వాడతారు.

కాని దానికి అనుశాసనం కావా లంటారు వారు.

"తెలిసికొనగలుగుతూ ఉన్నా మంటే చాలదు. ప్రకృతిప్రత్యయములలో ఒక రాజమార్గము ఉండవలెను"

ఇదీ వారి అభిప్రాయం.

విషయం మంచిదే. శాస్త్రీయ మైనదే; కాని జీవద్భాషలో వొక రాజమార్గం స్థిరంగా వుండిపోతుందా?

"ప్రాచీనకావ్యభాషలో ఏకత కలదు; గాని జీవము లేదు. నవీనవ్యవహారభాషలో జీవము కలదు; గాని ఏకత లేదు" అని శాస్త్రిగారే చెబుతున్నారు.

ఏకత వుంటే జీవం వుండ దేమో?

అలాగే, జీవం వుంటే ఏకత కూడా వుండ దేమో?

అయితే, శాస్త్రిగారు, తమ యీవ్యాసంలో వున్న భాష కావ్య భాష అంటారా? వ్యావహారిక భాష అంటారా?

ఇంతకీ:

వ్యావహారిక భాషావాదుల్లో, అస్మదాదులం, వ్యాకరణం అక్కర్లేదని యెప్పుడూ చెప్పలేదు. చెప్పడమున్నూ లేదు. ఇక ముందున్నూ చెప్పం.

భాషా వ్యాకరణమూ అవినాభావాలు.

అసలు, వ్యాకరణం లేనిది భాషే కా దని మానిశ్చయం.

వ్యాకరణం పేరిట భాషకు కొన్ని నిబంధనా లున్నా యనీ, తాను వాడే మాటలను "భాష" అంటా రనీ యెరగని అటవికుడు కూడా "రేపు వచ్చా" ననడు. "నిన్న వచ్చా" న నే అంటాడు. "కర్రచేత కొట్టా" ననడు. "కర్రతో కొట్టా" న నే అంటాడు.

"ఇద్దరు సింహా" లనడు. "రెండు మనుష్యు" లనీ అనడు.

మాండలికవ్యవహారరీత్యా ఒకడు "వస్తి" ననవచ్చు. మరొకడు "వచ్చినా" ననవచ్చు. ఇంకొకడు "వచ్చా" ననవచ్చు. అంతే.

ఇలాగే తక్కిన సందర్భాలు కూడా వుండవచ్చు.

మొత్తానికి, యెన్ని మార్పులు వచ్చినా శబ్దరూపాల్లోనూ, ధాతురూపాల్లోనూ నే కాని లింగ, వచన, విభక్తి, కాల, పురుషాదుల్లో మాత్రం కాదు.

సర్వసాధారణంగా కారకాలు కూడా జనసామాన్యం వాడకంలో సరిగానే వుంటాయి.

నిజానికి, గ్రాంథికవాదుల రచనల్లోనే కారకచ్యుతి యెక్కువగా వుంటుంది.

ఔపవిభక్తికాల సందర్భంలో కూడా గ్రాంథికవాదుల రచనల్లోనే అజ్ఞానం అతిమాత్రంగా వుంటుంది.

కాగా, యిక శబ్దధాతురూపాల విషయం.

దీనికోసమే శాస్త్రిగారి యీ ప్రబోధం.

కాని, చాలా స్వల్పవిషయం యిది.

సద్దుమణిగే పోతుంది.

మా మిత్రులకు "నిరంకుశాః కవయః" పరిచితమే.

ప్రతికూలం కాదనిన్నీ అనుకుంటాము.

పైగా,

వ్యావహారిక భాషలో గ్రంథరచన, యిప్పుడిప్పుడే సాగుతున్నది.

ఇది కొన్ని జిల్లాలలో యింకా ప్రారంభమే కాలేదు.

సాహిత్యేతరవిషయాలలో కూడా యిది చురుగ్గా సాగడంలేదు.

లోకవ్యవహారమూ, శబ్దశక్తీ గ్రంథకర్త లింకా అకళించుకునే దశలోనే వున్నారు.

వ్యవహారప్రాచుర్యం లేనిదే భాషను అనుశాసించడం అంటే యేమిటీ?

అన్ని విషయాలలోనూ గ్రంథరచన ప్రారంభమే కానప్పుడు—గ్రంథకర్తలు కూడా తగినంతమంది బయలుదేరివుండనప్పుడు—బయలుదేరినవారున్నూ యింకా సాధకావస్థలోనే వున్నప్పుడు—అనుశాసకు లెక్కణ్ణుంచి వస్తారూ?

ఇప్పుడమల్లో వున్న అసమగ్రవ్యాకరణగ్రంథాలు కొన్ని చదివి వున్నంత మాత్రాన యెవరి కయినా అనుశాసకత్వం ఆరోపించుకుంటే మాత్రం చెల్లుతుందా?

ఇప్పుడు రావుసాహెబు శ్రీగిడుగు రామమూర్తిపంతులుగారి కంటే గొప్ప ఆంధ్రపండితు లెవరూ లేరు.

వారితో పోల్చతగ్గవారున్నూ లేరు.

గతకాలంలో కూడా అంతటివా రెవరూ అని పరిశీలన చెయ్యాలంటే కొన్ని శతాబ్దుల వెనక్కి వెళ్ళవలసివస్తుంది.

ఇక ముం దయినా యింతలో బయలుదేరతా రనుకోడానికి సూచన లేమీ లేవు.

భాషావిషయమై పంతులుగారి వరవడి ననుసరించి కృషి ప్రారంభించినవారే కనపడ్డం లేదు.

అలాంటి రామమూర్తిపంతులుగారు కూడా "అది నాకే కాదు ఎవరికైనా అసాధ్యమే" అంటున్నారు.

ఏం?

పంతులుగారు స్వశక్తిపరిజ్ఞాతలు.

ఉత్సాహోద్రేకాలతో ముందు కురికేవారు కారు వారు.

వారి యీమాట సత్యావిష్కరణంకోసమే గాని వినయప్రదర్శనంకోసం చెప్పబడ్డది కాదు.

వారు దొరికిన గ్రంథా లన్నీ చదివారు.

చదివిన వన్నీ తెస్సగా తెలుసుకున్నారు.

కనక గ్రంథాల్లో వున్న భాష—ఇప్పటి గ్రంథాల్లో వున్నది కూడా—వార్తాపత్రికల్లో వుంటున్నదిన్నీ వారికి బాగా తెలుసు.

అది మాత్రమే తెలుసు.

మరి జీవద్భాష?

ఇరవై తెనుగుమండలాల్లో యెప్పటికప్పుడు నవనవలాడి కొనసాలూ, వనికికీ అలవర్చుకుంటూ వస్తున్న వ్యావహారిక భాష?

వారు యెంతకాలంనుంచో మా ప్రాంతం యెరుగుదురు.

ఇక్కడి కొన్ని మాట్లో వచ్చి వుండినారు.

వారి పూర్వు లిక్కడివారే.

వారి బాల్యం కూడా కొంత యిక్కడ పరిణత మైన దేమో?

నాలుగేళ్లుగా వారిక్కడే వుంటున్నారు.

ఇక్కడే స్థిరపడ్డా రనే చెప్పవచ్చుకూడాను.

కాని, యిప్పటికీ—యీరోజున కూడా—యీ క్షణంలో కూడా’ “ఖాశబ్దం మీ రిలా పలుకుతారా? ఈ ధాతువు యిలా వాడతారా? ఊళ్లూ. మీరు ఫలానా రూపం విన్నారా? ఎరుగుదురా? వాడుతున్నారా?” అంటూ అస్మదాదులం దర్శనం చేసుకున్నప్పుడు అడుగుతూనే వుంటారు.

ఇంత పరిచిత మైన గోదావరి—తూర్పుగోదావరిజిల్లా భాషను గురించే వా రింతగా పరిశోధనలు చేస్తున్నప్పుడు వరంగల్లు, హైదరాబాదు, నల్లగొండ, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు మొదలైన జిల్లాల భాషను గురించి వారు తెలుసుకో దలచుకున్న దీ, తెలుసుకోవలసిందీ యెంతవున్నదో వేరే చెప్పడం యెందుకూ?

కనకనే వారు కచ్చితంగా యేమన్నారో చూడండి.

“పార్వతీశ్వర శాస్త్రిలుగారు తెలుగుభాషను అనుశాసించవలసిన దని నన్ను నియోగించినారు; గాని ఆపని నేను పూనుకోగలనా? శాస్త్రిలుగారివంటివారు నూరుగురు-సహాయులు అన్ని-మండలములలోను పదిసంవత్సరాలు శ్రద్ధతో పనిచేస్తే కొంతమట్టుకు ఆంధ్రభాష అనుశాసించవచ్చు” *

శాస్త్రిగారు ఎవరిని నమ్ముకున్నారో వారు “నావల్ల కా” దని స్పష్టంగా చెప్పేశారు.

మరి తరవాతి మాట?

శాస్త్రిగారు మళ్లీ వొకమాటు యోచిస్తా రని ఆశిస్తున్నాము.

కాంగ్రెస్సాంధ్రుల అపూర్వయోగ్యత

భూలాభాయి దేశాయిగారు, కలకత్తాలో జరిగిన (అక్టోబరు ౩౧) కాంగ్రెస్సు వర్కింగు కమిటీసభలో ఇండియాలో పత్తి పంట తగ్గించా లని తీర్మానం చేయించారు.

ఇదంతా, పత్తిధర పెరిగి, కొత్తగా మిల్లులు ప్రారంభించేవారికి భీతి కలిగి తద్వారా గుజరాతీశెట్ల మిల్లులకు పోటీ రాకుండా వుండడానికి పడిన అవస్థ.

ఆ పైన మొన్న మొన్న ఢిల్లీఅసెంబ్లీలో ఆంగ్లభారతవాణిజ్య వడంబడికను ప్రతిఘటించారు.

ఇదంతా, ఆవడంబడిక అమల్లోకి వస్తే యింగ్లండునూలూ బట్టలూ యిక్కడ చౌక అయి తన్మూలంగా గుజరాతీల మిల్లులకు దెబ్బ తగులుతుం దని వారు పడిన యిబ్బంది.

* వాడుకభాష. రచనకి కొన్ని నియమాలు పీఠిక, పేజీ. ౬

సీ. పీ. ప్రధాని డాక్టరు ఖరేగారిమీద రాజేంద్రప్రసాదు, జవహరలాల్ నెహ్రూగార్లూ మరికొందరు హిందూస్థానీలూ తలో రాయి విసిరారు.

ఇదంతా తమ జాతీయులైన శుక్లాగారికి ప్రధానమంత్రిపదవి రావాలని చేసిన అభిచారహోమం.

గోవిందవల్లభపంతుగారు, త్రిపురీకాంగ్రెస్సులో, హేమాహేమీలమీద జబ్బ చరిచి నిలిచి కాంగ్రెస్సు అధ్యక్షత గెలుచుకున్న సుభాసుబోసుగారిని పడగొట్టడానికి అశాస్త్రీయ మైన తీర్మానం ప్రవేశపెట్టారు.

ఇదంతా, గాంధిగారు కాంగ్రెస్సులోనుంచి వెళ్లగొట్టబడితే దక్షిణదేశంలో తమ హిందీకి ఆస్కారం లేకుండా పోతుం దనీ, తమ జవహరిలాల్ గారితో సమానంగా రెండుమాట్లు సుభాసుబోసు గారు కాంగ్రెస్సు అధ్యక్షత వహించడం సహించలేకా పడ్డపాట్లు.

జయప్రకాశనారాయణగారు వగైరా హిందూస్థానీసోషలిస్టులు త్రిపురీలో, గోవిందవల్లభపంతుగారి తీర్మానంమీద బోసుగారి పక్షంగా వోటు చెయ్యక, తటస్థంగా వుండిపోవా లని తమ వర్గం వారికి ఆజ్ఞాపించారు.

ఇదంతా, పంతుగారికి వోటు చెయ్యడం అంటే తమ వర్గానికి శత్రువు లయినవారికి వోటు చెయ్యడం కనక అందుకు సాహసించలేకా—బోసుగారికి వోటు చెయ్యకపోవడం తమ జాతికి చెందిన నెహ్రూగారి నాయకత్వానికి భంగం కలక్కుండా వుండా లనీ వేసిన యెత్తు.

సెంట్రల్ అసెంబ్లీ మెంబర్లయిన బెంగాలీలు, మొన్న మొన్న తమ తోటివారంతా వెళ్లినా.తాము మాత్రం గాంధిగారి దర్శనానికి వెళ్లడం మానేశారు.

ఇదంతా, తమ జాతికి చెందిన బోసుగారిని పడగొట్టడానికి ప్రయత్నించినందుకు వారు గాంధిగారియెడల తమకు గలిగిన రోషం ప్రకటించడానికి చేసిన పని.

కొంచెం పరిశీలించి చూస్తే ఇలాగ తక్కిన ప్రాంతాలవారి కందరికీ సంకుచితజాతీయాభిమానం పెచ్చుపెరిగి వున్నట్టు స్పష్టంగా కనపడుతుంది.

కాని యీ దుర్గుణం వొక్క కాంగ్రెస్సాంధ్రులకు మాత్రం యెంతమాత్రమూ లేదు.

కనకనే, కాంగ్రెస్సాంధ్రులలో ఎం. ఎల్. ఏ. లూ, మంత్రులూ, పార్లమెంటరీసెక్రటరీలూ, ప్రముఖులూ అయినవారు, సర్వవిధాలా పూజ్యులైన డాక్టరు ఈడ్పుగంటి రాఘవేంద్రరావుగారిని సత్కరించడానికి మొన్న మొన్న జరిగిన వీ. పీ. హాలుసభకి వెళ్లలేకపోయారు.

చాలా బాగుంది.

ఇందుకు చాలా సంతోషించి, గాంధిగారు, మొన్న మొన్న మన పట్టాభి సీతారామయ్యగారి కిచ్చినట్టే తక్కిన కాంగ్రెస్సాంధ్రప్రముఖులకు కూడా అచిరకాలంలోనే బల మైన చేయూత యిస్తా రని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు.

హిందీ ముప్పు తెచ్చి పెడుతుంది

మార్చి 23 వ తేదీని, మద్రాసు రాయపురంలో జరిగిన వొక బహిరంగసభలో, పి. ఎస్. కుమారస్వామిరాజు ఎం. ఎల్. ఏ. గారు, రాజగోపాలాచారిగారి నిర్బంధహిందీబోధనవిధానం సమర్థిస్తూ గంభీరోపన్యాసం చేశారు.

ఆభ్యంతరం యేమున్నదీ?

ఇంతకంటే కాంగ్రెస్సు ఎం. ఎల్. ఏ. లు చెయ్యవలసిన పని మాత్రం యేమున్నదీ?

మొదటి జస్టిస్సు మంత్రాంగంలో దక్షిణాంధ్రు లైన సుబ్రాయలురెడ్డిగారొక మంత్రి అయి వుండినారు.

మరొకమాటు కూడా జస్టిస్సు మంత్రాంగంలో దక్షిణాంధ్రులే అయిన కుమారస్వామిరెడ్డిగారొక మంత్రి అయి వుండినారు.

దక్షిణాంధ్రులలోనే వొకరయి వుండిన్నీ, చిల్లరచిల్లర పదవులలా వుండగా, మద్రాసు ప్రొవిన్షియల్ కో-ఆపరేటివుబాంకి డైరక్టరూ, మద్రాసు ప్రొవిన్షియల్ సెంట్రల్ లాండు మార్టిగేజిబాంకి డైరక్టరూ అయి వుండిన్నీ, కొన్నాళ్లు సెంట్రల్ అసెంబ్లీ మెంబరయి వుండిన్నీ, ప్రస్తుతం దక్షిణ రామ్నాడుజిల్లాబోర్డు ప్రెసిడెంటుగా వుండిన్నీ, ప్రతిభావంతులే కాక, దక్షిణాంధ్రక్షత్రియులలో ప్రముఖు లయి వుండిన్నీ, పదిమంత్రిపదవులలో వొకదానికీ అర్హులుగా భావించబడని కుమారస్వామిరాజుగారు నిర్బంధహిందీవిధానసమర్థనం కాక మరి చెయ్యవలసిన దేమున్నదీ?

శుద్ధాంధ్రులే కాని, రాజుగారికి తెనుగు బాగా రాదు. జిల్లాబోర్డు ప్రెసిడెంటే కాని, సాధు వరదరాజంపంతులుగారూ మొదలైన దక్షిణాంధ్రుల ప్రచారం గమనించి అయినా తమ జిల్లాలో వున్న ఆంధ్ర—ముఖ్యంగా—క్షత్రియ—బాలబాలికలకు పాఠశాలల్లో తెనుగు నేర్పడానికి తగిన యేర్పాట్లు చెయ్యవలసిన పూచీ తమకున్నట్టు గుర్తించుకో లేకపోయారు. పోనీ, తమకు ప్రాంతీయమైన అరవభాషలో అయినా వారు తగినంత పాండిత్యం సంపాదించుకున్నట్టు లేదు. అలాంటి కుమారస్వామిరాజు గారు నిర్బంధహిందీబోధనవిధానం పూనుకురాకపోతే మరేం చేస్తారూ?

మద్రాసు కాంగ్రెస్సు ప్రతినిధులు హిందీభాషాజ్ఞానశూన్యులు కావడంవల్ల త్రిపురీకాంగ్రెస్సులో మహానాయకుల వుపన్యాసాలు గాని, కొన్ని ముఖ్యసంఘటనలు గాని బొత్తిగా అర్థం చేసుకోలేకపోయారుట.

యేమిటి అయితే?

మద్రాసు కాంగ్రెస్సు ప్రతినిధులకు హిందీ ఉపన్యాసాలు బోధపడాలంటే మద్రాసు ప్రెసిడెన్సీ విద్యార్థు లందరూ నిర్బంధంగా హిందీ నేర్చుకోవా లంటారా రాజుగారు.

అవిద్యార్థులలో నూటికి తొంభైతొమ్మిదిమ్మంది ప్పాపుమందికి తమ జీవితంలో హిందీసంపర్కం యెప్పుడూ కలగ దని గ్రహించుకోలేరా రాజుగారు?

తమ లాగ కాంగ్రెస్సు పూబిలో దిగబడిపోయేవారు అవిద్యార్థులలో వొకరేనా వుంటారో వుండరో రాజుగారేమయినా ఆలోచించుకున్నారా?

కాంగ్రెస్సంటే వొక పాక్షికసంస్థ అనీ, యేకొద్దిమందికో తప్ప దేశీయులకు దాని మంచిచెడ్డలతో సంబంధం లేదనీ, దాని పని అయనించుకుని కూడా వున్నదనీ రాజుగారు తెలుసుకున్నారా!

ఇవాళ యెవరు హిందీ నేర్చుకోకపోయినా భారతరాజకీయాలు నిలిచిపోవు.

కొద్దికాలంలోనే అవి హిందీలోనే నిర్వహింపబడతాయని పొంగిపోడాని కేమీ ఆధారాలు లేవు.

కాంగ్రెస్సుసభలోనే పట్టాభిగారు, బొంబాయిలో హిందీలో వుపన్యాసం ప్రారంభిస్తే ప్రతినిధులు "మాకు తెలవడం లే" దని గోలచేసి వారిని ఇంగ్లీషుకి మళ్లించి వుండడం, పాపం, రాజుగారెరగరు కాబోలు.

ఇప్పుడు హిందీ నేర్చుకోకపోతే బ్రాహ్మణేతరులు తరవాత పశ్చాత్తాపపడతారుట.

అది అబద్ధం.

కాంగ్రెస్సులో చేరినందుకే తమవంటి బ్రాహ్మణేతరులు పశ్చాత్తాపపడేరోజులు చాలా దగ్గిరగా వున్నాయని రాజుగారికి ఇంకా తోచలేదు.

అంచేతనే కాంగ్రెస్సుకి దూరంగా వున్న బ్రాహ్మణేతరులను గురించి రాజుగారిలా జాలిపడుతున్నారు.

ధిక్.

'వాడుకభాష: రచనకి కొన్ని నియమాలు'

ఈ గ్రంథం శ్రీ కేతవరపు కామేశ్వరరావుగారు వ్రాశారు. నవ్యసాహిత్యపరిషత్తు ప్రకటించింది.

బాగుంది—

చిన్నయసూరి సీతారామాచార్యులు మొదలైనవారి త్రిలింగలక్షణాలతో తీసుకుంటూన్న సంశయాత్ములు కొందరు 'వాడుక తెనుగుభాషకు నీతీ నియమం లేదనీ—ఏకత లేదనీ' మూలుగుతూంటే దానికి జవాబుదారీగా వాడుకభాషకు కొన్ని సూత్రాలు కడితే బాగుంటుం దని సామాన్యతః స్థూలబుద్ధికి తోచవచ్చు.

కొందరు వ్యాకరణతిర్యగ్బుద్ధులు వ్యావహారిక వాదాన్ని ఎదుర్కొంటూన్న ధోరణి చూస్తే, ఒకప్పుడు నాకు కూడా వ్యావహారికభాషకు వ్యాకరణం వుంటే బాగుండు ననిపించింది.

కాని క్రమంగా—

పరిణతబుద్ధుల సహవాసబలంవల్లనూ జీవద్భాషాస్వభావం బోధపడుతూండడంవల్లనూ పైవ్యూహ భ్రాంతిమూలక మని తేలింది.

ప్రకృత మనుసరామః—

కామేశ్వరరావుగారు వాడుకభాషమీద గాఢాభిమానంతో ఈపుస్తకం వ్రాసినట్టు తోస్తుంది.

వాడుకభాష వాదానికి ప్రథమాచార్యులు శ్రీరామమూర్తి పంతులుగారు దీనికి పీఠిక వ్రాశారు. దీనితో దీనికి ఎక్కువ విలువ—అనుకుందాము.

శ్రీపంతులుగారు వ్యావహారిక భాషకు నియమాలు ఏర్పరచడం యొక్క ఔచిత్యమును చర్చించి—అసలు వాడుక భాషకు నియమాలే అక్కరలేదనీ—ఈకట్లు భాషాభివృద్ధిభంజకము లనీ—అనేక దృష్టాంతములతో నిర్ణయించి విడిచిపెట్టారు.

ఈరచయిత, తాను చూపిన నియమాలవంటి నియమాలను అనుసరిస్తే, చదువరులకి వాడుకభాషమీద మరింత ఆదరం అభిలాష కలుగుతాయనీ—ఏకత వుంటుం దనీ తలచి ఈగ్రంథం తయారు చేసినట్టు తెలుస్తుంది.

కాని—

చదువరి తాను చదివే భాషలో ఔచిత్యమూ గమనవిశేషమూ వుంటే తప్పక ఆదరిస్తాడుగాని—దీనికి నియమాలు—వున్నవా లేవా అని ఆలోచిస్తూ ఆదరించడం ప్రారంభిస్తా డనుకోను. విషయం మంచి దైతే ఎట్టిభాష యైనా ఆకర్షిస్తుంది.

ఎంకిపాటల భాష నియమితవ్యావహారికం కాకపోయినా మనం ఆదరిస్తున్నాం. చెంకటచలం కథలభాష ఏనియమాలకూ లొంగకపోయినా ఆదరించనివార్లు లేరు. నియమాలను బట్టే ఆదరించడం వస్తే ఎక్కువనియమాలు పెంచుకున్న గ్రాంధికభాష మరీ ఆదృతం కావలసినదే—

వ్యావహారికం సజ్జనుల ఆదరం పొందా లంటే ఇది కాదు మార్గం.

వాడుకభాషయొక్క జీవనాడినీ—పలుకు పొందికనూ శ్రద్ధగా గమనించి చక్కగా ప్రయోగించడం కర్తవ్యం—

ఏకత లేదనే కంప్లెంటు గూడా నాకు నచ్చలేదు.

నిజానికి ఏకత లేకపోవడం దోషమే కావచ్చు.

కాని—

నేటి జీవదాంధ్రవాణిలో ఆదోషం లేదనే నా తాత్పర్యం—

కొందరు కొన్ని మాటలను రూపభేదాలతో వ్రాస్తూన్నంత మాత్రాన ఏకత లేదనగూడదు. 'తెలియడం—తెలవడం—తెలియటం—తెలవటం' అని ఒకే మాటను నాల్గువిధాలుగా వాడుతున్నా రంటే ఇందులో దోష మేమిటి ?

ఇందులో ఏది వాడినా అర మవుతూనే వుంటుంది. జీవద్భాష కనుక ఒక మాటకు ఎన్నో రూపాలు వుండవచ్చు.

ఇప్పుడు బరంపురం వారి కథలూ—నెల్లూరి వారి వ్యాసాలూ మనకు అర్థ మవుతూనే వున్నాయి గదా—

'నేను వచ్చాడు, నీవు వెళ్లాను' అని వుంటే మాత్రం దోషం.

కొన్ని అపరిచితపదాలు పడినా ప్రకరణాన్ని బట్టి అర్థం అవుతాయి. 'మాలపల్లె' నవలలోని కొన్ని మాటలు అర్థం కావు.

భావానికి మాత్రం అడ్డురావు.

ఆమాటకు వస్తే—నిరూఢ మైన దనుకొన్న గ్రాంథికానికీ ఏకత లేదు.

'రామునకు' మనువుకు, రచించని 'రచింపని' 'రాజానాతి' శిరసందము, వీటికి ఏకత ఏదీ ? ఇలాంటివి లక్షలు—

కొందరు కొంత గ్రాంథికం కొంత వాడుక కలగలుపు చేస్తే రచయితకు వాడుకభాష సరిగా పట్టుబడలే దన్నమాట—

ఏకత లేకపోవడం కాదు.

వీరు ఏర్పరచిన నియమాలలో గూడ బహుసందేహాలు కల్గుతాయి.

ఏమండలంవారు ఆ తెలుగే వ్రాయ మన్నారు. నేను జన్మతః విశాఖమండలంవాణ్ణి. గుంటూరుజిల్లా స్నేహితుల ప్రబలసహవాసం—ఊనికి తూర్పుగోదావరిజిల్లా. పరిచయప్రాబల్యంవల్ల నారచనలో అన్ని తెనుగులూ వుంటాయి. ఇది దోష మేనా ?

'బహు తక్కువ' లాంటి మాటలు వాడవద్దన్నారు. 'అనేక మంది' సాధువేనా మరి ?

'ప్రాత-క్రొత్త, వ్రాత' ల్లోని రేఫలు వద్దన్నారు. వీరే 'క్రొత్తగా' అని వ్రాశారు—

దాని మాట ఏమిటి ?

అనడానికి 'అండం' అనవద్దన్నారు.

అందు చేతకు అంచేత అనవచ్చునా ?

వీరు చెప్పే నియమాలకూ వ్రాసే భాషకే చాలా తేడా కనపడుతున్నది.

'వ్రాయడం' రాయడం అనడం నాకు బాగాలేదు. రాయడం అంటే పూత అనే అర్థం కూడా వస్తుంది గనక. నేనీ సూత్రం చెయ్యనా ?

ఏతావతా—

వాడుకభాషకు వ్యాకరణమే వ్రాయవలసివస్తే ఇది సమయం కాదు.

ఇంకా తెనుగుదేశం మూలమూలలనుంచీ స్వచ్ఛమైన వ్యావహారికరచనలు అభివృద్ధి పొందాలి. ఇంకా రాకపోకలూ—సంబంధబాంధవ్యాలూ చేసుకొని ఆంధ్రదేశ మంతా ఒకరి పలుకుల్లు ఇంకొకరు నేర్చుకోవాలి. అప్పుడు సమర్థులైన పండితులు పర్యాయత్వేన ఈపనిని నిర్వహిస్తారు. కనుక ఈసంధియుగంలో ఇంకా వాడుకభాషకు స్వేచ్ఛాభివృద్ధినే ఇవ్వాలి గాని కట్లు కట్టవద్దు. ఈపుస్తకంలోని రచనాప్రణాళిక సరియైన విషయవిభాగంతో లేదు.

ప్రకృతిప్రత్యయాలూ—శబ్దాలూ—సంధులూ— సమాసాలూ— ధాతురూపాలూ—చక్కగా ప్రస్తరించి చూపితే గాని భాషాస్వభావం బోధపడదు.

ఇందులో అనేకవిషయాలు గుదిగుచ్చి వ్రాశారు.

లక్షణగ్రంథం తయారుచెయ్యడానికి ఈ ప్రణాళిక—ఈ సంస్కారం చాలదు. పత్రికావ్యాసాలు వేరూ—లక్షణగ్రంథధోరణి వేరూను.

ఇంతకూ—

కామేశ్వరరావుగారి నిర్మలమైన వ్యావహారికభాషాభిమానం మెచ్చుకోతగ్గది. ఇందులోని మండలాల వారీగా తయారుచేసిన రూపభేదాలపట్టిక మాత్రం నవ్యసాహిత్యాభిమానులకు బహూపయుక్తమనే మాట మాత్రం నిశ్చప్రచం. ఇ॥ హ॥

రా జ రా జు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

ఏ ని మి దో రం గం

పడమటి ప్రాకారానికి చేరివున్న పూలతోటలో, సారంగధరుడు, దిగుడుబావి పిట్టగోడమీద కూచునీ, సుబుద్ధి, గోడ కానుకుని నుంచునీ వున్నారు.

ఉదయం నాలుగఘళ్లు పొద్దెక్కింది.

పగటి పువ్వు లన్నీ చక్కగా వికసించి వున్నవి.

దక్షిణదిక్కునుంచి సంపంగెపువ్వుల పరిమళం రివ్వున దూసుకు వస్తున్నది.

పక్కనే వున్న బొండుమల్లె పొదలమీద చిక్కని పాటలు పాడుతూ కొదమతుమ్మెదలు చక్కగా నృత్యం చేస్తున్నవి.

ప్రకృతి అంతా ప్రసన్నగంభీరంగా వున్నది.

కాని, నాలుగైదు గజాల దూరాన వున్న పొగడచెట్టు కింద నుంచి, రెండుమూడు పావురాలు వుండుండి వచ్చి సారంగధరుడికి దగ్గిరా గోడమీద వాలుతూ, ఆదరం లేక చిన్నపుచ్చుకుని చెట్టు కిందికి యెగిరిపోతూ అటుమటించి పోతున్నవి.

సారంగధరుడూ, సుబుద్ధీ చింతాక్రాంతులై వున్నారు.

సారంగధరుడు—మరి నా[illegible]? వారేనా లేకపోతే గతి యేము కానూ ?

సుబుద్ధి—ఎటూ దారీ తెన్నూ కనపడదు. అంతా అంధకార బంధురంగా వున్నది.

సారంగధరుడు—వ్యాసులవారి రచన యెన్నిమాట్లు చదివినా యేదో లోటున్నట్టే కనపడుతూ వుంటున్నది. తృప్తి కలగడం లేదు. నన్నయభట్టారకులవారి రచన చదివిన కొద్దీ నూత్నరుచులు కనపడుతున్నవి. హృదయానికి ఆప్యాయనం కలుగుతూనూ వున్నది. అటు సంస్కృతమర్యాదలూ, యిటు తెనుగుజాతీయాలూ మిళితం కావడంవల్ల వారి భాష గంభీరమై ఆయితిహాసానికి మొలిచినట్టు సరిపోయింది. అలాంటి భాషలో గ్రంథ మంతా కాకపోయినా, అథమం ప్రారంభమై కొంత నడిచివున్న ఆరణ్యపర్వ మయినా పూర్తి కాకపోతే యెలాగా ?

సుబుద్ధి—ఒక్క ఆరణ్యపర్వమే యేం, భారతం యావత్తూ వొక్క వూపున పూర్తి చెయ్యా లన్నంత ఆవేగం వున్నది వారికి. నిన్న మధ్యాహ్నం నే నక్కడే వుండగా "ఏం, యీపాటికి యుద్ధపంచకం కూడా ముగిసి వుండకపోయేదా ?" అని చీదమయ్యగారిని అడిగి, అంతలో నారాయణభట్టుగారు రాగా, "ఇంత జాప్యం అయితే యెలాగోయ్ ? సంపుటం విప్పూ, గంటం పుచ్చుకో" అంటూ నాలుగుమాట్లు తొందరపెట్టారు. "శారద రాత్రులు—శారదరాత్రు" లని మననం చేసుకుంటూ తరవాయి అందుకోడానికి వారు దుద్యుక్తు లవుతూ వుండడం చూడగా, అలాంటి సితిలో కూడా కవితాశక్తి వారి నెంత గాఢంగా ఆవేశించివున్నదో, అదుష్టవ్యాధి దాన్నెంత తిరస్కరిస్తున్నదో కళ్లకి కట్టినట్టు కనపడింది నాకు.

సారంగధరుడు—(దుఃఖం సమాళించుకుంటూ వూరుకుంటాడు)

సుబుద్ధి—ఆసితిలో కూడా వారే ముందు తమ సన్నిధికి రావాలనడం కంటే మహారాజులుంగారే వొక్కమాటు వారి దగ్గిరికి వేం చెయ్యగూడదూ ప్రభూ ? ఇంతట్లోనే—(అర్థోక్తి)

సారంగధరుడు—ఏమన్నావూ ?

సుబుద్ధి—ఆసితిలో కూడా వారే ముందు తమ సన్నిధికి రావాలనడం కంటే మహారాజులుంగారే—(అర్థోక్తి)

సారంగధరుడు—అది మంచిమాటే; కాని యెవరికి ? సంసారి పక్షంగా మనం ధర్మనిరూపణం చేస్తే యిక్కడ చెల్లుతుందా ? వారు మహారాజులు. వీరు మహాకవులు. సామాన్యధర్మాలకు వీరిలో యెవరు లొంగుతారూ ? వారి పట్టుదలకి వారికీ కారణా లున్నవి. వీరి పట్టుదలకి వీరికీ హేతువు లున్నవి. ఎవరు తీసిపోతారూ ? ఇది యోచించకుండా మనం పెద్దలకు [illegible]పోవడం మంచిదా ?

సుబుద్ధి—(చకితు డవుతాడు)

సారంగధరుడు—ఏం, నామాట తమకి విపరీతంగా కనపడుతున్నదా ? బాబయ్యగారు కొంత సందిచ్చారు, తమరు మరిచారా ? అయినా భట్టారకులవారు వినకపోయారే ? ఆపున్నాదావసలో కూడా వారు తమ పట్టుదల—(అర్థోక్తి)

సుబుద్ధి—అదీ మాశాను. మాబాబయ్యగారు ఎంత దూరం చెప్పాలో అంత దూరమూ చెప్పారు. "ఈవిఘ్నం, తమకు నన్నాసరం చేస్తుం"దని—(అర్థోక్తి)

సారంగధరుడు—చెయ్యనే చేసింది కాదూ ?

సుబుద్ధి—అవునవును. మల్లన్నగారు ఈమాటే చెప్పారు. వారు, రెండుచేతులూ పట్టుకుని భట్టారకులవారిని బతిమాలారు. చివరికి "దోషం మీమీదే వుండిపోతుం" దని ముదలకించి కూడా చెప్పారు. కాని భట్టారకులవారు వినలేదు.

సారంగధరుడు—ఎప్పటి కయినా మనం భట్టారకులవారికే నచ్చచెప్పవలసి వున్నది. మరొక వుపాయం లేనే లేదు. భట్టారకులవారు బయలుదేరా రని తెలిస్తే బాబయ్యగారు గవనుదగ్గిరికే ప్రత్యుత్థానం చేస్తారు. వారిని పాదాభివందనం చేసి గుచ్చి కౌగిలించుకుంటారు. మనం సత్యం అంగీకరించాలి. కుపితులై భట్టారకులవారు వెళ్లిపోయినప్పణ్ణుంచీ బాబయ్యగారు ఉత్సాహదూరు లయి కనపడుతున్నారు. అది అలా సంభవించినందుకు వారు మథనపడిపోతున్నా రనే నేను భావిస్తున్నాను.

సుబుద్ధి—కానే వచ్చు ప్రభూ! కాదని యెందు కనుకోవాలి? తాము కోరిన గ్రంథం—తమ వంశచరిత్ర పూర్తి కాకపోతే వారు మాత్రం విచారించకుండా యెలా వుండగలరూ?

సారంగధరుడు—కనక యీపూట వారెలా వున్నారో వొక మాటు చిత్తగించి దయచెయ్యండి. భోజనానంతరం మనం వెళ్ళి మరొకమాటు ప్రయత్నిద్దాం.

సుబుద్ధి—చిత్తం చిత్తం. అలాగే చూసివస్తాను. తమరు—(అర్ధోక్తి)

సారంగధరుడు—ఒక్క క్షణం యీతోటలోతిరిగి బుల్లి బాబయ్యగారి దర్శనానికి వెడతాను. వెళ్ళిన పని తొరగా అయితే తమ రక్కడికి దయచెయ్యనే వచ్చు. (గోడ దిగుతాడు)

సుబుద్ధి—చిత్తం. (రెండడుగులు వేసి) కోనప్పశాస్త్రిలవారిని కూడా తీసుకు వెడతాను. వారూ, భట్టారకులూ ఆంతరంగికులు కదా?

సారంగధరుడు—చిత్తం.

(సుబుద్ధి బయటికి వెళ్ళిపోతాడు)

సారంగధరుడు—బాబయ్యగారు కృతకృత్యులే. కనకనే వారంతవర కయిష్టం పెట్టు దిగాయి. భట్టారకులవారి కలాంతికిది సంభవించలేదే? ఆపట్టుదలకి వున్మాదం కూడా వొకటి తోడయినదే? ప్రయోజనం వుంటుందా? బాబయ్యగారే వెళ్ళినా వారి కిక స్వాస్థ్యం కలుగుతుందా?......దీని కంతకీ విప్రకృష్టకారణం జక్కులదేవి రాజపుత్రికా, సుబుద్ధి అయ్యవారా?...ఈ.........

(సారంగధరుడు ముందుకి బయలుదేరతాడు. రెండు మలుపులు తిరిగా టప్పటికి చిలక కనపడుతుంది. స్నానం చేసి, కేశపాశం జారుముడి వేసుకుని, పట్టుచీర కట్టుకుని వుండి, పువ్వులు కోస్తూ వుంటుంది చిలక. ఒకర్ని వొకరు చూసుకుని యిద్దరూ చకితులవుతారు. చిలక అంతలో దిటవు తెచ్చుకుని, పైట సవరించుకుని, పూలసజ్జ కింద వుంచి, సారంగధరుడి కేసి తిరిగి, వంగి రెండు చేతులతోనూ నేల అంటి చేతులు కట్టుకు నుంచుంటుంది.

సారంగధరుడు—(సందేహిస్తూనే) ఎ—వ—రు—?

చిలక—నేను జక్కులదేవి పరిచారకను, నా పేరు చిలక మహాప్రభూ!

సారంగధరుడు—(మళ్ళీ చకితు డవుతాడు)

చిలక—మా అమ్మగారి పూజకోసం పువ్వులు కోతా మని వచ్చాను మహాప్రభూ!

సారంగధరుడు—అయితే నుంచుంటావేం? ఇప్పటికే (సూర్యుడికేసి చూస్తూ) చాలా పొద్దెక్కిందే?

చిలక—దీనికి పొద్దెక్కడం అంటూ యేమిటి మహాప్రభూ? మా అమ్మ సూర్యోదయానికి పూర్వమే పూజలో కూచుంటారు. నేను పువ్వులు కొయ్యడాని కివాళ యిది మూడోమాటు.

సారంగధరుడు—అ—లా—గా?

చిలక—మా అమ్మ పూజలోనుంచి లేచాటప్పటికి ఖరాగా జాము పొద్దెక్కుతుంది. మళ్ళీ సాయంత్రం నాలుఘళ్ళ పొద్దువేళే పూజలో కూచుంటారు. రాత్రి జాමున్నర అయినాకా మా అందరికీ భోజనం.

సారంగధరుడు—ఇదేదో పెద్దదీక్షగా కనపడుతున్నది.

చిలక—అవును మహాప్రభూ, పెద్దదీక్షే. పెద్దకోరికతోటే దీనికి పూనుకున్నారు మాఅమ్మ.

సారంగధరుడు—ఎన్నాళ్ళనుంచీ?

చిలక—దీక్షాస్వీకారం అక్కడ. వ్రతారంభం యిక్కడ—అంటే వచ్చిన వృత్తక్షణంలోనే అఖండగౌతమీతీర్థం తెప్పించుకుని స్నానం చేసి వ్రతారంభం చేశారు మాఅమ్మ.

సారంగధరుడు—(మళ్ళీ చకితు డవుతాడు)

చిలక—(సాకూతంగా చూస్తుంది)

సారంగధరుడు—వారి కింత కఠోరవ్రతం వుపదేశించి నడిపిస్తున్న గురువు—(అర్ధోక్తి)

చిలక—గురు వేమిటి మహాప్రభూ? ఇదంతా మా అమ్మ స్వంతంగానే నిర్ణయించుకున్నారు. సొంతంగానే పూజ చేస్తారు. కొకపోయినా సాయంత్రం పూజలో కూచున్నది మొదలు వుదయం పూజలోనుంచి లేచేదాకా పురుషుల కళ్ళబడ గూడ దని నియమం కదా, యిక గురువుగారు దగ్గిర వుండడాని కెలాగా మహాప్రభూ?

సారంగధరుడు—(ఉలిక్కిపడతాడు)

చిలక—(అది చూసి, సగర్వంగా మందహాసం చేస్తుంది)

సారంగధరుడు—(సాలోచనగా కిందకి చూస్తాడు)

చిలక ('బోధపడ్డది' అన్నట్టు శిరఃకంపం చేస్తుంది)

సారంగధరుడు—(అభావదృష్టులు పరుపుతూ స్థాణువులాగ అలాగే నుంచుని వుంటాడు)

చిలక—మాఅమ్మ కనిపెట్టుకునివుంటారు. సెల వయితే—(అర్ధోక్తి)

సారంగధరుడు—(అస్థితిలోనే) బాగున్నది. చాలా గొప్పదీక్ష.

చిలక—మహాప్రభూ!

సారంగధరుడు—వెళ్ళు, ఏం, అలా నుంచుంటావేం? వారికి పువ్వులు అందించవద్దూ? తొరగా వెళ్ళు.

చిలక—చిత్తం మహాప్రభూ!

(మళ్ళీ నమస్కారం చేసి, పూలసజ్జ పుచ్చుకుని వెనక్కి తిరిగితిరిగి చూస్తూ వెళ్ళిపోతుంది.)

సారంగధరుడు—సాయంత్రం పూజలో కూచున్నది మొదలు వుదయం పూజలోనుంచి లేచేదాకా పురుషుడి కళ్ళబడకూడదూ?

......పడగూడదూ? గొప్పదీక్ష. చాలా గొప్పదీక్ష......అయితే యీవ్రతం యేమిటీ? ఎందు కిదీ? కొత్తపెళ్లికూతురి కీదారుణదీక్ష యేమిటీ? ఈదృఢదీక్షలో భర్తకూడా పురుషుడుకిందే లెక్కా? (నవ్వుకుని) భర్త కూడా కంటబడకూడదా?

(అప్పుడొక భృత్యుడు వస్తాడు)

సారంగధరుడు—నువ్వా పువ్వులకోసమే వచ్చావా?

భృత్యుడు—(ఆలోచిస్తూ) చంద్రశేఖరం బాబయ్యగారికి పువ్వులిచ్చే వచ్చాను మహాప్రభూ!

సారంగధరుడు—మరేమిటీ?

భృత్యుడు—బుల్లిబాబయ్యగారి సెల వయింది, తమకోసం యెదురుచూస్తున్నారు బాబయ్యా!

సారంగధరుడు—(గుర్తించి) నువ్వా? ఏమన్నావూ?

భృత్యుడు—బుల్లిబాబయ్యగారి సెల వయింది. ఏలినవారికోసం యెదురుచూస్తున్నారు మహాప్రభూ?

సారంగధరుడు—సరే.

(ఇద్దరూ చెరోవేపుకీబయలుదేరతారు)

సారంగధరుడు—ఏయ్?

భృత్యుడు—చిత్తం బాబయ్యా (తడబడుతూ వచ్చి దోసిలి వొగ్గి నమ్రుడవుతాడు)

సారంగధరుడు—(తన యెదటికి తర్జనితో నిర్దేశిస్తూ ఆజ్ఞాస్వరంతో) ముందు నడు.

భృత్యుడు—(ఆశాభంగం అయినందుకు సిగ్గుపడుతూ) చిత్తం చిత్తం. (తల వంచుకుని ముందు బయలుదేరుతాడు.

సారంగధరుడు—ఏం చేస్తున్నారు బుల్లిబాబయ్య?

భృత్యుడు—ఎక్కడో మెకాలు చెలరేగుతున్నాయిట మహాప్రభూ! బుల్లిబాబయ్యగారూ, మహాసుదయ్యమంత్రిగారూ ఆవిషయమే మాట్లాడుకుంటున్నారు దేవరా!

సారంగధరుడు—వేటనన్నాహం అన్నమాట.

భృత్యుడు—చిత్తం చిత్తం. అలాగే అనుకుంటున్నారు బాబయ్యా!

ఇద్దరూ వెళ్లిపోతారు.

భలోక్తులు

'శాస్త్రిజీ'

(సాయంకాలం. సుమారు నాలుగుగంట లవుతుంది. వివిధ విషయ పరిజ్ఞాత, సరసవచస్కుడు అయిన గురువు పడకకుర్చీలో పడుకొని 'భారతి' చదువుతూ మధ్యగా ఏదో ఆలోచిస్తూ వీధివైపు చూస్తున్నాడు.

శిష్యుడు చురుకైనవాడు—ఏసంగతైనా లోతులకంటా తెలియకపోతే నిద్రపట్టనివాడు—ఏదో కొత్తపుస్తకం పట్టుకొని ప్రవేశిస్తాడు)

శిష్యుడు—నమస్తే, ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నారు—నేను నడుమను అడ్డుతగలలేదు గదా—

గురువు—(నేలు మధ్యగా వుంచి భారతిమూసి) అబ్బే—ఇందులో ఒక కథానికి—చాలా ఆకర్షించింది—చదువుతున్నా—రావోయ్ కూచో—

శిష్యుడు—(కూర్చుని) అచ్చా—సమయానికి అందుకున్నాన్న మాట—ఏమిటండీ—ఈ చిన్నకథ_కథానిక_ Short story ఒక తోవా—తెన్నూ—లేక, పట్టిగాభరగావుంది—

గురువు—వత్సా! ఎంతవెఱ్ఱివాడవోయి! Milk—క్షీర—పాలు అంతా వకటే నెమ్మదిగా సేవించు గాబరా తగ్గుతుంది.

శిష్యుడు—అస్సలు—కథ అంటే—సారాంశం......

గురువు—కథ్—to tell

శిష్యుడు—దయచేసి కొంచెం వివరించాలి—

గురువు—అనగా చెప్పడం—ఒక రసవత్ వృత్తాంతాన్ని ఒకరు ఇంకొకరి మనస్సును ఆకట్టేలాగు సహజధోరణిలో చెప్పడం—లేక దానినే గ్రంథస్థం చెయ్యడం—

శిష్యుడు—అయితే మనదేశంలో గొప్ప కథకు లెవరండీ?

గురువు—(గంభీరంగా) నైమిశారణ్యంలో వుండుకున్న శ్రీసూతులవారు—

శిష్యుడు—అది కాదండీ—ఇప్పుడు చిన్నకథలు వ్రాసేవారిలో...మొత్తం మీద......

గురువు—అయితే_మొపాసా, టాల్‌స్టాయి, పుష్కిన్, చకోవ్-గాల్స్‌వర్ది_ఇత్యాదయోమహాన్తస్సంతి.

శిష్యుడు—చిత్తం. నేనడిగేది భారతీయుల మాట—

గురువు—శరచ్చంద్రచాటర్జీ — రవీంద్రనాథ్—రవీంద్రనాథమైత్రా—ప్రేమచంద్_సీతాదేవి ఏవంవిధగుణాఖ్యులున్......

శిష్యుడు—'స్వయంతీర్త్వా పరాం స్తారయేత్, మీరింకా తెనుగుదేశంలో కాలు పెట్టవలచుకో లేదన్న మాట—

గురువు—'సంతస్స్వయం పరహితే విహితాభియోగాః' నాయనా! తెలుగుదేశంలో కాలుమోపడానికైనా సందులేదు—

శిష్యుడు—అలా అంటే ఎలాగ? 'అస్మద్గోత్రం వర్ధతాం' మనవారిలో ఉత్తమకథకులను గూర్చి సెల వివ్వాలి.

గురువు—సంపాదకీయదర్జాకు అడుగులకు మడుగులొత్తి—దేబిరించి అచ్చు వేయించుకునే వాళ్లూ—ఇదేమిటనీ ఒక సుప్రభాతాన స్వయంగానే కథల దుకాణంపెట్టి ఘోషణ చెయ్యగలిగిన వాళ్లూ—ఉత్తమ కథాసంపన్నులని నేటి వ్యపదేశం—

శిష్యుడు—అయితే తెనుగు కథకులందరూ అంతేనన్న మాటా?

గురువు—కానివారు కొద్దిమంది వున్నారు. వారు నామాటకు అతీతులు—

శిష్యుడు—గురజాడ వాల్మీకి చిన్న కథలు వ్రాశారా?

గురువు—వత్సా! చిన్న కథను 'దిద్దుబాటు' లోకి తెచ్చింది ఆయన కాదూ?—

శిష్యుడు—అంతకుముందు ఎవరైనా ఈరచన చేశారా!

గురువు—'అసూర్యానాము తే లోకాః'

శిష్యుడు—అప్పారావు గారి తర్వాత చెప్పదగ్గ వారు—

గురువు—'ఎందరో మహానుభావు లందరికీ వందనములు'

శిష్యుడు—శివరామశాస్త్రులంగారి కథలు ఎట్లా వుంటాయి?

గురువు—హుందాహారైన పండితుడు మడిగా అరుగుమీద కూర్చుని ఉపదేశముద్రతో—'చిత్తగించారూ—ఒకనాడు...' అని సవిలాసంగా చెప్పిన ట్లుంటాయి.

శిష్యుడు—దీక్షితులుగారి కథలు?—

గురువు—అమ్మమ్మ ఆప్యాయంగా ఒళ్లో కూర్చోబెట్టుకుని తల నిమురుతూ—అవసరమైన చాదస్తం వుపయోగిస్తూ చెప్పినట్టు—ఈమధ్య 'లేడీస్ కల్చరల్ క్లబ్బు' లో పడి కథలు వ్రాయడం మరచి పోయారట—

శిష్యుడు—గుడిపాటి వారిని గూర్చి—

గురువు—అది అప్పుడే బట్టీలోనుంచి తీసిన కొత్తసారా—కుర్రాళ్లకు మక్కువ—నోటా ఘాటు—ముసలాళ్లకు వాంతులు—'అనుభవరసికో విజానాతి'

శిష్యుడు—మునిమాణిక్యం కథలు?—

గురువు—20 వ శతాబ్దిలో 60 రూ॥ ఉద్యోగి కుటుంబం కాఫ్యపాత్రలతోసహా సాక్షిగా సాగిస్తూ ఒకనాడు భార్యా పిల్లలను చేరదీసి పాన్ సుపారీ నములుతూ తన్మయంగా చెప్పుతూన్నట్టు—

శిష్యుడు—అన్నట్టు—సుబ్రహ్మణ్యశాస్త్రులుగారి కథలు—

గురువు—ఆయన కథల్లో—ఆరితేరిన పక్కా పల్లెటూరిమనుషులూ—బారెడుచాపి జాగర్తకోరా అంటూ మాటాడగల ప్రౌఢ వితంతువులూ—పాతికేళ్ల కిందటి పల్లెటూరి—పట్నవాసం—పడుచు హృదయాలు—సమృద్ధిగా గంగాబొండం నీళ్లలాంటిభాష—ఇంగ్లీషు చదవడం ఖాతిరీ లేక పోవడం వల్ల ఆయన కథలకు ఆయనే అధికారి—

శిష్యుడు—మొక్కపాటి వారిని గూర్చి ఒక్క ముక్క—

గురువు—మొక్క జీడిపప్పు పాతదైనా కొత్తదైనా సరిగ్గా వేగితే స్వర్గానికి మెట్టు—ఎచ్చుతగ్గులైతే—నరకానికి రహదారి—ఇంగ్లీషు రాకవల్ల కథలు వ్రాయడమంటే కష్టం ఏమాత్రం లేదు.

శిష్యుడు—రామకృష్ణశాస్త్రిగారి మాట?

గురువు—ఒక చలాకీ స్నేహితుడు సన్నరున 'సిజరు' ప్యాకెట్టు చింపి ఒక శ్వేతకాష్ఠం నీచేతి కిచ్చి ఒకటి తాను కరచిపట్టి వెలిగించి నీబుజం మీద చెయ్యివేసి 'భాయీ! ఒక కథ వుందోయ్ విన్నావూ' అన్న ట్టుంటుంది—

శిష్యుడు—వెంపటి నాగభూషణం గారి విషయం?

గురువు—యథారాజా తథాప్రజా:

శిష్యుడు—తర్వాత కుటుంబరావు గారి కథల మాట యెత్తనా?

గురువు—'స్వగతం' లో యెత్తి 'కారుణ్యం' గా చదువు—"ఒకరి ప్రోద్బలం లేకుండా ఆయన్ను ఎందరో పొగిడారు సుమా!"

శిష్యుడు—హనుమచ్ఛాస్త్రి కథలో—

కొన్ని—'అడవి పువ్వులు—' కొన్ని. 'దౌర్జన్యాలు' కొన్ని. 'కళాభాయీ' కలం విసురులు—బందరుకథల గీర్వాణగాలి ఈయన కథల్లో తుఫాను లేవదీసింది—అస్తు.

శిష్యుడు—నీలకంఠం కథలు?

గురువు—క్షీరకంఠుల కోసం. దిగితే గరళకంఠు లవుతారు

శిష్యుడు—బాపిరాజు గారి కథల మాటేమిటి?

గురువు—అడవిలో ఎం[illegible]సనలు విచ్చిన పుష్పాలున్నా యనుకున్నావు—ఎన్ని జ్యోతిర్లతలు! ఎన్ని ఓషధులు!

శిష్యుడు—(తన చేతిలోని పీచుకాగితాల కథల సంపుటిని చూపుతూ నవ్వి—) ఏమి శలవు?

గురువు—(అట్టహాస పూర్వకంగా) "పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా!" స్వస్తి ఆంధ్రకథాభ్యః—కథకేభ్యః.

(సెలవుతో నిష్క్రమిస్తాడు)

గాంధిగారి ఆశ్రమంలో తీపికల్లు ప్రధానపానీయం

తాడి, కొబ్బరి, ఈత, ఖర్జూరం, సగ్గుచెట్లనుంచి తియ్య బడిన తీపికల్లును గాంధిగారి వార్ధా ఆశ్రమంలో "నీరా" అని వాడతారు.

ప్రతీ దినమూ సూర్యోదయానికి పూర్వమే అది ఆశ్రమంలోకి వస్తుంది.

చాలామంది—అందరూ అనే చెప్పవచ్చు—ఆప్యాయ నంగానూ తృప్తిగానూ అది పుచ్చుకుంటారు.

దానివల్ల, వారు, తమ విధులను కులాసాగానూ, వుల్లాసంగానూ శ్రమ అనేది యెరగకుండానూ నిర్వ హించుకుంటారు.

నిజానికి, తీపికల్లు అనీ, పుల్లనికల్లనీ తేడా చూపించ వలసిన అగత్యం యేమీ లేదు.

కల్లు అనేటప్పటికే దాల్లో యెన్నో మంచి గుణా లున్నవి.

అయితే మోతాదు దాటగూడదు.

దాటితేమాత్రం మోతాదు తక్కదు.

ఈవిషయాలలో ఆయుర్వేదీయగ్రంథాలు ఎన్నో వివరా లిచ్చి వున్నాయి.

చరకం, శుశ్రుతం, వాగ్భటం, మాధవనిదానం వగైరా గ్రంథాలు చూడగలవారి కీవిషయాలు చాలా చక్కగా బోధపడగలవు.

తీపికల్లు బెల్లం చెయ్యడానికి పనికివస్తుంది. పుల్లకల్లు పనికిరాదు.

లోకంలో వున్న భేదం యిది మాత్రమే.

కాని, గాంధిగారి ఆశ్రమంలో తీపికల్లుకే ఆదర గౌరవా లేర్పడినవి.

అయితే "సర్వేషా మన్నజాతీనాం మద్యం మూర్ధ్ని వ్యవస్థితమ్" అని ఆయుర్వేదం ఖండితంగా చెబుతున్నా, పరిశోధనలు చేసి వార్ధా ఆశ్రమంవారు తీపికల్లులో విశిష్టత వున్న దని నిరూపిస్తున్నప్పుడు మేము దాన్ని కాదనము.

కల్లు అనేది వారికి అంగీకారం అయినప్పుడు తీపి కల్లులో విశేషం వున్న దంటే పేచీపెట్టవలసిన అగత్య మున్నూ యెవరికీ లేదు.

ఏతావతా:

ఇటీవల వాకనాడు, వార్ధా ఆశ్రమంలో తీపికల్లే పుచ్చుకున్న వారిలో అయిదుగురికి జబ్బుచేసినట్టూ, అది కలరా అనుకునే టట్టుండినట్టూ, ఆఅయిదుగురిలోనూ ముగ్గురు చనిపోయినట్టూ, దానిమీద గాంధిగారు కొన్నాళ్లు మౌనవ్రతం అవలంబించినట్టూ ఉత్తరదేశపు పత్రికలలో చాలామంది చూసి వుంటారు.

ఈవిషయం తెనుగుదేశానికి మొట్టమొదట పరి చయం చేసినవారు, మా మిత్రులు డాక్టరు యర్రమిల్లి జగన్నశాస్త్రిగారు.

వారి లేఖను ౨౩—౨—౩౮ జనవాణి ప్రకటించింది.

డాక్టరుగారు పేర్కొన్న గజాననవాయకు గారి వ్యాసం, గాంధిగారి హరిజనపత్రికలో జనవరి రెండో తేదీ సంచికలో ౮౧౫-౧౬ పేజీలలో ప్రకటన అయి వున్నది.

తీపికల్లు మంచి దనడం—అలా అనడంలోనూ గాంధిగారి శిష్యులు—సన్నిధానవర్తులు — ఆశ్రమ వాసులు—కుడిభుజమే అయినవారు అనడం—అది పత్రికలో పడడం—ఆపత్రిక గాంధిగారి హరిజనపత్రికే కావడం — ఇదంతా, నిషేధశాసనాసనాలు చేసి కాంగ్రెస్సుమంత్రులు మద్యపానం నిక్కచ్చిగా తగ్గించి వేస్తున్న యీసమయంలో దేశీయులు అందరూ తప్ప కుండా తెలుసుకోవలసి వున్నది.

ఏదో విధంగా మద్యాన్ని తమ ఆశ్రమానికే రప్పించుకుంటూ, దానికి స్వాగతసత్కారాలు చేస్తూ నే గాంధిగారు మద్యనిషేధం అగత్యం అనడం యేమిటో కూడా దేశీయులు తెలుసుకోవలసి వున్నది.

నాయకుగారి వ్యాసం మూలాతిక్రమణం కాకుండా తెనుగులో అనువదించి శ్రమజీవి సంపాదకులు శ్రీమాన్ చిలకమర్రి నరసింహాచార్యులు బి. ఏ. (ఆనర్సు) గారు మాకు దయచేశారు

అది యీకింద ప్రకటిస్తున్నాము.

ప్రబుద్ధాంధ్ర సంపాదకుడు

"తీపికల్లు బలకర మైన పానీయం

తాడి, యీత, ఖర్జూరం, కొబ్బరి, సగ్గు చెట్లనుంచి అప్పుడే గీసిన—పులవని—తీపికల్లు మన దేశంలో కొన్ని ప్రాంతాలలో సృష్ట్యాదినుంచీ సర్వజనప్రియ మైన పానీయ మయి వున్నది. బలవర్ధక మైన, దాని అమోఘ శక్తి తెలవక, జనులు, ఆహారపదార్థంగా దాని కున్న విలవ గుర్తించివుండలేదు. దీనికి సాయం, విద్యావంతు లలో కొందరు, అనుభవం వల్ల కాక కేవలమూ వినికిడి వల్ల తీపికల్లు హానికర మైన పానీయ మనుకుంటున్నారు. మరికొంతమంది, మత్తు కలిగించే పానీయాలను గురించిన వింతవింతల అపోహాలవల్ల తీపికల్లును ఏవగించుకుని, అది జాతీయపానీయం కావడానికి తోడ్పడకుండా వున్నారు. భేదం తెలుసుకోలేక, వారు, దీన్ని సర్వాత్మనా మత్తు కలిగించే మద్యంగానే భావించి కంగారుపడుతున్నారు. అప్పుడే తీసిన చెరుకురసం దేశం అంతటా, ఫాషనబుల్ పానీయ మయి వున్నది. అయితే, అదికూడా తీపికల్లు లాగే పులిసిపోతుంది. బలవర్ధకత్వం విషయమై తీపి కల్లూ చెరుకురసమూ తహావ్వేలు వేసి చూడడం, తీపికల్లును గురించిన అపోహాలు పోగొట్టడానికి సాయ పడుతుంది. కూనూరిలో వున్న ఇండియన్ రీసర్చి ఫండు అసోసియేషన్ వారి న్యూట్రిషన్ రీసర్చి లేబరేటరీ డైరక్టరంతటివాడు యీ రెండు పానీయాలనూ యీ కింది విధంగా విభజించి చూపించాడు.

ద్రవ్యాలు		తీపికల్లులో	చెరుకురసంలో
1 నీరు	%	84.72	75.9
2 ప్రోటీన్	,,	0.10	1.4
3 కొవ్వు	,,	0.17	0.6
4 ఖనిజద్రవ్యం	,,	0.66	0.3
5 పీచు	,,		...
6 కార్బోహైడ్రేట్		14.35	21.8

ఖనిజద్రవ్యాలను విభజించి చూసి, ఖనిజ సంబంధా లైన లవణాల భాగాలను వారీకింది విధంగా సిర్ధారణ చేసి వున్నారు.

లవణాలు		తీపికల్లులో	చెరుకురసంలో
1 సున్నం	%	0.149	లేదు
2 భాస్వరం	,,	0.011	లేదు
3 ఇనుము	,,	0.26	లేదు

తీపికల్లు ఔషధోపయోగాలు

కే. ఎమ్. నడ్కర్ణీగారి ఇండియన్ మెటీరియా మెడికాలో ప్రతీచెట్టు తీపికల్లును గురించీ యీకింది భోగట్టా యివ్వబడ్డది. దానితో పాటు అది బెల్లం చెయ్యడానికి పనికివచ్చే ముడిపదార్థం అని కూడా చెప్పబడ్డది.

కొబ్బరి తీపికల్లు—పులవకుండా వున్నప్పుడు, గర్భ వతులు, యిది వారానికి రెండు మూడు మాట్లు పుచ్చు కున్నట్టయితే శిశువు శరీరం రంగులో స్ఫుటమైన భేదం కనపడుతుంది. అంటే, నల్లని దంపతులకు పుట్టే శిశువు వారికంటే బాగా యెర్రగా వుంటుంది. ఎర్రని దంపతు లకు కలిగే శిశువు దొరల శిశువుల రంగులో వుంటుంది. (౨౩౧ వ పేజీ)

ఈత, ఖర్జూరచెట్ల తీపికల్లు — ఇది చలవచేసే పానీయం. (౬౬౨ వ పేజీ)

తాటిచెట్టు తీపికల్లు—మూత్రకారి. చలవచేస్తుంది. ఉద్రేకం పుట్టిస్తుంది. ఆంటిఫ్లోజెస్టిక్కు. సూర్యోద యానికి పూర్వమే గీసింది చలవ చేస్తుంది. చాలా రోజులపాటు ఉపయోగం పుచ్చుకుంటూ వుంటే విరేచన కారిగా పనిచేస్తుంది. వాపులున్నూ, ఉబ్బు (నంజు) న్నూ పోగొడుతుంది. గాస్ట్రిక్కు-కటారాలో ఎక్కువ్వు కడు తుంది. సెగవ్యాధిలో ఇది ధారాళంగా మూత్రం జారీ చేస్తుంది.

సగ్గు తీపికల్లు — పుష్టికరమైనది. కామోద్రేకం కలిగిస్తుంది. విరేచనకారి.

అప్పెండిసైటిస్ వ్యాధి కిది మందు

కొలంబో జనరల్ ఆస్పత్రిలో సీనియర్ సర్జనుగా వుండి రిటైరయిన డాక్టరు ఎస్. సి. పాలు ఎమ్. డి.,

ఎఫ్. ఆర్. ఎస్ గారు, తిరునల్వేలిలో, యీమధ్యనే వొక సమ్మాననం సందర్భంలో జవాబిస్తూ ఏం చెప్పారంటే?

"అప్పెండిసైటిస్ అనే వ్యాధి నాగరికత వృద్ధి పొందడంవల్ల వ్యాప్తి అయినది. ఇప్పటి నాగరిక భోజనంలో విటమినులు లేవు. బి. విటమిను అసలే లేదు. కనకనే మన రోగనిరోధకశక్తి క్షీణించి పోతున్నది."

దీని లక్షణాలూ, నిదానమూ, శస్త్రచికిత్సావిధానాలూ—వీటిని గురించి చెప్పి పాలుగారింకా యేమన్నారంటే?

"నా వైద్యానుభవంలో తాటిచెట్టునుంచి తియ్యబడ్డ తీపికల్లు, కొందరికి ఈఅప్పెండిసైటిస్ వ్యాధిని నివారణ చేసింది. ఇది పరిశోధించి చూడవలసిన వస్తువు. తాడిచెట్టు తీపికల్లు యీస్టు (సురగ?) లో బి. విటమిను చాలా అధికంగా వున్నది. రోగులకు అది యెంతో నిరోధకశక్తి కలిగిస్తుంది. వ్యాధిని నిర్మూలించే శక్తిన్నీ దానికున్నది" అని ఆయన బాగా నమ్ముతున్నారు.

పుష్టికరమూ, ఔషధమై చాలా పని చేసేదీ అయిన యీతీపికల్లును వాడీ, పరిశోధించీ తెలుసుకోవలసినదెంతో వున్నది. ఈపనులు చెయ్యడానికవకాశాలున్నూ యెన్నో వున్నవి. దయాళులైన వైద్యులున్నూ, ప్రకృతిశాస్త్రజ్ఞులున్నూ దీనివిషయమై యెంతో పని చెయ్యగలరు. వారు, నానాబాధలూ పడుతూ తిండానికి కూడా యేమీ లేని కోట్లకొలది మన దేశీయులకు—అందులోనూ పల్లెటూరివారికి ఈ విధంగా ఎంతో సేవచేసి, వారు ఆనందించవచ్చు. అనుభవపరులైన పరిశోధకుల నివేదికలనూ, స్వయంగా వాడి దాని శక్తి తెలిసికొన్నవారి నివేదికలనూ వార్ధాలో వున్న ఏ. ఐ. వి. ఐ. ఏ. వారి బెల్లపుడిపార్టుమెంటువారు వందనపూర్వకంగా స్వీకరిస్తారు."

నిజాం రాష్ట్రమూ—మన ఆంధ్రులున్నూ

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

3

రెండో వ్యాసంలో కార్యనిర్వాహకసభలో పనిచేసే సభ్యుల పరిపాలనలో వుండే శాఖలు వివరించాను. వాటివివరా లిక్కడ.

మాల్గుజారి

అంటే రెవెన్యూశాఖ. రాష్ట్రాదాయం అంతటిలోనూ భూమిపన్నుల ఆదాయమే పెద్దది. తద్వారా యీశాఖ ఏప్రభుత్వానికైనా చాలా ముఖ్యమైనది.

ఈరాష్ట్రం మన హిందువుల పరిపాలనలో వుండేటప్పుడు పంటలో ఆరో భాగం పుచ్చుకునేవారు. మహారాష్ట్రులు నాలుగో (చౌత్) భాగం పుచ్చుకునేవారు. ప్రతిగ్రామానికీ వొక పటేలూ, వొక పట్వారీ వుంటారు. కొన్ని గ్రామాల పటేళ్లమీద అధికారి దేశముఖు. అలాగే కొన్ని గ్రామాల పట్వారీలమీద అధికారి దేశపాండ్యా. దేశముఖులమీద సర్ దేశముఖులు. దేశపాండ్యాలమీద సర్ దేశపాండ్యాలు.

గోల్కొండనవాబులు ఈపద్ధతినే అనుసరించారు.

రాష్ట్రం అసఫ్‌జాః వంశంవారి స్వాధీనమైనది. మొదటి నిజాముల్ ముల్కు కాలంలో యీరాష్ట్రం ౫ సుబాలుగానూ, ౧౬ సర్కారులుగానూ, ౧౨౭ మహాలులుగానూ విభక్తం అయినది. తరవాత కొన్నాళ్లకి మళ్లీ సర్కారులను పరగణాలకింద విభజించారు. ప్రతీపర్గణాను ఇంత శిస్తు అని నిర్ణయించి గుత్తేదారుకో, తాలూక్దారుకో, ఒక సంవత్సరానికో, మూడేళ్లకో, గుత్త కిచ్చేవారు. ఆగుత్తేదారులూ, తాలూక్దారులూ దేశముఖులనూ, దేశపాండ్యాలనూ సాయం పుచ్చుకుని శిస్తు వసూలు చేసి నిర్ణయించబడ్డ మొత్తం నవాబుకి చెల్లించి తతిమ్మా తాము వాడుకునేవారు.

అప్పుడు భూములకు కొలతలు లేవు. పన్ను భూమిపరిమితినిబట్టి కాక, కాడి కింత అనీ, ఎద్దు కింత అనీ వసూలు చేసేవారు. రెండెడ్లుంటే ౫ మొదలు ౧౦ రూపాయలదాకా పుచ్చుకునేవారు. నాలుగెడ్లుంటే ౧౦ మొదలు ౨౫ రూపాయలదాకా పుచ్చుకునేవారు.

ఈభూమిపన్నే కాక ఈక్రిందివృత్తుల పన్ను కూడా అప్పు డుండేది.

౧.	ధంగర్ పట్టీ	అంటే	గొల్లలమీద
౨.	ఢేడ్ పట్టీ	,,	మాల మాదిగల మీద
౩.	షాదీపట్టీ	,,	పెళ్లిళ్లమీద
౪.	చర్సపట్టీ	,,	తోళ్లమీద
౫.	భోయీపట్టీ	,,	బోయీలమీద
౬.	హాట్ బాజారీ	,,	సంతలమీద
౭.	కలాల్ పట్టీ	,,	కల్లుదుకాణాలమీద
౮.	జులాహాపట్టీ	,,	సాలెవాళ్లమీద
౯.	ధారాపట్టీ	,,	లోకల్ ఫండువంటిది
౧౦.	రాహదారీపట్టీ	,,	మార్గస్థులమీద
౧౧.	గనీంబాబ్	,,	శత్రువులనుంచి రక్షించినందుకు
౧౨.	పరాలపట్టీ	,,	గడ్డి అమ్మకం మీద
౧౩.	బట్ సబ్జీ	,,	కూరగాయల అమ్మకంమీద
౧౪.	బాన్సఫరోషీ	,,	బొంగుల అమ్మకంమీద
౧౫.	మజ్కూరీపట్టీ	,,	కూలీలమీద
౧౬.	రెడ్డిరుసుము	,,	రెడ్డిగారికి చెల్లించేది
౧౭.	దఫన్	,,	శవాలు పూడ్చినందుకు
౧౮.	తైలీ, పాన్ పట్టీ	,,	నూనె-తమలపాకుల అమ్మకంమీద
౧౯.	మచ్లీపట్టీ	,,	చేపలవృత్తిమీద
౨౦.	కుంభార్ పట్టీ	,,	కుమ్మరియివ్వవలసింది
౨౧.	ఖైస్ పట్టీ	,,	దున్నపోతు లున్నవా రివ్వవలసింది
౨౨.	ఆదంపట్టీ	,,	హిందూ శిల్పుల మీద
౨౩.	మొహతర్ఫా	,,	మగ్గాలమీద
౨౪.	సఫర్ పట్టీ	,,	జమీందారు కమాను ఖర్చులకు

ఇంకా యిలాంటివి చాలా వుండేవి. ఇప్పుడు వీటిలో నూటికి తొంభై పాళ్లు తీసివేశారు.

సాలార్జంగుగారు దివాను పదవి స్వీకరించాక గుత్తాపద్ధతి తీసివేశారు. భూములు కొలిపించి పరిమితిని పట్టి పన్నుల యేర్పాటు చేశారు.

అప్పుడు తమకి నష్టం కలగడంవల్ల గుత్తేదారులు తిరుగుబాటు చేశారు. చాలా అల్లర్లు జరిగాయి. దానిమీద వొకటిరెండుమాట్లు బ్రిటిషుసైన్యం సహాయం కూడా పుచ్చుకుని వాటిని అణచివేశారు.

ఇప్పుడు రాష్ట్రం అంతటా సెటిల్ మెంటు జరిగి వున్నది. కొన్ని జాగీర్లలోనూ, సంస్థానాలలోనూ మాత్రం పూర్వపద్ధతే నడుస్తున్నది.

కరోడగిరి (కస్టమ్సు)

మద్రాసు, బొంబాయి, కలకత్తా వంటి రేవుస్థలాలలో ఖండాంతరాలనుంచి వచ్చే సరుకులమీద సుంకం వసూలు చెయ్యబడుతుంది. సరుకు ఎక్కడి దయినా సరే నిజాం రాష్ట్రంలో ప్రవేశిస్తే యిలాగే సుంకం వసూలుచేస్తారు. దీన్ని కరోడగిరి అంటారు. నిజాంరాష్ట్రం చుట్టూ ఇలాంటి పన్ను వసూలు చెయ్యడానికి ఏర్పాట్లున్నవి. వర్తకులే కాక ప్రయాణీకులు కూడా మూటా ముల్లే విప్పి అధికార్లకు చూపించి సుంకం చెల్లించవలసిన వస్తువులుంటే చెల్లించితీరవలసిందే.

ఆబ్కారీ

మద్యపానమూ, మద్యాదాయమూ ప్రపంచ మంతటా వున్నది. కర్మభూమి అయిన మన భరతఖండం అంతటా వున్నది. నిజాం రాష్ట్రంలోనూ వున్నది.

తక్కినచోట్ల లాగే నిజాంరాష్ట్రంలో కూడా భూమ్యాదాయం తరవాత మద్యాదాయం అంత వున్నది. అయితే, మొన్న మొన్నటిదాకా ప్రభుత్వం యీవిషయమై కలగచేసుకోలేదు. కల్లు సారా వగైరా మధుపదార్థాలు ప్రజలు ఎవరి కిష్టంవచ్చినంతా వారు తయారుచేసుకుని సేవిస్తూ వుండేవారు.

ఇటీవలే ప్రభుత్వం దీన్ని వొక శాఖగా ఏర్పరిచింది ఇక్కడలాగే కల్లంగళ్లు వేలంపాట పద్ధతిలో ఏర్పడుతూ వుంటాయి. నల్లమందూ, గంజాయీ బ్రాందీలు వగైరాలు కూడా వేలంపద్ధతిమీదే అంగళ్లేర్పడుతూ వుంటాయి.

అడవులు

నిజాము రాష్ట్రంలో ౯౮౨౦ చదరపుమైళ్ల అడవులున్నవి. అవే కరకా లున్నవి. చిట్టడవులూ కీకారణ్యాలూ కూడా వున్నవి ౧౩౪౨ ఫసలీలో దీనికోసం అయిన ఖర్చు ౮,౧౦,౯౫౦-౦-౦ ఆదాయం ౧౩,౦౬,౩౫౯-౦-౦. ఇందులో చాలాభాగం వంటచెరుకువల్లా కలపవల్లా వస్తుంది. గడ్డివగైరాలవల్ల కూడా కొంత వస్తుంది. కరవుల్లో మాత్రం పశువులను వుచితంగా మేపుకోనిస్తారు.

పోలీసు

ఇందులో రెండు భాగాలు. ఒకటి కేవలమూ హైదరాబాదు నగరానికి మాత్రమే సంబంధించినది. రెండోది రాష్ట్రాని కంతటికీ సంబంధించినది. నగరశాఖ ప్రధానాధికారికి మొగలాయీల కాలంనుంచీ కొత్వాల్ అని పేరు. బ్రిటిషిండియాలో పోలీసుకమిషన రంటారు. కొత్వాలు కింద మదద్గారులూ, వారికింద సదరమీనులూ, వారికింద అమీనులూ, అమీనులకింద జమేదారులూ, జమేదారులకింద జవానులూ వుంటారు. నగరంలో వున్న జవానుల సంఖ్య ౧౩౪౨ ఫసలీలో 3333 గురు.

నగరశాఖ పని రౌడీలను హద్దులలో వుంచడమూ, రాకపోకలు సద్దడమూ, దొంగతనాలు హత్యలూ వగైరా జరక్కుండా చూడడమూ, దోషులను పట్టుకోవడమూ వగైరా చాలా వుంది.

సి. ఐ. డి. పోలీసుశాఖ కూడా వున్నది. ఆశాఖలో స్త్రీలు కూడా పని చేస్తున్నారు.

కొత్వాలు కచ్చేరీలాగే, నగరంలో, రాష్ట్రీయపోలీసు అధికారి కచ్చేరీ కూడా వున్నది. ఈ శాఖలో పెద్ద అధికారి హోదా డైరక్టర్ జనరల్ అని. (సదర్ నాజిం) ఇతనికి కొందరు మదద్గారు లున్నారు. ఈ మదద్గారుల కిందివారు జిల్లా సూపరెంట్లు (మొహతెమీములు) వారికింద సర్కిల్ ఇన్‌స్పెక్టర్లూ, వారికింద ముంతజములూ, వారికింద మొహరిర్లూ, దఫేదారులూ, జవానులూ వున్నారు.

ఇప్పుడు జిల్లాలలో

పోలీసు అధికార్లు ౧౬౫౫ మందీ.

జవానులు (కానిస్టేబుల్సు) ౯౯౬౩ మందీ వున్నారు.

సర్ఫేఖాసులో

పోలీసు అధికారులు ౧౭౦ గురూ,

జవానులు ౧౫౯౩ గురూ వున్నారు;

రైల్వే

రాష్ట్రంలో వొక యింగ్లీషుకంపెనీవారు, రైల్వే ప్రారంభించి "నిజాం గారంటీడ్ స్టేట్ రెయిల్వే" అనే పేరితో నడిపేవారు. ౧౯౩౦ లో నైజాముగారు ౧౬,౬౦,౦౦ ౦౦౦ రూపాయలకు దాన్ని కొనేశారు. ఆరెయిల్వేకంపెనీ, అప్పటికి నైజాము గారికి ౩౭,౩౦,౦౦౦ పౌండ్లు బాకీ తేలారు. నైజాముగారు అది మినహాయించుకుని. తతిమ్మా ౪౫,౭౦,౦౦౦ పౌండ్లూ యిచ్చేసి రెయిల్వే స్వాయత్తం చేసుకున్నారు. ఇప్పుడు నిజాంరాష్ట్రంలో ౧౨౯౦ మైళ్ల రెయిల్వే వున్నది. అందులో ౬౬౬ మైళ్ళు పెద్ద లైను. ౬౨౪ మైళ్లు చిన్న లైను.

కరీంనగరు, మెదకు, నల్లగొండ వగైరా తెనుగుజిల్లాలలో యింకా రెయిల్వే పడలేదు.

పోస్టు

నిజాం రాష్ట్రంలో ౭౯౪ పోస్టాఫీసు లున్నవి. ఉత్తరాల డబ్బాలు ౯౦౦ వున్నాయి. [illegible] ఘనీలతో రాష్ట్రం అంతటా వున్న పోస్టాఫీసులను చూస్తే ౧౦౪ చదరపు మైళ్లకొకటిచొప్పున వున్నది.

వారానికొకమాటు కొన్ని గ్రామాలకూ, రెండువారాల కొకమాటు కొన్నిగ్రామాలకూ టపాబంట్రోతులు వెడుతూ వుంటారు. కార్డులూ, కవర్లూ, రిజస్టరుడుజాబులూ, వీ. పీ. లూ, మనియార్డర్లూ పంపుకోవచ్చును.

రాష్ట్రంలో పోస్టలుసౌకర్యాలింత తక్కువగా వున్నా కార్డులూ, కవర్లూ వగైరా వెల చాలా తక్కువ. ఈసంగతి బోధపడడానికి కింది సంగతులు తెలుసుకోవాలి.

ఇక్కడి మన రూపాయకూ, అక్కడి నైజాంగారి రూపాయకూ మారకం రేటు ౧౬ పైసలు. అంటే ఆరూపాయి వొకటీ పైసలు పదహారూ యిస్తేగాని మన రూపాయ వొకటి రాదు. రూపాయకు ఇక్కడి లాగే రెండర్ధలూ, నాలుగు పావలాలూ, యెనిమిది బేడలూ, పదహారణాలూ వున్నవి. అణాకు ఆరుపైసలు. అక్కడ మన డబ్బుల వంటివి లేవు. అక్కడి కార్డు ఖరీదు ఆపైసలు రెండు.

నైజాముగారికి టెలిగ్రాఫ్ లేదు. రాష్ట్రంలో వున్న దంతా బ్రిటిషువారిది. ఇప్పుడు రెయిలు స్టేషను లున్న చోట్లకు మాత్రం నైజాంగారి టెలిగ్రాఫ్ వున్నది. బ్రిటిషిండియావూళ్లకు గాని, విదేశాలకు గాని టెలిగ్రాము లివ్వుకోవా లంటే బ్రిటిషు పోస్టాఫీసులో యివ్వుకోవాలి. నగరంలో బ్రిటిషుపోస్టాఫీసు వున్నది. అక్కడ, దాన్ని, ఇంపీరియల్ పోస్టాఫీసు అంటారు.

ఇంపీరియల్ పోస్టుడబ్బాల రంగు యెరుపు, నైజాము పోస్టు డబ్బాల రంగు పసుపు.

నైజాము స్టేటు రంగు పసుపు. నైజాము గవర్నమెంటుని మాసే కాబోలు మన కాంగ్రెస్సువారు పసుపురంగు కోరుకున్నారు. అందుచేతే కాబోలు మన కాంగ్రెస్సు మంత్రాంగం కూడా నైజాము గవర్నమెంటులాగే నిరంకుశంగా నడుస్తున్నది.

న్యాయస్థానములు

నిజాముదాష్ట్రంలో కూడా బ్రిటిషిండియాలో లాగే న్యాయస్థానా లున్నవి.

ప్రతీతాలూకాపట్టణంలోనూ మున్సిఫ్‌కోర్టున్నది. దాని అధికారి మున్సిఫ్.

ప్రతీజిల్లానగరంలోనూ మున్సిఫ్‌కోర్టుమీద అప్పీళ్లకు జిల్లా కోర్టున్నది.

దాని అధికారి పేరు నాజిమ్.

ప్రతి సుబానగరంలోనూ జిల్లాకోర్టుమీద అప్పీళ్లకు సుబా కోర్టున్నది. దానిపేరు సదర్ అదాలతు. దాని అధికారి సదర్ నాజిమ్.

హైదరాబాదులో సదర్ అదాలతుమీద అప్పీళ్లకు హైకోర్టున్నది. దానిని పుర్దూలో అదాలతుల్ ఆలియా అంటారు. హైకోర్టులో న్యాయమూర్తులు తొమ్మండుగురు, హైకోర్టు న్యాయమూర్తిని రుకున్ అంటారు.

ఒక్కొక్క సందర్భంలో యీ హైకోర్టుమీద అప్పీళ్లకు అగత్యం కలుగుతూ వుంటుంది. అందుకోసం దానిమీద జూడిషియల్ కమిటీ వున్నది.

నిజాము రాష్ట్రంలో, దీవానీ అనీ, ఫౌజ్దారీ అనీ న్యాయం రెండు రకాలుగా వున్నది.

దీవానీలో సివిల్ వ్యవహారాలూ, ఫౌజ్దారీలో క్రిమినల్ వ్యవహారాలూ పరిష్కారించబడతవి.

ఇవి కాక, హైదరాబాదు నగరం కోసం దీవానీబల్దాక చేరీలనీ, ఫౌజ్దారీబల్దాక చేరీ లనీ ప్రత్యేకంగా వున్నవి.

మన బ్రిటిషిండియాలో మున్సిఫ్ కోర్టులవరకూ ఆయాజిల్లాల భాషే వ్యవహారభాష. నిజాము రాష్ట్రంలో అంతటా వుర్దూలోనే వ్యవహారం.

రాష్ట్రం అంతటా వున్న న్యాయస్థానాల తనిఖీనిమిత్తం, యిటీవల, ఇన్‌స్పెక్టర్ జనరల్ అని వొక అధికారి యేర్పడివున్నాడు.

పదిసంవత్సరాల కిందటే నిజాము రాష్ట్రంలో న్యాయశాఖా కార్యనిర్వాహకశాఖా వేరుచెయ్యబడ్డవి.

మన బ్రిటిషిండియాలో నేటికి కూడా—కాంగ్రెస్సు ప్రభుత్వంలో కూడా యీసంస్కారణ జరగలేదు.

ఇస్లాముమతసంబంధమైన తగువులు తీర్చడానికి నగరంలో వేరే కోర్టున్నది. దానిపేరు "దారుల్‌ఖజా" దాని అధికారి నాజిమ్. ఆకచేరీలో ముస్లిముల వివాహసంబంధమైన వ్యవహారాలూ, భార్యల భరణాలూ, తల్లాకులూ—అంటే పురుషుల విడాకులూ, ఖులా—అనగా భార్యలు భర్తలకు విడాకు లివ్వడమూ, వారసుల నిర్ణయమూ, బీజనిర్ణయమూ అనగా "ఈమనిషి ఫలానావాడి కొడుకవునా కాదా" అని నిర్ణయించడమూ, మహరూ—అంటే ఓలీ మొదలైనవాటిని గురించి విచారణా, తీర్పూ చెయ్యబడుతూ వుంటవి.

ఇదివరకి, ఖూనీ చేసినవారికి, హైకోర్టులో శిరచ్ఛేదశిక్ష విధించినప్పుడు, షరా ప్రకారం చెల్లుతుందా చెల్లదా అనే తీర్పు చెప్పడానికి ముఫ్తీ అని వొక అధికారి వుండేవాడు. ఇప్పుడు ఆయేర్పాటు లేదు. కాని బ్రిటిషిండియాలో వున్న వొక ముఫ్తికి నెలజీతంయిస్తూ ఇప్పటికీ అతని అభిప్రాయం తెలుసుకుంటూవుంటారు.

హైదరాబాదు నగరంలో మాత్రమే స్మాల్ కాజు కోర్టున్నది. దీన్ని అదాలతే ఖఫీఫా అంటారు. తాలూకాలలోనూ, జిల్లాలలోనూ యీకోర్టులు లేవు. మున్సిఫ్‌ల దర్జానూ, నాజిముల దర్జానూ బట్టి ఈస్మాల్ కాజు వ్యవహారాలు పరిష్కరించడానికి కూడా వారికే అధికారం ఇవ్వబడ్డది. నగరంలో ౨ వేలకు లోపలి వ్యవహారాలన్నీ స్మాల్ కాజు కోర్టులో పరిష్కారం కావాలి. ఈకోర్టుకి స్థిరాస్థితో సంబంధం లేదు.

ఆర్కియాలజీ

సంస్కృతంలో యిది ఆర్ష శాఖ. లేక పురాతత్వశాఖ. వురుదూలో ఆసారే ఖదీమా అంటారు.

నిజాము రాష్ట్రం, ప్రాచీనమైన కోటలూ, మసీదులూ, దేవాలయాలూ మొదలైనవాటికి భాండారంలా వున్నది. ఆవిధాలైనవి యీరాష్ట్రంలో వున్నన్ని మరెచ్చటా లేవు. వీటిని జాగ్రత్తగా వుంచడంకోసం యీశాఖ యేర్పాటైనది.

నిజాము రాష్ట్రంలో ఎన్నో రాజ్యాలు వెలసినవి. సామ్రాజ్యాలున్నూ వెలసినవి. వాటి తాలూకు శిధిలాలు ఇంకా లక్షలు నిలిచి వున్నవి. గోల్కొండ, వరంగల్లు దౌలతాబాదు, దేవరకొండ, రాచకొండ మొదలైన దుర్గములూ, అజాంతా యెల్లోరా మొదలైన గుహలూ, సాటిలేని చిత్రములూ,—వీటిని నైజాము గవర్నమెంటు చాలా జాగ్రత్తగా కాపాడుతున్నది. ఈరాష్ట్రంలో శిలాశాసనాలూ, తామ్రశాసనాలూ, తాళపత్రగ్రంథాలూ వగైరాలు కనిపెట్టి భద్రపరచవలసినవే యింకా లక్ష లున్నవి. నింపాదిగా అయినా ఈశాఖ ఆవిషయమై మంచిపని చేస్తున్నది.

నిజాంరాష్ట్రంలో ప్రాచీననిర్మాణాల్లో ప్రధానమైనవి వాటి వివరాలతో యిక్కడ చూపిస్తున్నాను.

౧. అజాంతా—ఇది ఔరంగాబాదుకు ౬౦ మైళ్ల దూరంలో వున్నది. కొండలలో గుహలు దొలిచి, ఆగుహల గోడలకు గచ్చుపూసి ౨౨౦౦ యేళ్లకిందట వాటిమీద రంగులతో అద్భుతమైన చిత్రాలు చిత్రింపబడ్డవి. అవి యిప్పటికీ మంచిస్థితిలో వుండి లక్షల కొద్దీ రసికులను ఆకర్షిస్తున్నవి

౨. అలంపూరు. ఇది రాయచూరు జిల్లాలో వున్నది. రెయిల్వే స్టేషనున్నది. ఇక్కడ ౨౦౦౦ యేళ్లకిందటి శైవదేవాలయాలున్నవి.

౩. ఔరంగాబాదు. స్టేషనున్నది. అసఫ్‌జాః ఔరంగజేబు పాదుషాల గోరీలూ, గుహలూ, కోటా వున్నవి.

౪. బిదర్—స్టేషనున్నది. కోట, అష్టద్వారాలూ, గోరీలూ వున్నవి.

౫. దౌలతాబాదు—ఔరంగాబాదుకి ౧౦ మైళ్లలో వున్నది. గొప్పకోట వున్నది.

౬. ఎల్లోరా—దౌలతాబాదు స్టేషనుకు రెండు మైళ్లలో వున్నది. గుహలూ, చిత్రాలూ వున్నవి.

౭. గోలకొండ—హైదరాబాదుకు నాలుగు మైళ్లలో వున్నది. గొప్పకోటా, గోరీలూ, మసీదులూ వున్నవి.

౮. ఇటుగి—రాయచూరుజిల్లాలో కొప్పలుకు ౧౫ మైళ్లలో వున్నది. గొప్పదేవాలయ మున్నది.

౯. జాల్నా—ఔరంగాబాదు జిల్లాలోది. స్టేషనున్నది. కోటా, దేవాలయమూ, మసీదులూ వున్నవి.

౧౦. కల్యాణి—గుల్బర్గాజిల్లాలోది. స్టేషనున్నది. అద్భుత శిల్పము లున్నవి.

౧౧. గుల్బర్గా—స్టేషనున్నది. కోటా మసీదులూ వున్నవి.

౧౨. నాందేడు—నాందేడు జిల్లాలోది. స్టేషనున్నది. సిక్కుల దేవాలయా లున్నవి.

౧౩. పైఠన్—అంటే ప్రతిష్ఠానపురం. ఔరంగాబాదుకు ౨౦ మైళ్లలో వున్నది. దేవాలయాలూ, మసీదులూ వున్నవి.

౧౪. రాయచూరు—స్టేషనున్నది. ఇక్కడ వున్న గొప్పకోట కోసం మనవాళ్లూ, తురకలూ అనేక యుద్ధాలు చేశారు. కృష్ణరాయడు దీన్ని పట్టుకొని జయించాడు.

౧౫. వరంగల్లు—స్టేషనున్నది. గొప్పకోటా, గొప్పదేవాలయ శిథిలాలూ వున్నవి. అనేకశాసనాలున్నూ వున్నవి. రుద్రమ్మా, ప్రతాపరుద్రుడూ సింహాసనాసీనులై వైరిగర్వనిర్భేదకంగా ప్రజాపరిపాలనం చేసిం దిక్కడే.

౧౬. యల్లందల—కరీంనగరుకు ౨౦ మైళ్లలో వున్నది. గొప్ప కోట వున్నది.

౧౭. హనుమకొండ—వరంగల్లు పక్కది. వ్యవహారరీత్యా యిప్పుడు వరంగల్లూ యిదీ నొకటే నగరం. వరంగల్లుజిల్లా ఆఫీసు లన్నీ యిక్కడే వున్నవి. రెండువూళ్లూ కలిసిపోతూనే వున్నవి.

౧౮. రామప్పగుడులు—వరంగల్లుకు నలభై మైళ్ల దూరంలో వున్నవి. మహారణ్యం మధ్య క్రూరజంతువుల విహారస్థలంలో వున్నవి. అద్భుతమైన శిల్పం. యూరపియనులు వేలకొద్దీ చూస్తూ వుంటారు. పగలే వెళ్లి రావాలి. రాత్రి అక్కడ వుండడం అపాయకరం. ఈ దేవాలయాల యిటుకలు నీటిమీద తేలుతవి.

౧౯. పానగల్లు—నల్లగొండకు నాలుగు మైళ్లలో వున్నది. గొప్ప దేవాలయా లున్నవి.

౨౦. పిల్లలమర్రి—నల్లగొండకు 30 మైళ్లలో వున్నది. గొప్ప దేవాలయా లున్నవి.

౨౧. దేవరకొండ } ఇవిన్నీ నల్లగొండకు 30 మైళ్లలో వున్నవి.
౨౨. రాచకొండ } గొప్ప కోట లున్నవి.

౨౩. కొలనుపాక—ఇది జైనుల పుణ్యస్థలం. గొప్ప జైనదేవాలయా లున్నవి.

౨౪. భద్రాచలం—మనదే. మనం యెరిగివున్నదే. (తక్కినవి మాత్రం మనవి కావు కనకనా? యెరగం కాని!)

౨౫. వేములవాడ—కరీంనగరుజిల్లాలోనిది. గొప్పదేవాలయా లున్నవి.

మతశాఖ

మహమ్మదీయుల మతాభినిరతి కిది గొప్ప నిదర్శనం. ఇట్టిది యీరాష్ట్రంలోనే వున్నది. ఇది ప్రత్యేకశాఖ. వుర్దూలో దీనిపేరు ఉమూరే మజహబీ. దీని అధికారి నాజిమ్.

నాజిమ్ ఆఫీసులో "మహమ్మదీయసంస్కరణశాఖ" అని వొక ప్రత్యేకశాఖ వున్నది.

మసీదులూ, దేవాలయాలూ, దర్గాలూ, వాటి యినాములూ—వీటి పరిశీలనకు ఈశాఖ పుట్టినది. మసీదులూ దేవాలయాలూ కట్ట దలచినవారు ముందుగా ఈశాఖవారి సెలవు పొందాలి. హిందువులకు మాత్రం యీసెలవు గగనపుష్పం అవుతూ వుంటుంది.

మతవిషయికమైన నిర్ణయాలూ, ఫత్వాలూ అప్పుడప్పుడు ఈశాఖ ద్వారానే యివ్వబడుతూ వుంటవి.

రంజాన్ పండుగరోజుల్లో ముసల్మానులు కల్లు సారా వగైరా తాగకుండా వుండేటట్టు ఈశాఖవారు చాలా గట్టిగా ఆజ్ఞలు జారీ చేస్తారు. తక్కిన పండుగ సమయాల్లో అనేక విధములైన ఆజ్ఞలు జారీచేస్తూ వుంటారు.

మక్కాయాత్రకూ, తక్కిన పవిత్రస్థలాల యాత్రలకూ ముసల్మానులకు యీశాఖద్వారా, సర్కారు చాలా సదుపాయాలు చేస్తారు. సాధారణంగా యాత్రికులకు ఖర్చు లిస్తారు. ఆయాత్రికులలో సర్కారు వుద్యోగులైనవారికి జీతం నష్టం లేకుండా సెలవులు కూడా యిస్తారు. స్పెషల్ రెయిళ్లు నడుపుతారు.

నైజాము గవర్నమెంటులో ప్రతిడిపార్టుమెంటు తాలూకు రిపోర్టూ ప్రతిసంవత్సరమూ తప్పకుండా ప్రకటించబడుతుంది. ఒక్క యీమతశాఖ రిపోర్టుమాత్రం మినహా.

దీనివల్ల, ఏటా, ఇతరమతాలలో ముసల్మాను లెందరు చేరారో, మనవాళ్లు—అందులోనూ గొర్రెలమందవంటి ఆంధ్రులు ఇస్లాము మతంలో యెందరు చేరారో తెలుసుకోడాని కవకాశాలు లేకుండా వున్నవి.

౧౩౪౨ ఫసలీలో ఈశాఖకూ, దీని ద్వారానూ అయినఖర్చు—

		ఖర్చు—రూపాయలు
౧.	శాఖాపరిపాలనకు	౧,౮౩,౨౪౯
౨.	మసీదులు, దేవాలయాలు వగైరా	౧,౬౮,౫౭౬
౩.	మతపాఠశాలలు	౧,౯౬,౩౩౧
౪.	హాజీ యాత్రికులకు	౩౨,౮౩౦
౫.	మామూల్దారులకు	౨,౩౧,౬౪౯
౬.	ఈదుల (పండుగుల) నిమిత్తం	౩౧,౫౨౫
౭.	మతవిషయక దానాలు	౨,౮౨,౩౭౭
౮.	ఇండ్లు	౭,౫౮౩
	మొత్తం	౧౨,౧౮,౪౮౨

మతపాఠశాలలూ, మతవిషయిక దానాలూ హిందూమతానికి సంబంధించినవీ, హిందువులకోసం ఖర్చు అయినవీ అవుతా యని చెప్పడానికి అవకాశంలేదు. అయినా కొవడమే వస్తే చాలా కొద్ది అయి వుంటుంది.

మసీదులకూ, దేవాలయాలకూ అన్న పద్దులో కూడా దేవాలయాల విషయం యింతే అయి వుంటుంది. ఆరాష్ట్రంలో మతరీత్యా హిందువులకు కలుగుతున్న యిబ్బందులను బట్టి యిది యిలా అనుకోవలసి వస్తున్నది.

ఏమయినా యీమతశాఖ కేవలమూ ముస్లిములకే గాని హిందువులకు ప్రయోజనకారి కాదు.

సైన్యం

నైజాముగారి సైన్యం రెండు రకాలుగా వున్నది.

౧. రెగులర్ (బాజాబితా) సైన్యం.

౨. ఇరెగులర్ (బేజాబితా) సైన్యం. దీన్ని నజం జమీయత్ అని పిలుస్తారు.

రెగులర్ సైన్యంలో	౪,౨౦౦	
ఇరెగులర్ సైన్యంలో	౧౨,౫౩౪	
మొత్తం	౧౬,౪౩౪	గురు సిపాయీలున్నారు.

౧౩౪౨ ఫసలీలో సైన్యం కోసం అయిన ఖర్చులు ౮౮,౫౮,౦౧౩ రూపాయలు. ఈమొత్తం నూటిలో పదిపాళ్లకు పైని అయినది.

వైద్యశాఖ

నిజామురాష్ట్రంలో కూడా అల్లోపతీ, యునానీ, ఆయుర్వేద వైద్యవిధానాలు వాడుకలో వున్నవి. కాని నైజాము సర్కారు అల్లోపతీవిధానానికే ప్రాధాన్యం చూపిస్తున్నారు.

హైదరాబాదులో అల్లోపతీ నేర్పే మెడికల్ కాలేజీ వున్నది. మద్రాసు జనరల్ ఆస్పత్రివంటి ఉస్మానియాఆస్పత్రికూడా వున్నది. ఇతడులో రోగులకు రాత్రి పగలూ కూడా చికిత్స చేస్తారు.

ప్రతీ తాలూకా పట్నంలోనూ వొక ఆస్పత్రి వున్నది.

ఈవైద్యశాఖవారు, మోటార్ల సాయంతో పల్లెటూళ్లలో సినీమా ప్రదర్శనాలు చేయించి ప్రజలకు ఆరోగ్యపద్ధతులు నేర్పుతున్నారు. రాష్ట్రంలో మలేరియా ఎక్కువగా వున్నది. దాన్ని పారదోలడం కోసం యెన్నో నూతులను పూడ్పించారు. ఎంతో కిరోసిన్నూ నెచల్లి దోమలను నాశనం చేయిస్తున్నారు. ఉచితంగా టీకాలు వేయిస్తున్నారు. నగరంలోనూ, రాష్ట్రంలోనూ వ్యాపించి వున్న ప్లేగు పోగొట్టడానికి అనేకవిధాలైన ప్రయత్నాలు చేసి విజయం పొందుతున్నారు.

హైదరాబాదులో స్త్రీల నిమిత్తం కొన్నుల వైద్యశాల వొకటున్నది. అట్టివి జిల్లాలలోనూ తాలూకాలలోనూ కూడా నెలకొల్పవలసివున్నది.

నైజాము సర్కారు యునానీ వైద్యము కూడా బాగా ప్రోత్సాహపరుస్తున్నారు. వారు, హైదరాబాదులో, చార్ మినారువద్ద "నిజామియా దవాఖానా" అనే పేరితో గొప్ప యునానీవైద్యశాల నడిపిస్తున్నారు. ఔషధాలూ, అక్కడ ఉచితంగా యిస్తారు.

ప్రతీ తాలూకాలోనూ కూడా యునానీ హకీములను ఏర్పాటు చేస్తున్నారు. అదివరకే వున్న సమర్థులైన హకీములకు గ్రాంట్లు ఇస్తున్నారు.

కాని నైజాముసర్కారు ఆయుర్వేదవైద్యాన్ని మాత్రం కడకంట నైనా చూడ్డం లేదు. ప్రజలే దాన్ని పోషించుకుంటున్నారు. ప్రజలలో నూటికి ౯౦ వంతులు ఆయుర్వేదచికిత్సతే చేయించుకుంటున్నారు.

మన మద్రాసు ప్రెసిడెన్సీలో, హిందువుల ప్రభుత్వం—అందులోనూ బ్రాహ్మణప్రభుత్వం—మళ్లీ అందులో కూడా కాంగ్రెస్సు ప్రభుత్వమే ఆయుర్వేదాన్ని నిరసిస్తున్నప్పుడు—తిరస్కరిస్తున్నప్పుడు—హేళన చేస్తున్నప్పుడు—దాంతో సాన్ కోఆపరేషను చేస్తున్నప్పుడు నైజాము సర్కారు ఆయుర్వేదాన్ని పోషించకపోతే ఆశ్చర్యం యెందుకూ?

వర్తమానాంధ్ర భాషానుశాసనము

మండపాక పార్వతీశ్వరశాస్త్రి

ఆంధ్రభాషకు మొదట అనుశాసనము చాళుక్యుల కాలములో జరిగినది. అది కావ్యభాషకుమాత్రమే అయి ఉండెను. ఆనాడు కావ్యేతర వాఙ్మయమునకు అంతగా ప్రయోజనము లేకుండెను. భాష మారుతూ ఉన్నప్పుడు కవుల ప్రయోగాలు మారుతూఉండెను. దానిని అనుసరించి, వ్యాకరణాలలో క్రొత్తసూత్రాలు కలుపుట జరుగుతూఉండెను. ఈవిధముగా కావ్యభాషానుశాసనము పెరుగుతూ ఉండెను. కావ్యేతర వాఙ్మయమారంభమైనది. శతకములు, పాటలు, కథలు, వ్యాఖ్యానములు, శాస్త్రములు ఈమొదలగు కావ్యేతర రచనలు పెచ్చుపెరిగినవి. వీటిలో, కథలు, వ్యాఖ్యానములు, శాస్త్రములు, కేవలవ్యవహారభాషలోనే పుట్టినవి. పాటలలో నూటికి ముప్పాతిక వాడుకమాటలే. శతకములలో నూటికి ఏబది వాడుకమాటలు. స్వతంత్రకవులకావ్యములలో నూటికి ఇరువదియైదు వాడుకమాటలు. ఈవిధముగా వాడుకభాషకు ప్రయోజనము కలిగిఉండెను.

పందొమ్మిదవ శతాబ్దమున రెండు సంచలనములు కలిగినవి.

(౧) ఇంగ్లీషువాళ్ళలో గద్యకావ్యపఠన.

(౨) నాటకరచన.

మొదటిదానికి ఇద్దరు సంప్రదాయకర్తలు బయలుదేరిరి. ప్రాచీనకావ్యేతర భాషాసంప్రదాయము ననుసరించి బ్రౌనుపండితులు.

ప్రాచీన కావ్యవాఙ్మయములోనున్న గద్యరచనా సంప్రదాయము ననుసరించి చిన్నయసూరిగారు.

బ్రౌనుదొరగారు పాశ్చాత్య గద్యరచనాధోరణిని, వాడుకభాషను అవలంబించిరి. చిన్నయగారు అరవదేశపువారు. దేశీయాంధ్రము వారికి రాదు. కావున, కావ్యములలో పద్యస్థానీయవచనమే వచనరచనకు లక్ష్యమునుకొని, ఆసంప్రదాయము పాఠశాలలలో ప్రవేశపెట్టిరి. బ్రౌనుదొరగారి మతము ఆంగ్లేయులలో నిలిచిపోయెను. చిన్నయ్యగారి మతము పాఠశాలలలో వ్యాపించి, తద్వారా లోకమందు వ్యాపించెను. ప్రాచీన సంప్రదాయమును అవలంబించుచుండిన పండితులుకూడ, ఈక్రొత్త సంప్రదాయము స్వీకరించిరి.

రెండవదగు నాటకరచన రెండుసంప్రదాయములతో ఆరంభమయ్యెను. వీధినాటకములలోనుండిన ప్రాచీన సంప్రదాయము ననుసరించి హాస్యనాటకములు వీరేశలింగాదు లారంభించిరి. చిన్నయసూరిగారి మతము ననుసరించి కొక్కొండప్రముఖులు గ్రాంథికనాటకము లారంభించిరి. మొదటిదానిలో పరిపక్వదశ కన్యాశుల్కములో కలదు. రెండవదానిలో పరిపక్వదశ చిత్రనళీయములో గలదు. రెండింటిలో అనౌచిత్యము కలదని భావించి వేంకటరాయశాస్త్రిగారు రెండును సంఘటీకరించి ప్రతాపరుద్రీయము వ్రాసిరి. వీరేశలింగముగారు సులభవచనరచన ఆరంభించిరి. ఈరెండును కొంతకాలము నిలిచిఉండెను. ఇంతలో శ్రీరామమూర్తి పంతులుగారు నిజమైన వచనరచనాసంప్రదాయము బైటపెట్టిరి. లోకము ఆమోదించినది. కావ్యకావ్యేతర వాఙ్మయము వాడుకభాషలోనే ఆరంభమై వ్యాపించినది. కావ్యభాషతో ఆరంభమైన ఏకత్వము పోయినది. కాని జీవముకలిగినది. జీవత్వముతో నానాత్వముకూడా ఆరంభమైనది.

ప్రస్తుత వాక్స్థానములు.

(౧) ఆంధ్రవిశ్వవిద్యాలయముతోపాటు సర్వాంధ్ర విద్యాశాలలు. ఆంధ్రభాషలో పఠనపాఠనములు జరుగవలసిఉన్నవి గనుక, భాషలో ఏకత కావలెను.

(౨) ఆంధ్రరాష్ట్రముతోపాటు శాసనసభలు, రాజకీయ కార్యస్థానములు. ఆంధ్రభాషలో చర్చలు తీర్మానములు, శాసనములు జరుగవలసిఉన్నవి. కావున భాషలో ఏకత, జీవముకూడ కావలెను.

(3) రాష్ట్రేతరాంధ్రాభ్యుదయము.

ఖండ ఖండాంతరములలో దేశదేశాంతరములలో లక్షలకొలదిగా ఉండే ఆంధ్రులందరికీ పరస్పరైకమత్యము ఆంధ్రమాతృభూమితో అవిచ్ఛిన్నమైన అనుబంధము కలిగించుటకు ఆంధ్రభాషలో, ఏకత, జీవము, కలిగి ఉండవలెను.

ఈమూడును ప్రధానమైన విషయములు. ఈవిషయమును గూర్చి విచారిస్తే, సజీవమైన ఏకభాషకు అవసరము కలుగుచున్నది.

ప్రాచీనకావ్యభాషలో ఏకతకలదుగాని జీవములేదు. నవీనవ్యవహారభాషలో జీవముకలదుగాని, ఏకత లేదు.

ఏకతకు కావలసినవి.

(1) Understandability.
(2) Reproducibility.

తెలిసికొనగలుగుతూఉన్నా మన్నమాట చాలదు. ప్రకృతి ప్రత్యయములలో ఒక రాజమార్గము ఉండవలెను.

కావున, సజీవమైన వ్యవహారభాషకు ఒక ఆనకట్టు కట్టి, తగిన కాలువలలో ప్రవహింపజేయుటకై ఏర్పాట్లు కావలసిఉన్నవి. దీనికే వర్తమానాంధ్రభాషానుశాసనమని అన్నాము.

ఇది ఆవశ్యకమని తోచినప్పుడు వెంటనే దాని ప్రయత్నములు జరుగవలెను. ఇది చేయవలసిన భారము ముఖ్యముగా విశ్వవిద్యాలయమువారిపై గలదు.

ఆంధ్ర రాష్ట్ర సమస్య

మల్లెల శ్రీరామమూర్తి

చెన్నపురి అసెంబ్లి శాసనసభలు రెండు ఏకగ్రీవముగ అంగీకరించిన ఆంధ్రరాష్ట్రమును గూర్చిన తీర్మానమునకు ఇండియా కార్యదర్శి వ్యతిరేకముగ నున్నాడని యీ ఏటి బడ్జెటు చర్చలో మద్రాసు ప్రభుత్వమువారు బయటపెట్టిరి. ఇండియా కార్యదర్శికి మద్రాసుప్రభుత్వముకు జరిగిన లేఖలను బయలుపెట్టరాదా యని యడుగ ఇంకనూ ఉత్తరములు జరుగుచున్నవి గాన బయలు పెట్ట వీలులేదని ప్రధాని రాజగోపాలాచారిగారు చెప్పిరి. ఇందులో ఏదో కుంభకోణమున్నదని చాలమంది అనుమానపడుచున్నారు—మన కాంగ్రెస్ అసెంబ్లి శాసన సభ్యులు క్రమశిక్షణకు వెరచి రాజగోపాలాచారిగారిని ఆంధ్రరాష్ట్రవిషయమై వత్తిడిచేయ జంకుచున్నారు. చివరకు ఆంధ్రులనుగూర్చిన ప్రశ్నలనడిగి తయారైన జబాబులను పొందుటకు భయపడి ప్రశ్నలనేవదలుకొనుటకు కాంగ్రెస్ సభ్యులు వెనుదీయుటలేదు—ఏమైనను యీ ఏటి బడ్జెటుచర్చలో ఆంధ్రరాష్ట్రమును గూర్చి—ఆంధ్రజిల్లాల ఆదాయమును ప్రత్యేకించుటను గూర్చి శ్రీ కొండ వెంకటప్పయ్య కళా వెంకట్రావుగార్లు మున్నగు కాంగ్రెస్ సభ్యులు—కాంగ్రెసేతరసభ్యులు—ఎంత విమర్శించిననూ రాజగోపాలాచారిగారు తమ తుదిసమాధానములో వారి విమర్శననుగూర్చి ఒక్కముక్కగూడ చెప్పలేదు. కౌన్సిలులో శ్రీ లక్కరాజు సుబ్బారావుగారు ఆంధ్రరాష్ట్రమును గూర్చి విశాఖపట్నం మెడికలుకాలేజినిగూర్చి ఆంధ్రవిశ్వకళాపరిషత్తును గూర్చి—మద్రాసుప్రభుత్వము వారి ఉదాసీనచర్యలను ప్రత్యక్షఉదాహరణలతోచించి చెండాడి తూర్పారబట్టినను ప్రభుత్వము సమాధానము చెప్పలేదు. అనగా దాదాపు 20 మంది ఆంధ్రఅసెంబ్లిసభ్యులు 30 మంది కౌన్సిలు ఆంధ్రసభ్యులు ఉన్నప్పటికి వీరందరు రాజగోపాలాచారిగారి దృష్టిలో మట్టిబొమ్మలుగ నున్నారని తేలిపోయినది — ఆంధ్రరాష్ట్రమునుగూర్చి ఇండియా మంత్రి వ్యతిరేకభావముపై మద్రాస్ప్రభుత్వ మేమిచేయ నున్నదను ప్రశ్నకు పైన ఆకాశము క్రింద నేలను రాజగోపాలాచారిగారు చూపిరి.

డా॥ పట్టాభి సీతారామయ్యగారి తరుణమున నాయకత్వము వహించి రాష్ట్రోద్యమమును నడపింతురని తలచినవారికి చాల ఆశాభంగము కలిగినది—పట్టాభిగారు వ్యంగ్యముగా ఒక ప్రకటన చేసిరి గాని దానివల్ల ప్రయోజన మేమి?

గాన యీ సమయమున ఆంధ్రరాష్ట్రోద్యమమును ఆంధ్రప్రజలే నడపించవలెను. ప్రచండాందోళన చేయవలెను—ప్రజలు చైతన్యవంతులై తమ శాసనసభా ప్రతినిధులను మద్రాస్ప్రభుత్వమును వత్తిడిచేయవలెను.

ఇండియా కార్యదర్శి సలహా సంఘ సభ్యులు శ్రీ రాఘవేంద్రరావుగారు ఆంధ్రరాష్ట్రసమస్య మద్రాస్ ప్రభుత్వమంత్రివర్గము చేతిలోను, మీ శాసనసభాప్రతినిధుల చేతులలోను కలదని చెప్పి—ఇండియా కార్యదర్శి ఆంధ్రరాష్ట్రతీర్మానమును ప్రతిఘటించుటలో మద్రాసు మంత్రివర్గమువారిలోటు ఏదో ఉన్నదని సూచించినారు. ఆలోటు ఏమిటని సందేహము కలుగుచున్నది—నాఉద్దేశములో 30-3-52న మద్రాసుశాసనసభలు చేసిన రాష్ట్రతీర్మానము కలగాపులగముగ యున్నది. ఆంధ్ర, తమిళ, కేరళ, కర్నాటక రాష్ట్రములుగ మద్రాస్ రాష్ట్రమును విభజించమని శాసనసభాతీర్మానము—ఈతీర్మానము అనాలోచితముగ అసందర్భముగ నున్నదని అప్పుడే చాలమంది విమర్శించిరి. ఇప్పుడైనను మద్రాస్ప్రభుత్వమువారు ఆంధ్రరాష్ట్రమును ప్రత్యేకించవలెనను తీర్మానము ప్రత్యేకముగ చేయుటవసరమని తోచుచున్నది—ప్రతి చిన్నవిషయములో ప్రతిష్ఠంభనకు తయారగుచున్న అఖిలభారత కాంగ్రెస్ సంఘము ఆంధ్రరాష్ట్రవిషయమై ఉపేక్షచేయరాదు. కాంగ్రెస్ ప్రభుత్వమైన మద్రాస్మంత్రివర్గతీర్మానమును భారత కార్యదర్శి తిరస్కరించినాడన్న రాష్ట్రస్వాతంత్రమునకు అడ్డువచ్చుటకాదా? ఈసమస్యపై మద్రాసుప్రభుత్వ

మంత్రివర్గమేల రాజీనామా యీయరాదు—ఆంధ్ర రాష్ట్రనిర్మాణసమస్య అఖిలభారతసమస్యగా ఏల చేయరాదు. భారతకాంగ్రెస్ వారిదృష్టిలోకి యీవిషయము చొప్పింపవలసిన బాధ్యత ఆంధ్రరాష్ట్రకాంగ్రెస్ సంఘముపైనను— మద్రాస్ ప్రభుత్వమంత్రివర్గముపైననూ గలదు—ఏదో కొంతకాలనిర్ణయముచేసి ఆలోగా రాష్ట్రనిర్మాణము జరుగనిచో మద్రాస్ మంత్రులు రాజీనామాలివ్వవలెను. ప్రతిష్ఠంభన చేయవలెనని ప్రజలు శాసనసభ్యులను—మంత్రివర్గమును కోరవలెను— ఆంధ్రప్రజలు శాసనధిక్కారము — పన్నుల నిరాకరణము జైళ్ళకుపోవుటకు సిద్ధపడుట—వీటికి తయారు కావలెను — ఆంధ్రరాష్ట్రనిర్మాణము ఆంధ్రప్రజల చేతులలోయున్నది—ప్రాణములిచ్చుటకు సిద్ధపడవలెను. అట్టి మహాత్యాగములుచేసినగాని రాష్ట్రము వచ్చు సూచనలు లేవు—ఆంధ్రులారా బహుపరాకు—యుద్ధమునకు సిద్ధముకండు. రాష్ట్రము సాధింపుడు. మద్రాస్ ప్రభుత్వమును వత్తిడిచేయుడు. మన రాష్ట్రనిర్మాణము మనచేతిలోనున్నదని ఆంధ్రులందరు తలచినరోజున రాష్ట్రము ఊడిపడును—

'ఆంధ్ర మాతకు జై'

దివ్యస్మృతి

నిన్నా మొన్నటిలా కనపడుతుంది.

కాని, నాగేశ్వరరావుపంతులుగారు చనిపోయి ఖరాగా సంవత్సరం అయింది.

కాలం నిలవదు. వెళ్ళిపోతూనే వుంటుంది.

కాని, అది, ప్రతీ దినమూ తెల్లవారి లేచాటప్పటికి "పంతులుగారు లేరు. తెలుసునా!" అని మనకి చెప్పి మరీ కదులుతుంది.

దినదినమూ ఆంధ్రపత్రిక చూస్తాను. వారంవారమూ వారపత్రిక చూస్తాను. నెలనెలా భారతి చూస్తాను.

కాని తృప్తి కాదు. ఏదో లోటుగా కనపడుతుంది.

మహాపురుషుల చిత్రాలలో, చిత్రకారులు, శిరస్సుల వెనక తేజోమండలాలు చిత్రిస్తారు.

దానివల్ల, చూసేవారికి, ఆపురుషులలో అనిర్వాచనీయమైన మహిమ గోచరిస్తుంది. వినీతభావమున్నూ కలుగుతుంది.

అయితే ఆ తేజోమండలాలు తొలగించేస్తే?

అవే చిత్రాలు, అదే శిల్పం, అదే జీవం, అదే సమస్తమూనూ,

కాని ఆనిండు వుండదు. ఆగరిమ కనపడదు.

మన హృదయాలకు ఆప్యాయనమున్నూ కలగదు.

పంతులుగారి సంస్థల విషయంలో కూడా యిదే పరిణామం.

సమస్తమూ యథాపూర్వంగానే వుంది.

కాని వారు లేరు.

ఆలోటు కనపడుతూనే వుంటున్నది.

ఏవిషయం తలుచుకున్నా పంతులుగారి ఆధారం మొదట లెక్కకి వచ్చేది.

ఏవుద్యమాని కయినా, ఏమనిషి కయినా వారు చేయూత యిచ్చేవారు.

చిరునవ్వు నవ్వుతూ యిచ్చేవారు.

ఇప్పుడూ వుద్యమాలు నడుస్తున్నవి. ఆగిపోవడం లేదు.

ఇచ్చేవారిస్తూనూ వున్నారు. మానడం లేదు.

కాని, ఏమిటో, ఆసన్నివేశం కనపడదు.

నిర్వాహకులకు అదిలాసా కలగడం లేదు. అనురక్తి పుట్టడం లేదు.

ఒక జిల్లాకి కాదు, ఒక వర్గానికి కాదు, ఒక పక్షానికి కాదు, ఒక వుద్యమానికి కాదు, పంతులుగారు లేకపోవడం, దేశాని కంతటికీ—వర్గాలకన్నిటికీ—పక్షాల

కున్నూ సర్వానికీ — అఖిలోద్యమాలకూ — ఆంధ్ర చైతన్యానికే దౌర్బల్యం కలిగిస్తున్నది.

ఒక్క మనిషే లేకపోత.

రెండుకోట్లు అరవైనాలుగు లక్షల ఆంధ్రులం వున్నాం.

అయినా వెలితే కనపడుతున్నది.

“ ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకమ్ ” అని. భవభూతి ప్రవచనం.

నాగేశ్వరరావుపంతులుగారి జీవితం దానికే వరవడి.

ధన్యులు వారు.

వారిని స్మరిస్తేనే మన నరాలు పొంగుతవి.

మనస్సు గుబగుబలాడుతుంది.

హృదయానికి నూతోన్మేజం కలుగుతుంది.

అడుగున్నూ ముందుకి పడుతుంది.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
౪-౪-౩౯ దైనికాంధ్రపత్రిక

ప్రబుద్ధాంధ్ర సరస్వతీ మందిరం

విమర్శనిమిత్తం యీకింది గ్రంథాలూ, వినిమయం కోరుతూ యీకింది కొత్తపత్రికలూ చేరినవి.

గ్రంథాలు

౧ వాడుకభాష: రచనకి కొన్నినియమాలు వెల ౦-౮-౦.
కర్త కేసుమళ్ల కామేశ్వరరావుగారు
నవ్యసాహిత్యపరిషత్తు-గుంటూరు.

౨ నానావిషయకరచనములు వెల ౧-౦-౦

౩ బాలవిజ్ఞానతరంగిణి ౨ వ భాగము వెల ౦-౧౨-౦
కర్త: కూచి నరసింహంగారు-పిఠాపురం.

పత్రికలు

౧ ఆనందవాణి. వారపత్రిక, విడిసంచిక వొక అణా, సంపాదకులు పుప్పాలూరి కాళిదాసు బి. ఎల్., గరిమెళ్ల సత్యనారాయణ బి. ఏ. గార్లు. త్యాగరాజనగరం. మద్రాసు.

౨ శ్రమజీవి. వారపత్రిక, సంవత్సరచందా ౧-౦-౦. విడిసంచిక వొక కాని. సంపాదకులు చిలకమర్రి నరసింహాచార్యులు బి. ఏ (ఆనర్సు) గారు. రాజమండ్రి.

౩ ఆంధ్రవాణి. వైవీక్లీ. సంవత్సరచందా ౬-౦-౦. సంపాదకులు బి. ఎన్. శర్మగారు, బెజవాడ.

౪ వైద్యకళ. మాసపత్రిక. సంవత్సరచందా ౧-౦-౦. సంపాదకులు చక్రవర్తుల నరసింహాచార్యులు ఏ. ఆర్. ఏ. సి గారు, బెజవాడ.

౫ విభూతి. మాసపత్రిక. సంవత్సరచందా ౨-౮-౦. సంపాదకులు పండిత చిదిరెమఠం వీరభద్రశర్మగారు. ౪-౨౬౭ సజనలాల్ వీధి, సికిందరాబాదు.

౬ సారథి. పక్షపత్రిక. విడిసంచిక వొక అణా, సంపాదకులు శ్రీగజపతిరాయవర్మగారు. సహకారులు సి హెచ్. ఎస్. మాధవరావు ఎన్. సత్యనారాయణగార్లు, తాడేపల్లిగూడెం.

రెవ్యూకోసం పుస్తకాలు

ప్రబుద్ధాంధ్రకు, రెవ్యూనిమిత్తం పుస్తకాలు పంపేవారు రెండేసి ప్రతులు—ఒకటి రెవ్యూ చేసేవారి నిమిత్తమూ మరొకటి పత్రికా భాండాగారం నిమిత్తమూ పంపాలి. ఒక్కప్రతే వచ్చే పుస్తకాలు రెవ్యూ చెయ్యబడవు. రెవ్యూలు సమర్థులచేతనే రాయిస్తాము; కాని యెలాంటి పరిస్థితులలోనూ వాటిమీద జవాబులూ పునర్విమర్శలూ ప్రకటించము.

సంపాదకుడు

సరస్వతీ గ్రంథ మండలి

కంభంవారి సత్రముపీధి *** రాజమహేంద్రవరము

నవలలు_నవరసభరితములగు నవలలు_ముచ్చటైనార్డు అచ్చుతో—ముద్దులొలుకు క్యాలికో బయిండుతో_రెండుమాసములకొక్క చక్కని నవల. నడుమ నడుమ చిన్న చిన్న అనుబంధగ్రంథములు వెలువడుచుండును. చందాదారులకు ప్రవేశరుసుము రు 0-4-0 చందాదారులు ఒకేసారి రు 7-8-0 ను ముందుగా పంపినచో వరుసగా ఆయాపుస్తకములు అన్ రిజిస్టర్డు పార్సిలుగా పంపుదుము.

ఇంతవరకు వెలువడిన గ్రంథములు

11 ప్రేమసుందరి	1 8 0	26 జాగిలము	1 8 0	41 ఛిన్నహస్తము (2వ భాగము)	1 8 0
12 చోరశిఖామణి	1 8 0	27 మొగలాయీదర్బారు 2 భా॥	1 8 0	42 కంకణరహస్యము	1 8 0
13 లక్ష్మీప్రసాదము	1 8 0	28 సరస్వతి	1 8 0	43 సంజీవి (1వ భాగము)	1 8 0
14 హత్యారహస్యము	1 8 0	29 ఆనందాభాయి	1 8 0	44 సంజీవి (2వ భాగము)	1 8 0
15 ఫాస్టు (1వ భాగము)	1 8 0	30 హత్యాన్వేషణము	1 8 0	45 వ్రజరాణి	1 8 0
16 ఫాస్టు (2వ భాగము)	1 8 0	31 మొగలాయీదర్బారు 3 భా॥	1 8 0	46 హత్యాభ్రమ	1 8 0
17 కుముద్వతి	1 8 0	32 గంగ	1 8 0	47 కాశీఖండము	1 8 0
18 చిన్నకోడలు	1 8 0	33 మొగలాయీదర్బారు 4 భా॥	1 8 0	48 సేవాశ్రమము (1వ భాగము)	1 8 0
19 రహస్యభేదనము	1 8 0	34 క్రోహెనూరు	1 8 0	49 సేవాశ్రమము (2వ భాగము)	1 8 [illegible]
20 సింహగడము	1 8 0	35 ఆటిన్ మణోలా	1 8 0	50 దాసీకన్య	1 8
21 మణిహారము	1 8 0	36 అపరిచిత	1 8 0	51 స్త్రీసాహసము ప్రథమభాగము	1
22 మొగలాయీదర్బారు 1వ భా॥	1 8 0	37 అంతఃపురము (1వ భాగము)	1 8 0	52 స్త్రీసాహసము 2వ భాగము	
23 ఘటనాచక్రము	1 8 0	38 అంతఃపురము (2వ భాగము)	1 8 0	53 మేరీరాణి	
24 రాజసుందరి	1 8 0	39 అగ్రహారము	1 8 0	54 రాజ్యలక్ష్మి	1
25 కుంకుమభరణి	1 8 0	40 ఛిన్నహస్తము (1వ భాగము)	1 8 0	55 లీల	1 8

అనుబంధములు

1 నృత్యతరంగిణి	0 12 0	10 శ్యామల	1 0 0	19 కథావళి	1 0 0
2 అభాగిని	0 12 0	11 కొంతం కథలు (చిన్నకథలు)	1 0 0	20 నాలుగుకథలు	1 0 0
3 ఛద్మవేషి	0 12 0	12 కాలసర్పి	1 0 0	21 నీతిప్రబోధిక	1 0 0
4 విదురుని యుపదేశములు	1 0 0	13 భారతకథాసారం	1 0 0	22 ఆదర్శము (1వ భాగము)	0 12 0
5 కాంచనమాల	1 0 0	14 కథాకల్పవల్లి (చిన్నకథలు)	1 0 0	23 ఊడంకుడు	0 12 0
6 సీమంతిని	1 0 0	15 అరక్షణీయ	1 0 0	24 భేతాళకథలు	0 12 0
7 సుశీల	1 0 0	16 మాధవి	1 0 0	25 దయ్యాలు	0 12 0
8 శశిరేఖ	1 0 0	17 లలిత	1 0 0		
9 యమునాబాయి	1 0 0	18 పెండ్లిదండ	1 0 0		

నాటకములు

1 మార్కండేయ	0 12 0	5 షాజహాను	1 0 0	9 దంపతులు	1 0 0
2 అహల్యాశాపవిమోచనము	0 12 0	6 నూర్జహాను	1 0 0	10 విజయవిజయం	1 0 0
3 మీవారుపతనము	1 0 0	7 దుర్గాదాసు	1 0 0	11 భక్తకుచేల	1 0 0
4 వరమాల	1 0 0	8 చంద్రగుప్త	1 0 0		

ఈ పుస్తకాలు రాజమండ్రీ కలాభివర్ధనీ పరిషత్తులోకూడా దొరుకును

వస్తుగుణప్రకాశిక

గిల్టు క్యాలికో బైండులో,
అనుబంధములతో
1150 పేజీల గ్రంథము

ఇది సమస్త వస్తువులయొక్క గుణములను సంపూర్ణముగ తెలియజేయు నూతనగ్రంథము. ఆంధ్రవైద్యలోకమునకు, స్త్రీ పురుషులకు మిక్కిలి యుపయోగకరమగునటుల సుప్రసిద్ధ ఆయుర్వేదవైద్యశిఖామణులు ఆయుర్వేదభూషణ, భిషగ్వర, పండిత బ్రహ్మశ్రీ పిటూరి వాసుదేవశాస్త్రి ఏ. ఎమ్. ఏ. సి. గారిచే వ్రాయబడినది. ఈగ్రంథమునందు ఉపయోగకరమగు వెక్కగుణములే 1104 పేజీలు గలవు. ఇవిగాక వివిధరోగములకు ఉత్పత్తి, వాటి చికిత్సలు 50 పేజీలవరకు అనుబంధములుగా చేర్చబడి, మొత్తము గ్రంథము 1150 పేజీలను కలిగి యున్నది. వస్తువులయందలి రస, వీర్య, విపాక ప్రభావములును, వాటిస్వరూపములును, గుణములును ప్రయోగములును ఈగ్రంథమునందు చక్కగ నిరూపింపబడినవి. వస్తుప్రయోగములు వంగసేన, వాగ్భటము, చరకము, నటకర్ణి, సుశ్రుతము, భావప్రకాశిక, భైషజ్యరత్నావళి, చక్రదత్త, హారీతసంహిత, ఆర్. ఎన్. ఖోరీ మొదలైన వివిధవైద్య గ్రంథరాజములనుండి సేకరింపబడి తద్గ్రంథముల పేళ్లతో నిందు పొందుపరుపబడినవి. వైద్య సాహాయ్యమవసరములేకయే యీగ్రంథముండిన సామాన్య రోగములన్నిటికి బజారులలో దొరకు సాధారణ వస్తువులతో చికిత్సలు జరుపుకొనవచ్చును. ఇది ప్రతియింట నుండదగిన అమూల్య గ్రంథము.

వెల రు. **5-0-0** (పోస్టుఖర్చులు ప్రత్యేకము)

వలయువారు :—

సరస్వతీ పవర్ ప్రెస్, రాజమండ్రి
అని వ్రాయవలెను

వస్తుగుణప్రకాశిక మాదిరి పేజీ

ద్రాక్ష :—ద్రాక్ష - మృద్వీకా - గోస్తనీ=Vitis vinifera.

జాతిభేదములు — ద్రాక్ష - Grapes. ఎండుద్రాక్ష - Sultanas. నల్లద్రాక్ష - Black large grapes. గింజలేని ద్రాక్ష చిన్నది - Muscateles. పెద్దద్రాక్ష - Raisians (Monakha)

స్వరూపము — ఇది ఉత్తమలతాజాతిలోనిది. ఇది చాల దూరము వరకును ప్రాకును. దీని యాకు 4 లేక 5 కోణదళములు గలిగి దళముల చుట్టునను స్పష్టముగ కంగోరా గలిగి అఱచేతివలెను, ఆకురంగునలుపు, ఆకుపచ్చ కలిసిన రంగు గలిగి యుండును. ఈ లత కచ్చటచ్చట చిన్న తీగెలు కూడ నుండును. ఆకులసందులనుండి లతాకాండమాధారముగా గొని కొలనగు పూగుచ్ఛకాండము లేచును. నులితీగలు కూడ కాండము నుండియే వెడలును. ఈనులితీగలే దీనికి విత్తనము. దీని ప్రకాండము పలకలుగా నుండును. ఆకులు విడివిడిగా నుండును. పుష్పములలో కొన్ని మిథునములుగను, కొన్ని ఏకలింగములుగను గలవు. ఉండవలసి నన్ని కింజల్కములు కూడ గలవు. పుష్పకాండమునుండియే కాయలు లేచును. యీ ఫలగుచ్ఛము గుండ్రముగను, కోలగను గూడ నుండును. ఒక ఫలగుచ్ఛమునకు రమారమి నంద కాయలవరకును ఉండును. ఫలగుచ్ఛము కాళీలేకుండ దట్టముగా నుండును. కొన్ని పళ్లు తెల్లగను, కొన్ని నల్లగను ఉండును. యీ తీగ సాధారణముగా శీతలప్రదేశములలో ఎక్కువగా పెరుగును. ఇది బెంగుళూరునందును, మలబారు, సేలం, పంజాబు ప్రదేశములయందును ఎక్కువగా పెరగును. దీనికి తేమగాలి పనికిరాదు. దీని కొమ్మలు అడ్డముగా పాతవలయును. ఇది జనుముతో దమ్ముచేసిన భూములలో పాతుదురు. ఇది అయిదారు అడుగులు ఎత్తు పెరిగిన తరువాత కొనలను కత్తిరించవలెను. దీనివలన ప్రక్కనుండు కొమ్మలు పెరుగును. కత్తిరించిన పిమ్మట పుష్పలు పూసి కాయుట కారంభించును. యీ పండ్లనుండి సారాయిని, బ్రాందిని తీయుదురు. దీని పండ్లే ఔషధమునకు ఉపయోగము.

అన్వర్థసంజ్ఞాపదములు : గుచ్ఛఫల - గుత్తుగుత్తులుగా నుండు ఫలములు గలది, చారుఫల - అందముగా నుండు ఫలములు గలది, రసాల - రసప్రధానమగు ఫలము, కాశ్మీరికా - కాశ్మీరదేశములో నుండునది.

వస్తుగుణప్రకాశిక మాదిరిపేజీ తరహాయి

ఇది తీపిని పులుపును గల రుచులు గలది.

గుణములు — శీతవీర్యముగలది, స్నిగ్ధగుణము, స్వరమును బాగుచేయును. రక్తపిత్తము, జ్వరము, శ్వాస, దప్పి, తాపము, క్షయ మొదలగువానిని హరించును. మూత్రదోషముల నన్నింటిని బోజేయును. మిక్కిలి వీర్యవృద్ధి తృప్తిని గలిగించును.

నల్లద్రాక్ష : ఇంచుమించుగ ద్రాక్షకంటె నిది ఉత్తమగుణములు గలది, మిక్కిలి మధురరసము హృచ్ఛలనమును బోజేయును.

లేతకాయ : ఇది కొంచెము చేదుగను, వగరుగను ఉండును. వేడిచేయును. విశదగుణము. పిత్తరక్తదోషమును గలిగించును.

మధ్యరకపుపండు : దీని రుచి మిక్కిలిపులుపు రుచిగా నుండును. జఠరదీప్తిని గలిగించును.

ఎండుద్రాక్ష : శ్రమహరము, సంతర్పణము, పుష్టిప్రదము. సంభోగశక్తిని వృద్ధిపరచును. మధురవిపాకము గలది. విరేచనమును మాత్రము కూడ చేయును. కఫకరము, మదాత్యయమును హరించును.

గింజలేని ద్రాక్ష : ఇది చిన్నదిగా నుండును. ద్రాక్షతో సమాన గుణములు గలది.

ప్రయోగములు — మూత్రరోధజ, ఉదావర్తములకు :—ద్రాక్ష పండ్లయొక్క రసము పరగడుపున త్రాగుచుండిన మూత్రరోధజ ఉదావర్తములు నివర్తించును. (శుశ్రుతము)

మదాత్యయములో గలుగు దప్పికి :—మదాత్యయములో మిక్కిలి దప్పిగొనినచో వాతపిత్తములు ప్రకోపించునెడ చల్లనిద్రాక్ష రసము నిచ్చిన దోషములోమనమయి మదాత్యయ పిపాసలు క్షయించును. (వాగ్భటము. చి. 7 అ.)

మూత్రకృచ్ఛ్రమునకు :—ఎండుద్రాక్షపండ్లు నీళ్లతో నూరి అరసము త్రాగినను, రాత్రి ద్రాక్షపండ్లు నీళ్లలో వేసి ఉదయమున ఆరసమును పడకట్టి త్రాగినను మూత్రకృచ్ఛ్రములు హరించును. (వాగ్భటము. చి. 11 అ.)

రక్తపిత్తమునకు :—ద్రాక్షారసము ప్రస్థంన్నర, పురాణసర్పి ప్రస్థం, ఈ రెండును కలిపి నెయ్యి మిగులునట్లు కాచవలెను. ఆఘృతమును పానము చేయుచుండిన రక్తపిత్తము, కామలాగుల్మము, పాండురోగము, జ్వరము, మోహముకూడ హరించును. (చక్ర॥)

క్షయకాసలకు ద్రాక్షారిష్టము : 50 ఫలములు ప్రమాణముగల ఎండుద్రాక్షను మెత్తగా త్రొక్కి రెండు ద్రోణముల నీటియందు వేసి నాల్గవవంతు మిగులునటుల కాచి దానిని పడకట్టి తీసికొని చల్లారిన పిదప అందు 200 ఫలముల బెల్లమును చేయవలెను. మరియు దాల్చినచెక్క, యాలకులు, జాపత్రి, నాగకేసరములు. ప్రేంఖణము, పిప్పళ్లు, మిరియములు వాయువిడంగములు యీవస్తువులయొక్క చూర్ణమును ప్రత్యేకముగా నొక్కొక్క ఫలము చేర్చి యివన్నియు నెయ్యిపూసిన కుండలో వేయవలెను. పైన మూకుడు మూతపెట్టి చీరమన్ను యిచ్చి ఒక మాసము నిలవయుంచవలెను. పిమ్మట దానిని తీసి వడియకట్టుకొని సిద్ధము చేసుకొనవలెను. దీనినే ద్రాక్షారిష్టము అందురు. ఇది అరఔన్సు మొదలు ఒక ఔన్సు వరకు సమానభాగముదకమును చేర్చి త్రాగుచుండిన క్షయ, దగ్గు, ఉరక్షతము, ఉబ్బసము, కంఠరోగములు హరించును. రక్తశుద్ధిని, రక్తబలమునుకూడ చేయును. కాంతిని ప్రసాదించును. కొలవిరేచనమును చేయుచుండును. ద్రాక్షాసవమునకు కూడ నీగుణమే గలదు. ఆసవమునగా కాచకుండా తయారుచేయునది.

ద్రాక్షాదిక్వాథము : దీనిని తరుచు మలయాళదేశమునందు వాడుచుందురు. సింహళమునందు కూడ దీని వాడుక మిక్కిలి గలదు. ద్రాక్షపండు, కరక్కాయ, నేలయుసిరిక, కర్కాటకశృంగి, కళింగరాస్నము, పిప్పలి, దూలగోవిలవేరు, తెల్లగలిజేరు, యెఱ్ఱగలిజేరు, వాకుడువేరు యీవస్తువులు కలిపిచేసిన చూర్ణమునకే ద్రాక్షాదిక్వాథ చూర్ణమని పేరు. ఇది కషాయముపెట్టి త్రాగ ఉబ్బసము, క్షయ, కాస మొదలగునవి శమించును.

ద్రాక్షాసారాయము : ఇది ఘాటును కొంచెము తీపిగను యుండును. మత్తును గలిగించును. బుద్ధివికాసమును, చురుకును ఆకలిని గలిగించును. ఉత్సాహప్రదమైనది. రోగక్షీణులకును, దుర్బలులకును మిక్కిలి ఉపయోగించును.

నవీనవైద్యకమతం — ద్రాక్షపండు నుపయోగించునప్పుడు చర్మమును, గింజలను తీసివేయవలెను. ఇది శ్రమహరమైనది. స్నిగ్ధసీతగుణము. మృదురేచనకరము. ఇది సాధారణముగా ఔషధములకు తీపిరుచి కలుగుటకు ఉపయోగింతురు. దీని రసము జ్వరములో జనించు పిపాసను, తాపమును, మలబద్ధమును బోజేయును. దీని ఆకు కషాయం అతిసారమునందు ఉపయోగించవచ్చును. యీలతయొక్క భస్మము మూత్రాశ్మరీరోగములందును, మూత్రాఘాతమునందును ఉపయోగించవచ్చును. యీ భస్మమును కొందరు దేశీయవైద్యులు పలాస్త్రీగా తయారుచేసి అండవాపులకును, మూలశంఖలకును ఉపయోగింతురు. నల్లద్రాక్షను సాధారణముగా విరేచనద్రవ్యములతో అరఖుగా వాడుదురు. కిస్మిసిపండ్లను సాధారణముగా లేహ్యములలో వాడుదురు.

వలయువారు :
సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరము